
BALA CHELIMI

SEP 2025




BALA

SEP

₹40

సెప్టెంబర్ - 2025

PRGI Regn. No. 52828/1992

# బాలచెలిమి

పిల్లల వికాస పత్రిక

# BALA CHELIMI

Telugu Children's Monthly Magazine

సంపుటి : 34 • సంచిక : 12

SEPTEMBER - 2025



Editor : **Er. VEDAKUMAR MANIKONDA**

A PUBLICATION OF **CHILDREN'S EDUCATIONAL ACADEMY,** HYDERABAD, TELANGANA



బాల చెలిమి
పిల్లల వికాస పత్రిక

# జాతీయ బాలచెలిమి కథల పోటీ 2025



**చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ చైర్మన్, బాలచెలిమి సంపాదకులు శ్రీ మణికొండ వేదకుమార్ గారి సారథ్యంలో, బాలల దినోత్సవం సందర్భంగా జాతీయ స్థాయిలో బాలచెలిమి కథల పోటీలు నిర్వహిస్తున్నారు.**

## రచయిత / రచయిత్రులకు సూచనలు

1. పిల్లలకోసం, పిల్లలు రాసిన కథలు, పిల్లల కోసం పెద్దలు రాసిన కథలు పంపవచ్చు.
2. పర్యావరణ పరిరక్షణ, కాలుష్యాలు - నివారణ, మానవతా నైతికవిలువలు, దుర్వ్యసనాలకు దూరం వంటి అంశాలకు ప్రాధాన్యం. మూఢనమ్మకాలను ప్రేరేపించేవి ఉండకూడదు, శాస్త్రసాంకేతికాలకు అవకాశం.
3. చేతిరాతలో (A4) మూడు పుటలు, టైపులో 2 పుటలకు మించరాదు.
4. రచనపై కథ పేరు తప్ప ఏమి ఉండకూడదు. హామీ పత్రం తప్పనిసరి లేకపోతే తిరస్కరణ.
5. ఎంపికైన కథలకు బహుమతులుంటాయి.
6. కథలను సంకలనం గాను, బాల చెలిమి పత్రికలోను ప్రచురణకు అవకాశం.
7. పోటీకి పంపిన కథ మరే పత్రికకు పంపకూడదు.
8. కొత్తగా రాసిన కథలు మాత్రమే పంపాలి.
9. అనుకరణలు, అనుసరణలు, తిరస్కరణ.
10. పిల్లలకు, పెద్దలకు బహుమతులు వేరువేరుగా ఉంటాయి. ప్రశంసాపత్రం, నగదు, పుస్తకబహుమతులు.
11. పాల్గొన్న ప్రతి విద్యార్థికి ప్రశంసాపత్రం అందించబడును.
12. గడువు: సెప్టెంబర్-20వ తేది కథలు పంపటానికి Email: edit.chelimi@gmail.com

లేదా

కథలు పంపవలసిన చిరునామా :

**బాల చెలిమి 'కథల పోటీ'**
'భూపతి సదన్', ఇ.నం: 3-6-716,
స్ట్రీట్ నం: 12, హిమాయత్ నగర్,
హైదరాబాద్ -500029, తెలంగాణ రాష్ట్రం.

**గరిపెల్లి అశోక్**
కన్వీనర్
9849649101


**(వివరాలకు: కొత్వాల్ సచిన్ -8686664949; ఖైజర్ బాషా - 9030626288)**

Printed at : Deccan Press, Azamabad, Hyderabad-20, Ph : 90599 50055

బాల చెలిమి

పిల్లల వికాస పత్రిక

సంపుటి: Volume: 34 | సంచిక : Issue : 12 | హైదరాబాద్ Hyderabad | సెప్టెంబర్ September | పేజీలు Pages 52 | రూ. ₹. 40














లోపలి పేజీల్లో.......




పిల్లల్లో పఠనాసక్తిని పెంచుదాం! ........ మణికొండ వేదకుమార్. ........ 5
ప్రజా సంక్షేమమే శాస్త్ర విజ్ఞాన లక్ష్యం కావాలి : కౌంట్ రంఫోర్డ్ (సైంటిస్ట్)........ జుగాష్‌విలి ........ 6
కల్పవృక్షం (ప్రపంచ కొబ్బరి దినోత్సవం) ........ డా. నీరజ అమరవాది ........ 7
సుష్మా స్వరాజ్ ........ షీరోస్-256........ 9
గేయాన్ని చార్టులపై రాసి అక్షరాన్ని గుర్తింపజేయడం (అక్షరం) ........ డా॥ జనపాల శంకరయ్య ........ 10
ఒక్కసారి ఆలోచించండి! (కథ)........ కె.వి. లక్ష్మణ రావు ........ 11
పొదుపు కథ ........ తల్లావజల మహేశ్ బాబు ........ 12
నా ప్రయాణ అనుభవాలు (కథ) ........ రేగులపల్లి జిపఉపా విద్యార్థులు........ 13
వేమన పద్యాలు........ ........ 14
బంగారు మర్రి - 4 (సీరియల్) ........ పైడిమర్రి రామకృష్ణ........ 15
బొంగరాలలా (ఆట)........ చిన్ననాటి ఆటలు-జ్ఞాపకాల మూటలు ... 16
విద్య ఉపయోగపడాలి (కథ) ........ కంచనపల్లి వేంకట కృష్ణారావు ........ 17
సాంకేతికత, ఆధునికత, నైపుణ్యాభివృద్ధి, విద్యావిధాన మార్పులతో.. ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ ........ 18
అస్సక మహాజనపదం (యాత్ర)........ దేశరాజు శ్యాంసుందర్‌రావు - స్థపతి .... 19
విహారం ........ డా.భీంపల్లి శ్రీకాంత్ ........ 20
మానవాళికి మార్గదర్శి మిలాద్-ఉన్-నబీ (పండుగ)........ డా. అమ్మిన శ్రీనివాసరాజు ........ 21
మునగ చెట్టు (చెట్టు - చేమ) ........ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి........ 23
పి.హెచ్.డి. కంటే ముందే నోబుల్ బహుమతి ఆవిష్కరణను... (సైన్స్ వెన్నెల-10) ..... డా. నాగసూరి వేణుగోపాల్ ........ 24
సరైన తీర్పు (కథ)........ కూచిమంచి నాగేంద్ర ........ 25
ఓ చింత చెట్టు కథ (కార్టూన్)........ జుగాష్ విలి........ 26
హుస్సేన్ సాగర్ సరస్సులో YAI టిస్కాన్ యూత్ ఓపెన్ రెగట్టాలో (స్పోర్ట్స్)........ బాలచెలిమి డెస్క్ ........ 28
నక్కల కోట (కథ) ........ డా. ఉప్పల పద్మ ........ 29
మంచు బిందువులు (అనువాద కథ) ........ అనిల్ బత్తుల ........ 31
పులి తోలు కప్పుకున్న గాడిద........ పంచతంత్ర కథ ........ 32

| | | |
|---|---|---|
| చీమలు (పాట) | గంగదేవు యాదయ్య | 32 |
| పర్యావరణ బతుకమ్మ (కథ) | ఆకిటి ఆశ్రిత | 33 |
| తపాలా డబ్బా | | 34 |
| రెండు వెల ఏండ్ల క్రిందటి వృత్తులు (చరిత్ర పాఠాలు-7) | డా. ద్యావనపల్లి సత్యనారాయణ | 35 |
| కోరుకున్న మూడు అంకెల సంఖ్య (మాథ్స్ ట్రిక్స్) | అంకెల మామయ్య చంద్రయ్య | 36 |
| గోడ గడియారం పెండ్యాల ఉగే సూత్రం | బాల కథా సౌరభం | 37 |
| చెలిమి క్లబ్, బొమ్మలేద్దామా... | బాలచెలిమి | 38 |
| భారతదేశంలో అత్యాధునిక తరగతి గది సాంకేతికతలు | బాలచెలిమి డెస్క్ | 39 |
| వత్తిలోకి చమురు ఎలా వెలుతుంది? (సైన్స్) | డాక్టర్ మహీధర నళినీ మోహన్ | 41 |
| నేర్చుకుందామా | | 42 |
| కలం-చెలిమి | | 42 |
| భారత రాజ్యాంగంలోని ముఖ్యమైన సవరణల జాబితా (జి.కె.) | బాలచెలిమి డెస్క్ | 43 |
| బాలల పుస్తకాల వెల్లువ | బాలచెలిమి డెస్క్ | 45 |
| మోవా - ఎగరలేని ప్రాచీన పక్షి కథ | సచిన్ కోత్వాల్ | 46 |
| ఆదర్శం - లక్ష్మీపూర్ బడి గ్రంథాలయం | పోరెడ్డి అశోక్ | 47 |
| సమాచారం | బాలచెలిమి డెస్క్ | 48 |
| ఆర్. విద్యాసాగర్ రావు (వ్యక్తిత్వం) | సువేగా | 50 |


# చెలిమి లేఖలు

నమస్కారం సార్, గత నెలలో బాలచెలిమి మాస పత్రికలో 'పులి కూన గెంతులు' కథను ప్రచురించినందుకు బాలచెలిమి సంపాదకులకు ధన్యవాదాలు.

**- తుమ్మవరపు వెంకటసాయి సుచిత్ర**

ఖమ్మం

బాలచెలిమి మాసపత్రికలో ప్రచురితమవుతున్న కథలు, జి.కే, కార్టూన్ కథలు నన్ను ఎంతగానో ఆకర్షించాయి. ఒకకాలంలో పిల్లల మాసపత్రికలు కేవలం బొమ్మలు చూసి ఆనందించే ఉపకరణాలుగా ఉండేవి. కానీ నేటి తరానికి పుస్తక పఠనం ద్వారా నైపుణ్యాభివృద్ధి సాధ్యమవుతుందన్న విషయం బాలచెలిమిలో వచ్చే రచనల ద్వారా స్పష్టమవుతోంది. ఈ పత్రిక కేవలం పిల్లలకే కాదు, పెద్దలకూ చదవదగ్గ విలువైన సమాచారాన్ని అందిస్తోంది. పిల్లలలోని చిత్తశుద్ధి, సృజనాత్మకతను పెంపొందించేందుకు బాలచెలిమి చేస్తున్న కృషి అభినందనీయం. ఇంత గొప్ప పత్రికను రూపొందిస్తున్న సంపాదకులు, యాజమాన్యానికి నా మనస్సుమాంజలులు.

**- రవీంద్రనాథ్**

తిరుపతి

చాలా బాగుంది 'బంగారుమర్రి' సీరియల్. ప్రతి భాగం ఉత్కంఠతతో నింపబడిన విధంగా, తరువాతి భాగం కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూసేలా సాగుతుంది. కథా, పాత్రల నిర్మాణం ఎంతో ఆకర్షణీయంగా ఉన్నాయి. రచయితకు అభినందనలు!

**- గుంద్రాతి సుబ్రమణ్యం గౌడ్**

---


*Cover Picture by*
పద్మశ్రీ గుస్సాడీ కనకరాజు,
మర్లవాయి గ్రామం

*Source from:*
నాగేంద్ర, IIT, Bombay

*బొమ్మలు:*
కూరెళ్ల శ్రీనివాస్,
m : 98495 43728





**సంపాదకులు : మణికొండ వేదకుమార్**

BALA CHELIMI
**"CHANDRAM"** 3-6-712/2, St.No.12,
Himayatnagar, Hyderabad - 500 029.
e-mail : edit.chelimi@gmail.com, www.balachelimi.com
Mob: 98480 44713

# పిల్లల్లో పఠనాసక్తిని పెంచుదాం!

పిల్లలూ.... సెప్టెంబర్ 5 విద్యావేత్త సర్వేపల్లి రాధాకృష్ణ పుట్టిన రోజు. ఆ రోజును ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నాం. మీరూ, బాలచెలిమి - ఉపాధ్యాయులందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు చెబుదాం.

అక్షరాస్యతలో దేశంలోనే కేరళ ముందున్న విషయం అందరికీ తెలుసు. శాస్త్రీయ ఆలోచనల్లో ముందు వరసలో వుంటుంది. విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంచడానికి కేరళ ప్రభుత్వం వచ్చే సంవత్సరం నుంచి పఠనా కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులకు గ్రేస్ మార్కులు ఇవ్వాలని నిర్ణయించింది. వారానికి ఒక పిరియడ్‌ను ప్రత్యేకంగా పఠనం కోసం కేటాయించనున్నారు. పాఠశాలలో జరిగే యితర సాంస్కృతిక కార్యక్రమాల్లో పఠనం ఒక భాగంగా ఉండాలని నిర్ణయించారు. ఈ నిర్ణయాలపై విద్యావేత్తలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నప్పటికీ విద్యార్థులో శాశ్వత పఠనాసక్తిని పెంచడం ప్రభుత్వ ఆలోచన అనడంలో సందేహం లేదు. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు దీనిని ఒక ప్రేరణగా స్వీకరించాలి. మన విద్యార్థులలో పఠనాసక్తిని పెంచే చర్యలు తీసుకోవాలి.

పిల్లలలో పఠనాసక్తిని పెంచడంలో ఉపాధ్యాయుల, తల్లిదండ్రుల పాత్ర కీలకమైనది. విద్యార్థులు పాఠ్య గ్రంథాలతో పాటు పాఠ్యేతర గ్రంథాలు చదివే అలవాటును అలవాటు చేయాలి. దీనికి అభిరుచి ఉన్న పిల్లలకు అంకితమైన ఉపాధ్యాయులదే ప్రధాన పాత్ర. పిల్లలకు అంకితమైన ఉపాధ్యాయులు ఉన్నారు. అందువల్లనే యింత బాలసాహిత్యం వస్తున్నది. ఈ రోజున గ్రామీణ ప్రాంతాల పిల్లలు కూడా కథలు రాస్తున్నారంటే వారిలోని సృజనాత్మకతకు, నైపుణ్యాలకు మెరుగులు దిద్దుతున్న ఉపాధ్యాయులే కారణం. పిల్లల్లో సృజనాత్మకత పెరగడానికి, వారి నైపుణ్యం పట్ల వారికి విశ్వాసం కలగడానికి సాధనా సామాగ్రీ కూడా అవసరం. ఉపాధ్యాయుల, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పాటు ప్రతి పాఠశాలలో గ్రంథాలయం ఉండాలి. అందులో మంచి పుస్తకాలుండాలి. కథల పుస్తకాలు, జీవిత చరిత్రలు, సైన్సు పుస్తకాలు ఉండాలి. పాఠ్య పుస్తకాలు ఉపాధి అవకాశాలిచ్చే జ్ఞానాన్నిస్తే పాఠ్యేతర పుస్తకాలు మానవుడిగా ఆవిర్భవించే వ్యక్తిత్వ నిర్మాణాన్నిస్తాయి.

పాఠశాలల్లో గ్రంథాలయాల ఏర్పాటుకు ప్రభుత్వం, పాఠశాల యాజమాన్యం, తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములు కావాలి. వివిధ పాఠశాలల్లో 100 బాలచెలిమి గ్రంథాలయాలను ఏర్పాటు చేయడానికి చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ, హైదరాబాదు కృషి చేస్తున్నది. ప్రారంభించిన గ్రంథాలయాలు మంచి ఫలితాలను యిస్తున్నాయి.

ఇంట్లో పిల్లలకు స్వంత గ్రంథాలయాల ఏర్పాటుకు తల్లిదండ్రులు చొరవ చూపాలి. బుక్ షెల్ఫ్ ఏర్పాటు చేయాలి. పిల్లలను బుక్ షాపులకు, బుక్ ఎగ్జిబిషన్స్‌కు తీసుకు వెళ్ళి వారికి ఆసక్తి ఉన్న పుస్తకాలు కొనిపెట్టాలి. రచయితలతో సంభాషించే ప్రయత్నాలు చేయాలి. చదివిన పుస్తకాల గురించి తోటి పిల్లలతో తమ అభిప్రాయాలను పంచుకునే అవకాశాలను ప్రోత్సహించాలి. పిల్లల్లో శాశ్వత పఠనాభిలాషను, ఆసక్తిని పెంచే దిశగా మనందరం ఆలోచించి, అందుకు కృషి చేద్దాం.

మీ

వేదకుమార్.యం

(మణికొండ వేదకుమార్)

ఎడిటర్ బాలచెలిమి





సైంటిస్ట్

# ప్రజా సంక్షేమమే శాస్త్ర విజ్ఞాన లక్ష్యం కావాలి: కౌంట్ రంఫోర్డ్

బెంజమిన్ థామ్సన్ (Benjamin Thompson), ప్రపంచానికి కౌంట్ రంఫోర్డ్ (Count Rumford) అనే పేరుతో ప్రసిద్ధి చెందిన శాస్త్రవేత్త, సామాజిక ఉద్యమకారుడు మరియు సాంకేతిక ఆవిష్కర్త. ఆయన 1753, మార్చి 26న అమెరికాలోని మెసాచుసెట్స్ రాష్ట్రం, నార్త్ వోల్డ్స్ అనే గ్రామంలో పుట్టారు. చిన్నతనంలోనే తండ్రి చనిపోయాడు, అనేక కష్టాలను ఎదుర్కొంటూ పట్టుదలతో చదువు సాగించారు. 1772లో బోస్టన్ నగరంలో క్లర్క్‌గా ఉద్యోగం చేరి. అదే సంవత్సరం ఉద్యోగం వదిలి స్కూల్ మాస్టర్‌గా జీవనం ప్రారంభించారు. అయితే, అమెరికన్ విప్లవ సమయంలో బ్రిటిష్ ప్రభుత్వానికి మద్దతు ఇచ్చిన కారణంగా, ఆయనపై కొందరు వ్యతిరేకత వ్యక్తం చేశారు. 1775లో, తన భార్య, కుమార్తె మరియు న్యూహాంప్‌షైర్ లోని తన ఆస్తిని వదిలి బ్రిటన్ వెళ్లిపోయారు.



1782లో బ్రిటిష్ ప్రభుత్వంలో "అండర్ సెక్రటరీ ఆఫ్ స్టేట్" పదవిని చేపట్టారు. కానీ ఫ్రెంచ్‌ల కోసం గూఢచర్యం చేస్తున్నాడన్న ఆరోపణలతో పదవికి రాజీనామా చేసి లండన్‌ను విడిచిపెట్టాల్సి వచ్చింది. ఆపై ఆయన ప్రధానంగా యూరప్‌లో నివసిస్తూ విజ్ఞాన రంగంలో విశేష కృషి చేశారు. 1784 నుండి 1795 వరకు జర్మనీలోని మ్యూనిక్ నగరంలో బవేరియన్ రాజు వద్ద చాంబర్లైన్‌గా సేవలందించారు. అక్కడే ఆయన తన సమాజోన్నతి పథకాలను ప్రారంభించారు. వ్యధిత ప్రజలకు వసతులు, శిక్షణ, విద్య అందించేందుకు చర్యలు చేపట్టారు. ఇతని పౌష్టికాహార పరిశోధనలు, రోగ నిరోధక ఆహార మార్గదర్శకాలు, ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరిచే ప్రయత్నాలు ప్రత్యేకంగా గుర్తించదగినవి. రంఫోర్డ్ చేసిన ప్రధాన ఆవిష్కరణలలో సెంట్రల్ హీటింగ్ సిస్టమ్, పొగ లేని చిమ్నీ, వంటగదిలో వినియోగించే ప్రెషర్ కుక్కర్, డబుల్ బాయిలర్, వంట రేంజ్, మరియు డ్రిప్ కాఫీ పాత్ర ముఖ్యమైనవి. ఇవన్నీ గృహ జీవితంలో ఒక పెద్ద మార్పును తీసుకువచ్చాయి. విద్యార్థుల కోసం సామూహిక భోజన వ్యవస్థను అందించడానికి డైనింగ్ హాల్ మరియు స్టీమ్ టేబుల్ అనే పద్ధతులను రూపొందించారు. ఆయన రూపొందించిన పౌష్టికాహారపు సూప్, మ్యూనిక్ నగరంలో ఈ రోజు కూడా అందుబాటులో ఉంది. విశేషంగా చెప్పాల్సింది ఏమిటంటే ఈ ఆవిష్కరణలన్నింటికీ ఆయన పేటెంట్లు తీసుకోలేదు. విజ్ఞానం సామాజిక సంక్షేమానికి వినియోగించాలి అనే నమ్మకంతో ఆయన జీవించారు. 1799లో ఆయన ఇంగ్లాండ్‌లో రాయల్ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ గ్రేట్ బ్రిటన్ అనే సంస్థను స్థాపించేందుకు సహకరించారు. దీని ప్రధాన లక్ష్యం శాస్త్ర విజ్ఞానాన్ని ప్రజలకు దగ్గర చేయడం. ముఖ్యంగా శ్రామిక వర్గానికి శిక్షణ ఇవ్వడం. కానీ ప్రారంభంలోనే సభ్యులు శాస్త్ర విజ్ఞానంపై కాక, ఎలిత్ విద్యపై ఎక్కువ దృష్టి పెట్టడంతో, రంఫోర్డ్ ఆశించిన విధంగా అది ముందుకెళ్లలేదు.

1802లో రంఫోర్డ్ రాయల్ ఇన్‌స్టిట్యూషన్ డైరెక్టర్ పదవికి రాజీనామా చేసి లండన్ వదిలిపెట్టారు. 1804లో ఫ్రెంచ్ శాస్త్రవేత్త లావోయిజియర్ భార్యను వివాహం చేసుకున్నారు. అయితే వారి మధ్య విభేదాలు తలెత్తి వివాహ జీవితం సంతోషంగా సాగలేదు. రంఫోర్డ్ జీవితం చివరికి ఒంటరిగా ముగిసింది. ఆయన 1814లో సెప్టెంబర్ 21న ఫ్రాన్స్‌లోని అడ్మిరల్ గ్రామంలో మరణించారు. ఆయన neither luxury nor poverty అన్నట్టు, ఓ మోస్తరు స్థితిలో జీవించారు. కౌంట్ రంఫోర్డ్ జీవితం ఒక వైవిధ్యమైన ప్రయాణం. ఆయన శాస్త్రసాధన, సామాజిక సేవ, ఆవిష్కరణలు అనేక మందికి మేలుచేసాయి. ఆయన చేసిన సాంకేతిక, సామాజిక మార్పులు ప్రపంచానికి ఇచ్చిన విలువైన బహుమతులుగా నిలిచిపోయాయి. విజ్ఞానం పంచుకోవాలన్న ఆయన దృక్పథం, వినయంతో కూడిన కృషి మనందరికీ ఆదర్శం.

– జుగాష్విలి

బాలచెలిమి డెస్క్, m : 83094 52998



# కల్పవృక్షం

హలో ఫ్రెండ్స్, ఎలా ఉన్నారు. ఆగస్ట్‌లో చాలా పండుగలు వచ్చాయిగా. ఎలా జరుపుకున్నారు. పూజలు, పండుగలలో వాడే పూజాద్రవ్యాలలో కొబ్బరికాయ అతిముఖ్యమైనది. కొబ్బరికాయ కొట్టకుండా మనం ఏ కార్యక్రమాన్ని చేసుకోము. ఏమిటీ.. మీకు కొబ్బరి నీళ్లంటే చాలా ఇష్టమా! అవి రుచిని, ఆరోగ్యాన్ని కూడా ఇస్తాయి. కొబ్బరిచెట్టు అన్ని భాగాలు ఎంతో ఉపయోగకరమైనవి. కొబ్బరికాయలు ఆహారం, పానీయం, ఔషధంగా వివిధ ఉపయోగాలున్న బహుముఖ పండు. ఇవి ప్రపంచ వ్యాప్తంగా చాలా మందికి విలువైన ఆదాయ వనరు.

The coconut trees is called the tree of life. Because all parts of the tree can be used to sustain human life.

మనం ఇప్పుడు కొబ్బరికాయ గురించి ఎందుకు మాట్లాడుకుంటున్నామని అనుకుంటున్నారా. పోషకాలతో కూడిన ఆహారాన్ని, పానీయాన్ని అందించటంతో పాటు ఆరోగ్యాన్ని కలిగిస్తున్న కొబ్బరికాయ గురించి ప్రజల్లో అవగాహన కలిగించడానికి ప్రపంచ కొబ్బరి దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 2వ తేదీన జరుపుకుంటున్నాము.

కొబ్బరి ఉత్పత్తులను పెంచి, దాని ప్రాధాన్యాన్ని తెలుపడం కోసం 1969 సెప్టెంబర్ 2న ఇండోనేషియా రాజధాని జకార్తాలో ఆసియా–ఫసిఫిక్ కోకోనట్ కమ్యూనిటీ (APCC) అనే అంతర్జాతీయ సంస్థ ఏర్పాటయింది. ఈ సంస్థ ఆసియా–ఫసిఫిక్ ప్రాంతంలో కొబ్బరి అభివృద్ధి కార్యకలాపాలను ప్రోత్సహించడానికి, సమన్వయం చేయడానికి, శిక్షణ శిబిరాలు, ఎగ్జిబిషన్లను నిర్వహిస్తున్నారు. ఆసియా– పసిఫిక్ కోకోనట్ కమ్యూనిటీలో 18 సభ్యదేశాలు ఉన్నాయి. 2009వ సంవత్సరం నుండి ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 2వ తేదీన ప్రపంచ కొబ్బరి దినోత్సవాన్ని జరుపుకుంటున్నాము. ఆ రోజున కొబ్బరి ప్రాముఖ్యతను, సాంస్కృతిక, ఆర్థిక ప్రాధాన్యాన్ని అందరికీ తెలియజేస్తారు. కొబ్బరి ప్రయోజనాలు, స్థిరమైన కొబ్బరి వ్యవసాయ పద్ధతులను ప్రచారం చేస్తారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కొబ్బరి పరిశ్రమ యొక్క తోడ్పాటు గురించి వివరిస్తారు. పరిశోధనల గురించి చర్చిస్తారు.

కొబ్బరికాయ బొటానికల్ పేరు కోకస్ న్యూసిఫెరా. కోకస్ అనేది స్పానిష్ పదం. దీని అర్థం కోతిముఖం. పరిశీలించి చూస్తే కొబ్బరిచిప్ప పై ఉండే మూడు ఇండెంటేషన్లు కోతిముఖాన్ని పోలి ఉంటాయి కదా. న్యూసిఫెరా అనేది లాటిన్ పదం. నట్ బేరింగ్ అని దాని అర్థం. కొబ్బరి ఆగ్నేయాసియాకు చెందినది. శతాబ్దాలుగా సాగుచేస్తున్నారు. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఉష్ణమండల ప్రాంతాలలో పెరుగుతుంది. చాలా మందికి ముఖ్యమైన ఆదాయము.

మనదేశంలో కొబ్బరికాయను శుభప్రదంగా భావిస్తారు. పెళ్లి, పేరంటం, పూజ, హోమం, గృహప్రవేశం... ఎటువంటి శుభకార్యాలలో అయినా కొబ్బరికాయ వినియోగం తప్పనిసరి. మానవ శరీరానికి ప్రతీకగా కూడా భావిస్తారు. కొబ్బరికాయ పైన ఉన్న పీచుని అహంకారానికి, లోపల ఉన్న కొబ్బరి మనసుకి, నీటిని నిర్మలత్వానికి ప్రతీకగా చెబుతారు. మన

దేశంలో కొబ్బరికి కేరాఫ్‌గా కేరళ రాష్ట్రాన్ని చెప్పుకోవచ్చు. అలాగే తెలుగు రాష్ట్రాలలో కోనసీమ కూడా కోకోనట్‌కి ప్రసిద్ధి. వీటితో పాటు తమిళనాడు, కర్ణాటక, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో కూడా కొబ్బరిని వ్యాపారపంటగా కూడా పండిస్తున్నారు. ఎండిన కొబ్బరి నుండి నూనెను తీస్తారు. ఇది వంటకాలకి రుచిని ఇవ్వడమే కాక కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచడంతో పాటు శరీర బరువును నియంత్రణలో ఉంచుకోవడానికి దోహదపడుతుంది. కొబ్బరినీటిలో ఎలక్ట్రోలైట్స్ ఎక్కువగా ఉంటాయి. విటమిన్ సి, పొటాషియం, కాల్షియం, మాంగనీస్, పీచుపదార్థాలు ఉంటాయి. తక్షణశక్తినిచ్చే పానీయం. కొబ్బరిపాలు, క్రీమ్‌ను వంటలలో, సౌందర్య సాధనాలలో కూడా ఉపయోగిస్తారు.

కొబ్బరి చెట్టులోని ప్రతి భాగం ఏదో రకంగా ఉపయోగపడుతుంది. కొబ్బరితో కోరినన్ని లాభాలు ఉండడంతో, కొబ్బరి చెట్టును కల్పవృక్షం అని పిలుస్తారు. పిల్లలూ మీరు గమనించారో లేదో.. కొబ్బరి ఆకులతో రకరకాల ఆట వస్తువులను, బొమ్మలను తయారుచేస్తారు. అలాగే కొబ్బరి ఆకుల మధ్య నుండి వచ్చే పుల్లలతో చీపుర్లను తయారుచేస్తారు. వీటిని పరిసరాలను, గదులను శుభ్రపరచడానికి ఉపయోగిస్తారు. కొబ్బరిపీచును పరుపుల తయారీలో వాడుతారు. ఎండిన కొబ్బరిచిప్పలతో ఎంతో అందమైన కళాకృతులను తయారుచేస్తారు. అంతేకాక కొబ్బరి చిప్పలతో 100 రకాల గృహోపకరణాలను తయారుచేస్తారు. పర్యావరణ ప్రేమికులు కొబ్బరిచిప్పలతో కప్పులను, చిన్న చిన్న గిన్నెలను తయారుచేయడమే కాక వాటినే ఉపయోగిస్తూ, మార్గదర్శకంగా ఉంటున్నారు. కొబ్బరి చెట్టును ప్రధానంగా కొబ్బరికాయల కోసమే పెంచినా వాటి ఉపఉత్పత్తులైన పీచు, కాండము మొదలగువాటికి కూడా ప్రపంచదేశాలలో మంచిగిరాకీ ఉంది. కొబ్బరిపీచును మలయాళంలో కొయర్ అని పిలుస్తారు. కేరళలో ఇది అతి పెద్ద కుటీరపరిశ్రమ. కొబ్బరి పీచును గోల్డెన్ ఫైబర్ అని కూడా పిలుస్తారు.

చిన్నారులూ కొబ్బరి చెట్టు పొడవుగా పెరుగుతుందని తెలుసుగా! మరి ఎంత ఎత్తు పెరుగుతాయో తెలుసా. కొబ్బరి చెట్లు సుమారు 30మీటర్ల ఎత్తు అంటే దాదాపు 100 అడుగుల వరకు పొడవు పెరుగుతుంది. కొబ్బరి చెట్లు 75 సంవత్సరాల పాటు పెరుగుతాయి. నాటిన ఆరేళ్లు నుండి కాపు వస్తుంది. ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, భారతదేశాలలో మొత్తం కొబ్బరి ఉత్పత్తిలో 73% ఈ దేశాల నుండే వస్తుంది. కొబ్బరి ఒక రకంగా ప్రకృతి ప్రసాదించిన అమృతభాండము అని చెప్పవచ్చు.

పిల్లలూ మీరందరూ కొబ్బరి గురించి కొత్తకొత్త విశేషాలు తెలుసుకున్నారుగా. ఇకముందు కూల్ డ్రింక్స్ తాగాలనుకున్నప్పుడు కొబ్బరినీళ్లు తాగడానికి ప్రాముఖ్యతను ఇవ్వండి. ఇంట్లో అలంకరణ వస్తువులుగా కొబ్బరితో చేసిన ఆకృతులకు స్థానం ఇద్దాం. ఆ రకంగా మనమందరం కొబ్బరి పంటను ప్రోత్సహిద్దాం. ఎంతో మందికి ఉపాధి కూడా దొరుకుతుంది.

“The magic of the coconut tree lies in the sweet water within”.

– డా. నీరజ అమరవాది
m : 9849160055

చందదారులుగా చేరండి!

బాల చెలిమి

చందదారులను చేర్పించండి!

'యం.వేదకుమార్ సంపాదకత్వంలో వెలువడుతున్న 'బాల చెలిమి' పిల్లల మాసపత్రిక బాలబాలికలకు చేరడంలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయ, పాఠశాల నిర్వహకుల, మేధావుల అమూల్య సహకారాన్ని కోరుతున్నాం. చందదారులుగా చేరడంతోపాటు తమకు తెలిసినవారిని చందదారులుగా చేర్పించాల్సిందిగా అభ్యర్థిస్తున్నాం.

SCAN & PAY

**మా చిరునామా :**

Bala Chelimi
**"CHANDRAM"** 3-6-712/2,
St.No. 12, Himayatnagar
Hyderabad - 500 029.
Mob: 9030626288
E-mail:desk.chelimi@gmail.com,
www.balachelimi.com

**చందా వివరాలు :**

| | | |
|---|---|---|
| విడి ప్రతి | : | రూ. 40 |
| వార్షిక చందా | : | రూ. 400 |
| 2 సం॥లకు | : | రూ. 750 |

'బాల చెలిమి' పేరిట నగదు, చెక్ లేదా ఆన్‌లైన్ రూపంలో చందామొత్తం చెల్లించవచ్చు.

**Account Details :**

| | |
|---|---|
| Bank Name | : Canara Bank |
| A/C No. | : 30101010003714 |
| Branch | : Ashoknagar, HYDERABAD. |
| IFSC Code | : CNRB0013010 |

# సుష్మా స్వరాజ్

## దౌత్య నిర్మాత, ప్రవాస భారతీయుల సంరక్షకురాలు

సుష్మా స్వరాజ్ (1952 ఫిబ్రవరి 14 - 2019 ఆగస్టు 6) రాజకీయ నాయకురాలు, భారతీయ జనతా పార్టీ (భాజపా) ప్రముఖ నాయకురాలు. ప్రభుత్వంలో ఆమె వివిధ ఉన్నత పదవులు నిర్వహించి, భారత రాజకీయాలకు గుర్తుండిపోయే సేవలు అందించారు.

సుష్మా స్వరాజ్ తన రాజకీయ జీవితంలో 2014 నుంచి 2019 వరకు భారత విదేశాంగ మంత్రిగా వ్యవహరించారు. ఇతర అనేక కీలక పదవులు నిర్వహించారు. భారత దేశ విదేశాంగ విధానంలో, విదేశాలలో ఉండి ఇబ్బందులు పడుతున్న భారత పౌరులకు సహాయం చేయడంలో కీలక పాత్ర పోషించారు. 1998లో ఢిల్లీకి అయిదో ముఖ్యమంత్రిగా కొంతకాలం పని చేసి, ఢిల్లీకి మొదటి మహిళా ముఖ్యమంత్రి అయ్యారు.




అనేకసార్లు పార్లమెంటు సభ్యురాలిగా ఆమె ఎన్నికయ్యారు. అనర్గళంగా మాట్లాడే నాయకురాలిగా, ప్రముఖ నాయకురాలిగా ఆమె మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ, కుటుంబ ఆరోగ్య సంక్షేమ మంత్రిత్వ శాఖలో ముఖ్యమైన పదవులను సుష్మా స్వరాజ్ నిర్వహించారు. ఆమె అత్యుత్తమ పార్లమెంటేరియన్ అవార్డు అందుకున్నారు, భారత పార్లమెంట్లో ఈ అవార్డు పొందిన మొదటి మహిళా సభ్యురాలు.

2019లో సుష్మా స్వరాజ్ చనిపోయారు. భారత రాజకీయాల్లో గొప్ప నాయకత్వానికి, ప్రజా సేవకు ప్రేరణగా నిలిచిపోయారు. ప్రజా వ్యవహారాలకు ఆమె అందించిన విశేష సేవలకు గుర్తింపుగా 2020లో ఆమెను మరణానంతరం పద్మవిభూషణ్‌తో గౌరవించారు. భారత దౌత్యం, పాలన, ప్రజా శ్రేయస్సు కోసం నిబద్ధతతో చేసిన కృషికి ఆమె ఈ గొప్ప గౌరవాన్ని పొందారు.

**- 'షీరోస్-256**


**ఇన్‌స్పైరింగ్ వుమెన్ ఫ్రమ్ ఇండియా'** నుండి....

### మీకు తెలుసా?


25 సంవత్సరాల వయసులో హరియాణా క్యాబినెట్‌లో అతి చిన్న వయసు కలిగిన మంత్రిగా సుష్మా స్వరాజ్ ఎన్నికయ్యారు.



# 1991 - ఆంధ్రప్రదేశ్ విద్యాపథకంలో - భాగంగా గేయాన్ని చార్టులపై రాసి అక్షరాన్ని గుర్తింపజేయడం- గుర్తించే అక్షరాన్ని ఎర్రని సిరాతో రాయడం



ఔర అల్లరి పోరడు
ఔనౌనంటూ ఆటలు మానడు
ఔరౌరా కొంటే పోరడు
"ఔర" ముందర ఏ అక్షరముంది? "ఔ" అక్షరం





అంబా అని దూడ అరిచింది
అంబా అని తల్లి ఆవు అరిచింది
అంబా అనగా ఆవు పాలు ఇచ్చింది
"అంబ"ల నడుమ ఎవలున్నారు? "ం" అక్షరం

అఃతపురములో రాణి ఉంది
అఃతపురములో అద్దాలున్నవి.
అఃతపుర అద్దంలో రాణి చూస్తుంది.
"అ" కు 'త' కు నడుమ ఎవరున్నారు? "ః" అక్షరం






కమలం నీళ్ళలో పెరుగుతుంది
కడవలో కలం మునిగింది
కందగడ్డ కమ్మగ ఉంది
"కడవ" పదంలో మొదటి అక్షరమేది? "క" అక్షరం



ఖర్జూర పండ్లు తియ్యగ ఉంటాయి
ఖర్బూజ పండ్లు ఎండకాలం తినాలి
ఖండ శర్కర తియ్యగా ఉంటుంది
"ఖర్జూరం"లో ముందర ఏ అక్షరముంది? "ఖ" అక్షరం

- డా॥ జనపాల శంకరయ్య
m : 8074727108

# ఒక్కసారి ఆలోచించండి!



ఆ రోజు వినాయక చవితి.

భూమ్మీద భక్తులందరూ, అమితమైన శ్రద్ధాసక్తులతో వినాయకుణ్ని పూజిస్తున్నారు. ప్రతీ ఊరిలో దేవాలయాల ముందు పందిట్లో వినాయకుని విగ్రహాలను పెట్టారు. ఆ విగ్రహాలు, రంగు రంగులతో, భారీ హంగులతో మిలమిలా మెరిసిపోతున్నాయి.

మూషిక వాహనుడై, వినాయకుడు, చవితి పందిళ్లను, భక్త జన సందోహాన్ని చూస్తూ, ఆనందించాడు.

"భూలోకంలో మానవుల భక్తి, శ్రద్ధలను చూస్తే, ముచ్చటగా ఉంది" మూషికంతో మురిసిపోతూ అన్నాడు.

"నిజమే, స్వామీ." బదులిచ్చింది మూషికం.

అలా కొంతదూరం వెళ్లేసరికి, ఒక చెరువు కనబడటంతో మూషికం ఒక్కసారిగా ఆగింది.

"కైలాసం నుండి ఇంతదూరం వచ్చినందుకేమో, కొంచెం దాహంగా ఉంది. చెరువులో నీరు తాగి, దాహం తీర్చుకుంటాను"స్వామిని అడిగింది.

"అయ్యో, భక్తుల సందడిలో పడి, నీ సంగతి మరిచాను. వెళ్లి దాహం తీర్చుకో"మంటూ వినాయకుడు ఆ చెరువు మెట్టు మీద నిల్చోన్నాడు.

అప్పుడే, 'స్వామీ' అన్న పిలుపు వినబడటంతో, వినాయకుడు, చెరువులోకి చూసాడు.

చెరువు చివర నున్న మెట్టు లోపల నుండి, కప్ప, చేప బయటకు తలెత్తుతున్నాయి.

"మీరేనా, నన్ను పిలిచింది"

"అవును, స్వామీ. అల్పజీవి అయిన ఎలుకను మీరు వాహనంగా చేసుకున్నారు. మీకు అల్పజీవులంటే మక్కువ, ఎక్కువని తెలిసే, మా బాధ మీకు విన్నవించుకోవాలని వచ్చాము". అన్నాయి, ఆ రెండూ.

"మీకు, బాధ కలిగిందా?చెరువు లోపల హాయిగా జీవిస్తున్నారనుకుంటున్నానే" స్వామి, వాటికేసి విచిత్రంగా చూస్తూ అన్నాడు.

"ఇప్పుడు బాగానే ఉంది స్వామీ. ఒక పది రోజులు గడవగానే, గణపతి నిమజ్జనం జరుగుతుంది. గణపతి పప్పా మోరియా" అంటూ భక్తులు, మీ ప్రతిరూపాలను ఈ చెరువులో కలుపుతారు."

"మంచిదేగా, మట్టిని చెరువుల్లోనూ, కాల్వల్లోనూ, నదుల్లోనూ నిమజ్జనం పేరుతో కలపడం, ద్వారా భూమి సాంద్రత పెరుగుతుంది. శ్రావణ మాసంలో వరద పేరుతో కొట్టుకు పోయిన మట్టి తిరిగి కలుస్తుంది. నీటి పరిమాణం పెరుగుతుంది. అది, మీకూ మంచిదేగా" మళ్లీ ఆశ్చర్య పోతూ అన్నాడు స్వామి.

"అవును, స్వామీ. కేవలం మట్టి విగ్రహాలు కలిపితే, మంచిదే. కానీ ఆకర్షణ పేరుతో, విషతుల్యమైన రంగులు పూస్తున్నారు. హంగులు పేరుతో, భారీగా హడావిడి చేస్తున్నారు. ఆ విష పదార్థాలతో, నీళ్లు పాడై పోతున్నాయి. గాలి కాలుష్యం. నీరు కలుషితం. ఇక మేమెలా బతకడం?

ఈ నష్టాన్ని, మా ప్రాణాన్ని మానవులు లెక్క చేయడం లేదు. తప్పు వారు చేస్తుంటే, ముప్పు మాకు కలుగుతోంది. నిమజ్జనం పేరుతో, నీటిని పాడుచేయడం మంచిదా? చెప్పండి స్వామీ".

"నిజమే, స్వామీ. కప్ప, గాలిలో నున్న విషవాయువులను పీల్చుతుంది. గాలిని శుభ్రం చేస్తుంది. చేప, నీటిని శుభ్రం చేస్తుంది. ఈ రెండూ లేకపోతే మానవ మనుగడకూ, ప్రమాదం ఏర్పడు తుంది. వాటి మొర వినండి. నా తోటి అల్ప జీవుల బాధను తీర్చండి" మూషికం కూడా అంది.

"మీ గాథ విన్నాను. మీ బాధ మీరు చెబితే తెలుసుకున్నాను. హాని పదార్థాలతో, విగ్రహాలను తయారు చేస్తే, నేను కరుణించను. భక్తి మంచిదే. పోటీ పేరుతో, నీటిని, గాలిని కలుషితం చేసే పదార్థాలతో విగ్రహాలను తయారు చేయడం చేత పర్యావరణం పాడై పోతుందని, భక్తులకు తెలిసేలా జేస్తాను. మట్టి విగ్రహాలను చేసినప్పుడే, వినాయకుడు ఆనందిస్తాడని, ప్రజలు గుర్తెరిగి ప్రవర్తించేలా మార్పు తీసుకుని వస్తాను".

వినాయకుని మాటలు విన్న కప్ప, చేపలు సంతోషిస్తూ, మూషిక వాహనునికీ, బొజ్జ గణపయ్యకూ, జై.. జై జై.." అంటూ జై కొట్టాయి.

* * *

అప్పుడే, వినాయకుని వేషంలో ఉన్న ప్రదీప్, "భక్తులారా. ఒక్కసారి ఆలోచించండి! విగ్రహాలకు ఆకర్షణ పేరుతో రంగులు వేయకండి. గాలిని, నీటిని కలుషితం చేయకండి" అని అన్నాడు.

* * *

ఐదో తరగతి చదివే పిల్లలతో, "ఒక్కసారి ఆలోచించండి" నాటకాన్ని వేయించిన సైన్స్ టీచర్ రాజా సార్‌ను, పిల్లల తల్లిదండ్రులంతా మెచ్చుకున్నారు. చక్కగా అభినయించిన ప్రదీప్, అతని తోటి పిల్లలను అభినందిస్తూ గట్టిగా చప్పట్లు చరిచారు. వినాయకుని విగ్రహాలను మట్టితోనే తయారు చేస్తామని మాటిచ్చారు.

– కె.వి. లక్ష్మణ రావు
m : 9014659041

## పొడుపు కథ

కడుపు నిండ గాలి కంఠమందున గోళి
మొట్టికాయ పెట్ట మొత్తుకొనుచు
తనివి దీర ఎండ దాహార్తి దీర్తును
దీని భావ మరసి తెలుపుడోయి.

(గోళీ సోడా)

తల్లావజల మహేశ్ బాబు
నిజామాబాద్






## సామెతలు


- అనువుగాని చోట అధికులమనరాదు.
- ఆ ఊరికి ఈ ఊరు ఎంత దూరమో, ఈ ఊరికి ఆ వూరు అంతే దూరం.
- ఇదుగో పులి అంటే అదుగో తోక అన్నట్లు.
- ఈనిన పులి పైన బడినట్లు.
- ఉన్న ఊరు కన్నతల్లి వంటిది.
- ఊరకున్న వాడికి ఊహలు రావు.
- ఎక్కడున్నావే కంబళీ అంటే వేసిన చోటనే గొంగళీ అన్నదట.
- ఏ కాలు జారినా మోపుకే మోసం.
- ఒక్కొక్క రాయి తీస్తుంటే, కొండయినా తరుగుతుంది.
- ఓడలు బండ్లవచ్చు, బండ్లు ఓడలవచ్చు.

– బాలచెలిమి

కథ

# నా ప్రయాణ అనుభవాలు

## (ముగ్గురు రేగులపల్లి విద్యార్థుల కథలు)




మేము అందరం రాత్రి పాఠశాలకు వచ్చాము. అంత లోపు టీచర్లు బస్సు తీసుకొని వచ్చారు. సామగ్రి సదిరి బస్సు ఎక్కించారు. అందరం పడుకున్నాము. మా బస్సు బయలు దేరింది. ఉదయం లేచేసరికి భద్రాచలం చేరుకున్నాము. భద్రాచలంలో ఆలయ మెట్లు ఎక్కి సీతారాముల దర్శనం చేసుకున్నాం. ఆ తర్వాత బస్సు ఎక్కి పాపికొండలకు వెళ్లి పడవ ఎక్కినాము పడవ ఎక్కిన తర్వాత పాటలు పెట్టారు. ఆటలు ఆడించారు. సరదాగా అల్లరి చేసుకుంటూ వెళ్ళాం. మధ్యలో ప్రాచీన శివాలయం ఉంది. కాలువలో కాళ్లు కడుక్కొని శివాలయంలో శివుడిని దర్శనం చేసుకుని పడవ ఎక్కాం. పడవలో ఆహారం పెట్టారు. తర్వాత పడవ ప్రయాణం మొదలైంది పాపికొండలు వచ్చాయి. అందరికీ కొండలు చూపించారు. తిరిగి ప్రయాణం చేశాం. ఈ ప్రయాణం ఒకరోజు పట్టింది. బస్సు ఎక్కి మేడారం వచ్చాము. మేడారంలో సమ్మక్క సారలమ్మల దర్శనం చేసుకొనేసరికి రాత్రి అయింది. మళ్ళీ బస్సులో రేగులపల్లికి బయలుదేరాము అర్ధరాత్రి పాఠశాలకు చేరుకున్నాం. మా సామగ్రినంత సర్దుకున్నాము. టీచర్లు తల్లిదండ్రులకు ఫోన్ చేశారు. వారు వచ్చి మమ్మల్ని ఇండ్లకు తీసుకొని వెళ్లారు.

**- యం.రమేష్**

8వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
గ్రా.రేగులపల్లి, మండలం బెజ్జంకి

### మా భాగ్యనగర ప్రయాణ అనుభవాలు

మేము వేసవి సెలవుల్లో హైదరాబాద్ వెళ్ళాము ఆ రోజు పొద్దున్నే లేచి స్నానం చేసి అన్నం తిని రేగులపల్లి నుంచి బయలుదేరాము. బస్టాండ్లో నిలుచున్నాము. పక్కన దుకాణంలో చిప్స్ ప్యాకెట్ కొనుక్కున్నాము. బస్సు రానే వచ్చింది. బస్సు ఎక్కినాము సీట్లు ఖాళీ లేవు. నిలుచున్నాము. బస్సులో ఎక్కువమంది సిద్దిపేటలో దిగేవాళ్లే. మాకు దేవుని దయవల్ల సిద్దిపేటలో సీట్లు దొరికినాయి. మధ్యాహ్నం మూడు గంటల 35 నిమిషాలకు హైదరాబాదులో దిగాము. ఇక్కడ ఆటో ఎక్కి మా బాబాయి వాళ్ళ ఇంటికి వెళ్ళాం. అక్కడ అన్నం తినుకుంటూ సినిమా చూశాము. అక్కడ పది రోజులు ఉన్నాము. దాని తర్వాత దమ్మాయిగూడ వెళ్లాం. అక్కడ మా బాబాయి వాళ్ళ ఇంటికి వెళ్ళాము అక్కడ బజ్జీలు కొనుక్కొని ఇంటికి వెళ్ళాము. అక్కడ ఒక మూడు రోజులు ఉన్నాము. తర్వాత చార్మినార్ వెళ్ళాం. అక్కడ మొత్తం తిరిగాను. అక్కడ నేను చెప్పులు కొనుక్కున్నాను. ఆ తర్వాత మా నాయనమ్మ వాళ్ళ ఇంటికి వెళ్ళాము. అక్కడ ఐదు రోజులు ఉన్నాము. ఆ తర్వాత ఆదివారం రోజున మా ఇంటికి బయలుదేరా అక్కడ బస్సు ఎక్కిన బస్సులో మక్క కంకి అమ్మే వాళ్ళు వచ్చారు. కంకి కొనుక్కొని తినుకుంటూ ప్రయాణం అయ్యాము. సిద్దిపేటలో దిగినాము.

అక్కడ మాకు తెలిసిన ఒక వ్యక్తి ఉన్నాడు. ఆయన ఆటో ఎక్కి మా ఇంటికి చేరుకున్నాం.

**– బి ప్రకాష్,**
8వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
గ్రా.రేగులపల్లి, మండలం బెజ్జంకి

## ప్రయాణ అనుభవాలు

ఉదయం 3 గంటల 30 నిమిషములకు మా మామయ్య కారులో వచ్చాడు. మేము తయారు అయ్యాం. తయారైన తర్వాత బట్టలు సర్దుకున్నాం. బట్టలు సదురుకొని కారులో ఎక్కి బయలుదేరాము. కరీంనగర్లో ఆగాము. అక్కడ మా కారులో వచ్చిన కొందరు. కరీంనగర్లో దిగినారు వాళ్ళు దిగిన తర్వాత మేము కారుకు సిఎన్జీ కోసం తిరిగాము అక్కడ ఒక పెట్రోలు బంకులో సిఎన్జి ఉంది కానీ అక్కడ పనిచేసే వారు ఇంకా లేవలేదు. ఇంకొక పెట్రోల్ బంకులో సిఎన్జి ఉంది అక్కడ కూడా పని చేసేవారు ఇంకా లేవలేదు. ఇంకొక పెట్రోల్ బంక్‌లో సీఎన్జీ ఉంది వాళ్ళు ఒక అర్ధగంట ఆగి రమ్మన్నారు అంతలోపు మేము చాయ్ తాగి పెట్రోల్ బంకుకు వెళ్ళాం వాళ్ళు లేవలేదు వాళ్లను లేపి సీఎన్జీ కొట్టించాం. తర్వాత అక్కడి నుండి బయలుదేరిన తర్వాత కరెక్టుగా గంటన్నరకు గోదావరిఖనికి చేరుకున్నాం. అక్కడి నుంచి శ్రీరాంపూర్ వెళ్లేసరికి అర్ధగంట అయింది. అక్కడి నుంచి భీమారం చేరే వరకు ఉదయం 6:00 అయింది అక్కడ పాల ప్యాకెట్లు, టిఫిన్ కొనుక్కొని వెళ్ళాము అక్కడి నుండి మా డాడీ కారు నడిపాడు. అక్కడ నుండి మా అమ్మమ్మ వాళ్ళ ఇంటికి వెళ్లినంక బ్రెష్ వేసుకొని ముఖం కడుక్కొని చాయ్ తాగిన తర్వాత రోజు పోచమ్మకు కోడి కోసాము. కోడిని కోసి వండుకొని తిన్నాం. తర్వాత రోజు సంఘంల పైసలు కట్టి మళ్లీ మా అమ్మమ్మ వాళ్ళ ఇంటికి వెళ్ళాం. మా తాత బండి నడిపాడు. తర్వాత మా పెద్దమ్మ వాళ్ళ ఇంటికి వెళ్ళాం. మా మామతోని వాళ్ళ ఇంటికి వెళ్లాను. తర్వాత రోజు మా తల్లిదండ్రులు వచ్చారు. ఇంటికి చేరుకున్నాం ఇలా మా ప్రయాణం జరిగింది

**– యన్.అన్వేష్**
8వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
గ్రా.రేగులపల్లి, మండలం బెజ్జంకి
m : 9603389441

*(విద్యార్థుల చేత ఈ కథలు రాయించిన రేగులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు జి. లింగేశ్వరశర్మగారు అభినందనీయులు)*

శతకం


# వేమన పద్యాలు

పసుల వన్నె వేరు పా లేకవర్ణమౌ
పుష్పజాతి వేరు పూజ యొకటి
దర్శనములు వేరు దైవంబు ఒక్కటి
విశ్వదాభిరామ వినురవేమ!

తాత్పర్యం : పశువులు ఏ రంగులో ఉన్నా పాలు మాత్రం ఒకే రంగులో ఉంటాయి. పూలు ఎన్ని రకాలైన పూజ మాత్రం ఒకే విధంగా ఉంటుంది. దర్శనాలు ఎన్నైనా కనబడే దైవం ఒక్కడే.

మిరపగింజ చూడ మీద నల్లగనుండు
కొరికి చూడు లోన చురుకు మనును
సజ్జను లగు వారి సారమిట్లుండురా
విశ్వదాభిరామ వినురవేమ!

తాత్పర్యం : మిరియపుగింజ మీద నల్లగా నున్నప్పటికి దానిని కొరికిన వెంటనే చురుక్కుమంటుంది. మంచి వారు పైకి ఏ విధముగా కనిపించినప్పటికీ అతనిని జాగ్రత్తగా గమనించినచో అసలు విషయము బయట



సీరియల్-4

# బంగారు మర్రి

(బాలలకోసం ఆధునిక సాహస నవల)

(గత సంచిక తరువాయి...)



టైగర్ ట్రాకర్ కాత్రాజు సంఘటన స్థలానికి చేరుకున్నాడు. అక్కడ ఉన్న బేస్ క్యాంప్ వాచర్‌తో తాను చుట్టుపక్కల ఉన్న చెట్లకు పులి పంజా విసిరి పెట్టిన గాట్లను గమనించినట్లు తెలియజేశాడు.

“ఐతే ఇక్కడ పులి తిరుగుతోంది. తన సామ్రాజ్యాన్ని విస్తరించుకోటానికి చెట్ల మొదట్లో పంజాతో గాయపరిచింది” అన్నాడు బేస్ క్యాంపు వాచర్.

“నిన్న వేటగాళ్లు ఈ ప్రాంతంలో సంచరించారంటే.. పులి వారిని చూసే ఉంటుంది” అన్నాడు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్.

“నెమల్లవాగు దగ్గర ఏర్పాటు చేసిన సెన్సార్ కెమేరా ఫోటోలు చూడండి. పులి కదలికలు ట్రాక్ చేయండి!” అన్నాడు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్. సెన్సార్ కెమేరా రాత్రిపూట అక్కడ సంచరించిన పులి ఫోటోలు పరిశీలించారు. వేటగాళ్లు పులి తిరిగిన ప్రదేశానికి దగ్గరగానే మంటలు వేసి మాంసాన్ని కాల్చుకు తిన్నారు.

పులిలోని ప్రతి అవయవం ఉపయోగకరమే. పులి చర్మం, గోళ్లకు మంచి డిమాండు ఉంటుంది. మిగిలిన అవయవాలను చైనీయులు సంప్రదాయ వైద్యంలో వినియోగిస్తారు. దీంతో స్మగ్లర్లు వాటిని వేటాడుతుంటారు.

“ఫోరెన్సిక్ రిపోర్ట్స్ వచ్చాయా!?”

“ఇంకా రాలేదు సార్”

వైల్డ్‌లైఫ్ ఫోరెన్సిక్స్ అనేది వన్యప్రాణుల నేర పరిశోధనల కోసం రూపొందించబడిన విలక్షణమైన రంగం. జంతువులను వేటాడటం, జంతువుల భాగాలు, మొక్కల ఉత్పత్తుల అక్రమ రవాణా ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ వ్యవస్థ అసమతుల్యతతో వృక్షజాలం, జంతుజాలం పరిరక్షణలో ప్రమాదాన్ని సృష్టిస్తుంది. అక్రమ వన్యప్రాణుల నేరాలపై ఫోరెన్సిక్ సైన్స్ యొక్క ఉపయోగం బయోసైన్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, సైంటిఫిక్ టెక్నిక్స్ మరియు ప్రొసీజర్స్‌పై జ్ఞానాన్ని సమగ్రపరిచి, నేరం జరిగిన ప్రదేశం నుండి సేకరించిన సాక్ష్యం నమూనాను అనుమానితుల నమూనాలతో సరిపోల్చడం జరుగుతుంది. AIWCలోని సెంటర్ ఫర్ వైల్డ్ లైఫ్ ఫోరెన్సిక్ సైన్సెస్ మోర్ఫోమెట్రిక్ మరియు DNA ఆధారిత విశ్లేషణ ద్వారా వివిధ రకాల వన్యప్రాణుల నమూనాల విశ్లేషణతో వ్యవహరిస్తుంది.

ఫారెన్సిక్ ల్యాబ్ రిపోర్ట్స్‌ని బట్టి కత్తికి అంటిన రక్తం పులివో కాదో తేలిపోతుంది. (సశేషం...)

– పైడిమర్రి రామకృష్ణ
m : 9247564699

ఆట

# బొంగరాలాట



**ఎంత మంది పాల్గొన వచ్చు –**
**ఇద్దరు నుంచి ఎంత మందైనా**

**ఎక్కడ ఆడవచ్చు –**
**ఇంట్లో లేదా బయట ఎక్కడైనా ఆడుకోవచ్చు**

**ఈ ఆటకు గల ఇతర పేర్లు – గేమింగ్ టాప్**

బొంగరములతో ఆడే ఆటను 'బొంగరాలాట' అంటారు. తాడుతో బొంగరం తిప్పటం, ఎక్కువ సేపు తిరిగేలా చేయటం, అరచేతిలో బొంగరాన్ని ఆడించటం గొప్ప నైపుణ్యానికి పరీక్షే. తాడును చుట్టేందుకు బొంగరం కింద వైపున మేకు ఉండి "V" ఆకారంలో పైకి మెట్లు మెట్లుగా ఉంటుంది. పై భాగాన డోమ్ వలె ఉండి చేతితో పట్టుకొని విసరడానికి అనువుగా ఉంటుంది. బొంగరానికి జాటీ చుట్టి విసిరినప్పుడు మేకు కింది వైపున ఉండటం వలన బొంగరం వేగంగా, ఎక్కువ సేపు తిరగడానికి అనువుగా ఉంటుంది. బొంగరం అందంగా కనపడటానికి డోం వలె ఉన్న పై భాగాన వివిధ రంగులు వేసి ఉంటాయి. సాధారణంగా మొదటి నుంచి ఉన్నవి, అందమైనవి – చెక్క బొంగరాలు. ప్రస్తుతం ప్లాస్టిక్ బొంగరాలను కూడా ఉపయోగిస్తున్నారు.

కొన్ని బొంగరాల ఆటల్లో, పిల్లలందరూ బొంగరాలన్నీ నేలమీద తిప్పుతారు. ఎవరి బొంగరమైతే ముందు పడిపోతుందో వారు దొంగ అవుతారు. వారి బొంగరాన్ని, ఒక వృత్తము మధ్యలో పెడతారు. మిగిలిన వారు, ఆ బొంగరము మీదకు, తమ బొంగరాలను చాలా వేగముగా విసురుతారు. బొంగరము క్రింద మేకు వుంటుంది కనుక. నేలమీద ఉన్న బొంగరానికి పెచ్చులు పోతాయి. గుంటలు పడతాయి. రంగు పోతుంది. కొన్ని సార్లు, నేలమీద ఉన్న బొంగరము పగిలి పోతుంది కూడా!

పిల్లలు తమ బొంగరాల మేకులను రాతి బండలమీద సాన బెట్టటము, తమ వేలుకు గుచ్చుకుని ఎంత పదును వచ్చిందో బేరీజు వేయటము, ఎవరి ఇంట్లోనైనా సాన రాయి వుంటే వారి ఇంటికి వెళ్లి దాన్ని వాడుకోవటము–ఇవన్నీ మధురమైన బాల్య స్మృతులు. ఈ బొంగరాల ఆట ఆడటానికి నైపుణ్యం మరియు ఆసక్తి అవసరమవుతాయి. ఈ ఆటను పిల్లలు మరియు యువకులు ఎక్కువగా ఆడతారు. మగవారు ధరించే దుస్తులు ఈ ఆటకు అనుకూలంగా ఉండుట వలన ఈ ఆట మగవారు ఆడే ఆటగా ప్రసిద్ధి చెందింది. కొన్ని జాగ్రత్తలు తీసుకొని ఈ ఆట ఆడినట్లయితే చూసే వారికి, ఆడే వారికి చాలా ఆసక్తిగా ఉంటుంది.

**ప్రయోజనం:** ఈ ఆట ద్వారా ఏకాగ్రత పెరుగుతుంది. అలాగే అసాధ్యాన్ని సుసాధ్యం చేయగల నమ్మకం కలుగుతుంది.

– 'చిన్ననాటి ఆటలు–జ్ఞాపకాల మూటలు' నుండి...

# విద్య ఉపయోగపడాలి




తల్పగిరి రాజుగారు మహాదిత్య ప్రతి సంవత్సరం తన పుట్టిన రోజుకు ఉత్తమ విద్యలు ప్రదర్శించే వారికి వారి విద్యలను బట్టి వారికి విలువైన బహుమతులు ఇచ్చేవాడు. కానీ పోటీకి వచ్చిన వారి విద్య వలన రాజ్యానికి గానీ సంఘానికి గానీ మేలు జరిగేట్టుగా ఉండాలనే షరతు కూడా విధించేవాడు. అందుకే పోటీలు నిర్వహించినపుడు వారిని పరిశీలించి, ఆ విద్యల వలన ఉపయోగం తెలపడానికి గురుకులాల గురువులను, ఆయా విద్యలు క్షుణ్ణంగా తెలిసిన గురువులను రాజు మహాదిత్య పోటీలు నిర్వహిస్తున్నప్పుడు పిలిపించి వారి అభిప్రాయాలు తెలుసుకుని వారు చెప్పిన విధంగా బహుమతులు ఇచ్చేవాడు.

ఆ విధంగా ఒక సంవత్సరం రాజుగారి పుట్టిన రోజుకి ఓ పది మంది తమ విద్యలు ప్రదర్శించడానికి వచ్చారు. కొందరు కత్తి యుద్ధంలో కొన్ని కొత్త మెళకువలు చూపారు. మరొకరు పొలంలో ఒక పద్ధతిలో విత్తనాలను చల్లే యంత్రాన్ని ప్రదర్శించాడు. బహులవ్య అనే విలుకారుడు తను సంధించిన బాణాన్ని కనీసం మైలు దూరానికి గురిచూసి కొట్టగల విద్య ప్రదర్శించాడు! అంతదూరం బాణం వేయగల బహులవ్య విద్యను రాజుతో పాటు అందరూ మెచ్చుకన్నారు. "నీ విద్య వలన ఎవరికి మేలు జరుగుతుంది? అది కేవలం ప్రదర్శించడానికి బాగుంది" అని రాజు అన్నాడు.

పోటీలో పాల్గొన్న వారి విద్యలను పరిశీలించి తన అభిప్రాయం చెప్పడానికి వచ్చిన శివానందుడు అనే గురువు అతని విద్యను పరిశీలించిన తరువాత ఈ విధంగా చెప్పాడు. "బహులవ్యా నీ విద్య అధ్భుతం, కానీ ఆ విద్యవలన సంఘానికి కానీ రాజ్యానికి కానీ జరిగే మేలు ఏమిటి? అనేది ప్రశ్న నీ విద్య చూసిన తరువాత నాకు ఒక మంచి ఆలోచన వచ్చింది. మన రాజ్యంలో మహదేవపుర అడవి అనేక కారణాల వలన అంతరించి పోతోంది, అందులో ముఖ్యకారణం చెట్లు విచ్చలవిడిగా కొట్టివేయడం, ఆ కారణంగా అడవిలో జంతువులకు సరైన నీడ, తిండి, నీళ్ళు దొరకడం లేదు. చెట్లు తగ్గి పోయినందువలన వానలు కూడా పడటం లేదు! నీవు బహుదూరానికి బాణాన్ని వేయగలవు కాబట్టి ఆ బాణాలను హింసకు ఉపయోగించ కుండా, ఆ బాణాలకు ముందు రకరకాల విత్తనాల మూటలు కట్టి నలు దిక్కులలో అడవిలో పడేటట్టు వేస్తే అవి అడవిలో పడి పరిస్థితులు అనుకూలించినపుడు మొలకెత్తుతాయి మరలా అడవి చెట్లతో చిక్కదనాన్ని సంతరించుకుంటుంది. చెట్లు బాగా పెరుగుతే గాలిలో ప్రాణవాయువు, ఆహ్లాదకర వాతావరణం పెరిగి వానలు పడి పంటలు పండుతాయి. నీ విద్య వలన అడవే కాదు చుట్టు పక్కల గ్రామాలు కూడా బాగుపడతాయి" వివరించాడు గురువు శివానందుడు.

"నా విద్య వలన అంత మేలు జరుగుతుందంటే అంతకన్నా కావలిసిందేముంది?'' అని రాజుకి శివానందుడికి నమస్కరించాడు బహులవ్య. ఆ మాటలు విన్న రాజు మహాదిత్య చప్పట్లు కొట్టి బహులవ్యకు ఎన్నో కానుకలు, మంచి తోట పెంచడానికి స్థలం కూడా శివానందుని సూచన మీద ఇచ్చాడు. బహులవ్యకే కాకుండా పొలంలో ఒక పద్ధతిలో విత్తనాలు నాటే యంత్రం కనిపెట్టిన అతనికి కూడా మంచి బహుమతులు ఎకరం పొలం ఇచ్చాడు. శివానందుని ఆలోచనను సభలోని వారే కాక విషయం తెలిసిన ప్రజలు కూడా ఎంతో మెచ్చుకున్నారు.

– కంచనపల్లి వేంకట కృష్ణారావు
m : 9348611445

## సాంకేతిక, ఆధునికత, నైపుణ్యాభివృద్ధి మరియు విద్యా విధాన మార్పులతో...

# ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్



Oxford Grammar High School తన విద్యా విధానంలో Carte Blanche అనే ప్రత్యేక అభిగమాన్ని అనుసరిస్తూ విద్యార్థులకు స్వేచ్ఛాయుతమైన, ఆవిష్కరణాత్మక మరియు అభివృద్ధి కేంద్రిత వాతావరణాన్ని కల్పిస్తోంది. విద్యార్థులు ఇక్కడ స్వతంత్రంగా ఆలోచించడం, సృజనాత్మకతను ప్రదర్శించడం, సమస్యలను పరిష్కరించడం వంటి అవకాశాలను అనుభవిస్తున్నారు. తరగతులు స్మార్ట్ బోర్డులు, ప్రొజెక్టర్లు, హై-స్పీడ్ ఇంటర్నెట్ వంటి ఆధునిక సదుపాయాలతో అమర్చబడగా, ఉపాధ్యాయులు డిజిటల్ పాఠ్య పద్ధతులు, యానిమేషన్లు, సిమ్యులేషన్లు ద్వారా క్లిష్టమైన అంశాలను సులభతరం చేస్తున్నారు. DIKSHA, Google Classroom, NCERT వంటి వనరులు విద్యార్థుల లోతైన అభ్యాసాన్ని మరింత ప్రభావవంతం చేస్తున్నాయి.

AR మరియు VR ల్యాబ్‌ల సహాయంతో సౌరమండలం, చారిత్రక స్మారకాలు, మానవ శరీర నిర్మాణం వంటి అంశాలు ప్రత్యక్ష అనుభవంగా అర్థమవుతుండగా, AI ఆధారిత టెక్నాలజీ ప్రతి విద్యార్థి ప్రత్యేకతలకు అనుగుణమైన వ్యక్తిగత అభ్యాస మార్గాలను సూచిస్తోంది. STEM మరియు రోబోటిక్స్ క్లబ్బులు విద్యార్థుల ప్రతిభను డ్రోన్‌లు, రోబోలు, IoT ప్రాజెక్టులు వంటి ఆధునిక రంగాల్లో వికసింపజేస్తున్నాయి.

హైబ్రిడ్ మరియు ఫ్లిప్డ్ క్లాస్ రూమ్ పద్ధతుల్లో విద్యార్థులు పాఠాలను ముందుగానే వీడియోల ద్వారా తెలుసుకుని తరగతిలో చురుకైన చర్చలు, ప్రాజెక్టులు, సమస్య పరిష్కారం వంటి కార్యక్రమాల్లో పాల్గొనుతున్నారు. Google Workspace, Microsoft Teams ఆధారంగా సమిష్టి ప్రాజెక్టులు, చర్చలు మరింత సహకార పూర్వక వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. అదనంగా, ఆన్‌లైన్ పరీక్షలు తక్షణ ఫలితాలను అందించగా, డాష్ బోర్డులు హాజరు, ప్రగతి, పాల్గొనిక వంటి సమాచారాన్ని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకి రియల్ టైమ్‌లో చేరుస్తున్నాయి. Predictive tools అవసరమైన విద్యార్థులను ముందుగానే గుర్తించి మద్దతు అందిస్తున్నాయి.

ఉపాధ్యాయులు నిరంతర డిజిటల్ ట్రైనింగ్, డిజైన్ థింకింగ్, ICTలో నైపుణ్యాలను పెంపొందించుకుంటూ బోధనను సరికొత్త రంగాల్లోకి తీసుకువెళ్తున్నారు. EdTech మెంటర్లు Canva, Adobe Express, Scratch, Python వంటి సాధనాలను పరిచయం చేస్తూ బోధనను మరింత ప్రేరణాత్మకంగా మలుస్తున్నారు. విద్యార్థులు యాప్‌లు, పోడ్‌కాస్ట్‌లు, గేమ్స్, డిజిటల్ పోస్టర్లు వంటి రూపాల్లో తమ సృజనాత్మకతను వ్యక్తం చేస్తూ Hackathons, Innovation Challenges, డిజిటల్ ప్రదర్శనల ద్వారా జట్టు పని, నాయకత్వం, సమస్య పరిష్కారం నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటున్నారు.

విభిన్న సామర్థ్యాలు, భిన్న భాషా నేపథ్యాలున్న విద్యార్థులకు స్క్రీన్ రీడర్లు, వాయిస్-టు-టెక్స్ట్, అనువాద యాప్లు సహాయపడుతుండగా, పాఠశాల పర్యావరణ బాధ్యతను గౌరవంగా నెరవేర్చుతోంది. డిజిటల్ గ్రీన్ బోర్డులు, e-waste కార్యక్రమాలు, ఎనర్జీ సేవ్ చేసే ల్యాబ్‌లు సుస్థిరత పట్ల పాఠశాల ప్రతిబద్ధతను చూపుతున్నాయి.

తల్లిదండ్రులు స్కూల్ యాప్‌లు, పోర్టల్స్ ద్వారా హాజరు, ఫీజులు, విద్యార్థుల ప్రగతిపై రియల్ టైమ్ అప్‌డేట్‌లు పొందుతుండగా, వర్చువల్ PTMs తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల అనుబంధాన్ని బలపరుస్తున్నాయి. విద్యార్థులు తమ డిజిటల్ ప్రాజెక్టులను Padlet, YouTube, Adobe Express పోర్ట్‌ఫోలియో ద్వారా సమాజంతో పంచుకోవడం పాఠశాల-సమాజ అనుసంధానాన్ని మరింత బలపరుస్తోంది. ఈ విధంగా Oxford Grammar High School Carte Blanche తత్వాన్ని అనుసరిస్తూ ఆధునిక టెక్నాలజీ, సృజనాత్మకత, వ్యక్తిగత అభ్యాసం, బాధ్యత మరియు సుస్థిరతలతో సమతూకంగా విద్యను అందిస్తూ సమగ్ర అభివృద్ధిని కల్పించే ప్రముఖ విద్యా సంస్థగా ఎదుగుతోంది.

– బాలచెలిమి డెస్క్

యాత్ర


## తెలంగాణ చారిత్రక పర్యాటకం

# అస్సక మహాజనపదం

క్రీస్తుపూర్వం 1500 సం॥లో రుగ్వేద కాలంతో మొదలుకొని సప్తసింధు ప్రాంతం నుండి ఒక 500 ఏళ్ళ లోపలే గంగా – యమునా పై ప్రాంతంలో వైదిక సంస్కృతి విస్తరించడం మొదలయ్యింది. ఇటు మధ్య గంగా ప్రాంతంలో క్రీ.పూ. 700 నుండి జైన, బౌద్ధ, అజీవక సిద్ధాంతాలు మతాలతో పాటు చార్వాకం వంటి భౌతికవాద తత్వం ఎదుగుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో వచ్చిన జైన, బౌద్ధ మతాలు తెలంగాణాలో (నాటి అస్సక మహాజనపదం) శ్రమణుల ద్వారా వ్యాపించాయి. శ్రమణులు లేదా పరివ్రాజకులు అంటే సంచారులుగా ఉంటూ వారి వారి సిద్ధాంతాల్ని ప్రచారం చేసేవాళ్ళు. కొత్త రాతి యుగంలో మొదలైన వ్యవసాయం నాగరికతలు విస్తరిస్తూ గంగా, యమున, బ్రహ్మపుత్ర, గోదావరి, కృష్ణ, కావేరి, మహానది ఇలా అన్ని నదీతీరాల్లో వ్యవసాయక ఆధార సమూహాలు జనపదాలుగా విస్తరించాయి. క్రీస్తుపూర్వం 1300 సం॥ తర్వాత సింధూ లోయ నాగరికత దాని తొలి నగరీకరణ ఆనవాళ్ళను కోల్పోయింది. తర్వాత 600 ఏళ్ళకు మళ్ళీ భారత ఉపఖండంలో ఏర్పడ్డ ఈ మహాజనపదాలు రెండవ నగరీకరణకు దారి చూపాయి. వ్యవసాయంలో మిగులు, చేతివృత్తుల అభివృద్ధి కారణంగా వ్యాపార వాణిజ్యాలు పెరిగి పట్టణాలు నగరాల విస్తరణ జరిగింది.

క్రీ.పూ. 6వ శతాబ్దంలో భారత ఉపఖండంలో అటువంటి మహాజనపదాలు పదహారు ఉండేవి. వీటిలో వాయువ్యాన గాంధార నుండి తూర్పున అంగ వరకు పదిహేను మహాజన పదాలు విస్తరించి ఉండేవి. ఈ క్రమంలో వింధ్యకు దక్షిణాన ఒకే ఒక్క మహాజనపదం అస్సక (అశ్మక) మహాజన పదానికి గోదావరి తీరం వేదిక అయ్యింది.

క్రీ.పూ. 6వ శతాబ్దం నాటికి ఏర్పడిన షోడష (పదహారు) మహాజనపదాలు భారతదేశానికి భౌగోళికంగా, వాయువ్య, ఉత్తర, ఆగ్నేయ, తూర్పులకు విస్తరించిన అంగ, మగధ, కాశి, కోసల, వజ్జి, మల్ల, ఛేది, కురు, పాంచాల, మత్స్య, శూరసేన, వత్స, అవంతి, గాంధార, కాంబోజులు పదిహేను కాగా, దక్షిణ భారతంలో ఏర్పడిన ఒకే ఒక మహాజనపదం అదే అస్సక మహాజనపదం. దీనినే అశ్మక, అస్సక, అశ్వక అని పలు రకాలుగా పిలిచినట్లు సాహిత్య ఆధారాలున్నాయి. పైన పేర్కొన్న పదహారు మహాజనపదాల ప్రస్తావన మనకు సాహిత్య ఆధారాలే కాకుండా





నాణేల రూపంలో కూడా ఆధారాలను అందించింది. జైన గ్రంథం ఆది పురాణం అస్సక రాజధాని పోదన, పోతలి లేక పోతన అని చెప్పింది. తరువాత క్రమంలో బాహుదాన్యపురిగా, నేటి బోధన్‌గా మారినట్లు మనకు సాహిత్య ఆధారాలు లభిస్తున్నా చారిత్రక ఆధారాల కోసం ఇంకా పరిశోధనలు, తవ్వకాలు చిన్న స్థాయిలోనే జరిగాయి. పూర్తి స్థాయి తవ్వకాలు జరిగితే ఎంతో చరిత్ర వెలుగు చూసే అవకాశముంది.

అస్సక మహాజనవం గురించి తొలి వివరాలు మనకు ఇచ్చింది బౌద్ధ, జైన సాహిత్యాలు, వైదిక సాహిత్యంలో పురాణాలు అస్సకనే కాక మగధ నేలిన నంద, మౌర్యవంటి వంశాల గురించి ప్రస్తావన ఉంది. బౌద్ధ సాహిత్యంలో సుత్తనిల పాతలోని పారాయణ వగ్గ "సో అస్సకస్స విషయేములకస్స సమాసనే వాసి గోదావరికులే ఉంఛేన ఛఫలేనచ" అంటూ ఆధారాన్ని ఇచ్చింది. అస్సక మహాజనపదం అంటే ములక (మహారాష్ట్రలోని ఎగువ గోదావరి ప్రాంతం) పక్కనున్న అస్సక (తెలంగాణాలో ప్రవహిస్తున్న మధ్య గోదావరి ప్రాంతం) అని మధ్య గోదావరి పారుతున్న ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాలు, అలాగే మంజీరానది ప్రవహించే ఉమ్మడి మెదక్ జిల్లాలో మనకు లభించిన, లభిస్తున్న ఆధారాలు స్పష్టం చేస్తున్నాయి.

ఈ క్రమమే మనకు దక్షిణ భారతదేశంలోని ఒకే ఒక తొలి రాజకీయ అస్తిత్వం అస్సక మహాజనపదం, తెలంగాణ నేలకు శాశ్వత చిరునామాను అందించిందని మనం గర్వంగా చెప్పుకోవచ్చు. (చరిత్రకారులు ఠాకూర్ రాజారాంసింగ్, మలయశ్రీ, ద్యావనపల్లి సత్యనారాయణ, ఈమని శివనాగిరెడ్డి, ఎం.ఎ. శ్రీనివాసన్ గార్ల పరిశోధనలు, రచనల ఆధారంగా).


– దేశరాజు శ్యాంసుందర్‌రావు – స్థపతి
m : 9010051177



# విహారం

పిల్లలూ మీకు తెలుసా! తెలంగాణ రాష్ట్రంలో అనేక పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. అందులో ప్రత్యేకంగా చూడదగినది గోల్కొండ కోట. ఇది తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ జిల్లాలో ఉన్నది. ఈ గోల్కొండ కోటకు ఎంతో గొప్ప చరిత్ర ఉన్నది. ఈ కోటను 120 మీటర్ల ఎత్తయిన నల్లరాతి కొండమీద నిర్మించారు. దీనిని క్రీ. శ. 12వ శతాబ్దంలో కాకతీయ రాజులు నిర్మించారు. ఈ గోల్కొండ కోటను కాకతీయ రాజులతో పాటు బహుమనీ సుల్తానులు, కుతుబ్‌షాహీలు, మొగలులు తదితరులు పరిపాలించారు. ఇది కుతుబ్ షాహి రాజుల ప్రధాన రాజధానిగా ఉండేది.

ఈ గోల్కొండ కోటకు పేరు ఎలా వచ్చిందంటే గొర్రెలను మేపే గొల్లలు తమ గొర్రెలను ఒక కొండ ప్రాంతంలో మేపేవారు. అట్లా గొర్రెలు మేసే ప్రాంతమే గొల్లలకొండగా, గొల్లకొండగా మారిపోయింది. ఆ తర్వాత కాలంలో గోల్కొండగా పేరుగాంచింది.

ఈ గోల్కొండ కోట చుట్టూ పెద్ద కోటగోడను నిర్మించారు. ఈ గోల్కొండ కోట భారతదేశంలోనే అత్యంత అద్భుతమైన కోటలలో ఒకటి. దక్షిణ భారతదేశంలోనే అతి పెద్దది. అప్పట్లో ఈ కోటను ఎలాంటి సాంకేతిక పరిజ్ఞానం లేని రోజుల్లోనే నిర్మించడం గొప్ప విషయం.

ఈ గోల్కొండ కోటను నాలుగు వేర్వేరు కోటలతో నిర్మించారు. ఈ కోటలో చాలా కట్టడాలున్నాయి. వాటిలో రాజభవనాలు, శయన మందిరాలు, ఆయుధ కర్మాగారాలు, దేవాలయాలు, మసీదులు, భక్త రామదాసు బంధించిన జైలు, నీటి రిజర్వాయరు, స్నానపు గదులు, ఉద్యానవనాల వంటి వాటిని నిర్మించారు. అంతేకాదు ఇక్కడ అక్కన్న - మాదన్న, అబ్దుల్ హసన్ తానీషా కాలంలో అమ్మవారి ఆలయాన్ని నిర్మించారు. ఇక్కడ ప్రతి సంవత్సరంలో వచ్చే ఆషాఢ మాసంలో బోనాల జాతర ఘనంగా జరుగుతుంది. ఈ జాతరకు జంట నగరాల నుంచేకాక అనేకమంది ఇతర ప్రాంతాల వాళ్ళు కూడా వస్తుంటారు.

ఈ కోటకు మొత్తం తొమ్మిది దర్వాజలున్నాయి. అవి ఫతే దర్వాజ, మోతి దర్వాజ, కొత్తకోట దర్వాజ, జమాలి దర్వాజ, బంజారి దర్వాజ, పటాంచెరు దర్వాజ, మక్కా దర్వాజ డబుల్, బొదిలి దర్వాజ, బహిమని దర్వాజలు.

ఈ గోల్కొండ కోటలో విశేషమేమిటంటే కింద ఉన్న ఫతే దర్వాజ ప్రవేశ ద్వారం వద్ద చప్పట్లు కొడితే కొండ పైభాగంలో వినిపిస్తాయి. ఇది గోల్కొండ కోట ప్రత్యేకతగా చెప్పవచ్చు. ఇది ప్రధానంగా సందర్శకులను ఆకర్షిస్తున్నది. హైదరాబాద్ నగరంలో ఉన్న అద్భుతమైన కోట గోల్కొండ కోట.

- డా. భీంపల్లి శ్రీకాంత్
m : 9032844017









# మానవాళికి మార్గదర్శి
# మిలాద్ – ఉన్ – నబీ

**తేజ:** అబ్దుల్ అన్నా... నమస్తే బాగున్నారా? వదినమ్మ పిల్లలు కనిపించడం లేదు? ఊరికి బోయారా?!

**అబ్దుల్లా:** ఔ తమ్మీ! మా దేవుని పుట్టిన రోజు పండగ రాబోతుందిగా! ఆ రోజు సెలవు అందుకే పిల్లకాయలను తోలుకుని వాళ్ల తల్లి గారింటికి పోయింది మీ వదినమ్మ (నవ్వుతూ).

**తేజ:** ఔనన్నా మీ దేవుడు "మహమ్మద్ ప్రవక్త కదా?" ఆయన పుట్టిన రోజు పండుగ అంటున్నావు దానికి పేరు లేదా?!

**అబ్దుల్లా:** ప్రతి పండుగకు పేరు వున్నట్టే దీనికి పేరుంది "మిలాద్–ఉన్–నబీ" అంటారు.

**తేజ:** ఆయన పుట్టిన రోజుకు అంత ప్రాముఖ్యత ఇచ్చి మీరు ఏకంగా పండుగే చేసుకుంటున్నారు అంటే దానికి చాలా విశేషమే వుంటుంది అయితే! అదేంటో కాస్త వివరంగా చెప్పవా?

**అబ్దుల్లా:** ఆ...! ఇంకా అడగలేదేమీ అనుకుంటున్నా సరే వివరంగా విను మరి.

**తేజ:** మన జాతిని సంస్కరించడానికి ఎంతో మంది మహనీయులు, మహాత్ములు, ప్రవక్తలు ఈ భూమి మీద పుట్టినట్టు, సృష్టి ప్రారంభం నుంచి నేటి వరకు అన్ని కాలాల్లో ప్రాంతాల్లో జాతుల్లో ఈ మహనీయులు పుట్టి ఆయా ప్రాంతపు మనుషుల ఉన్నతికి కృషి చేసారని తాతయ్య చెప్పారు. అలాంటి ప్రవక్తేనా మీ దేవుడైన మహమ్మద్ ప్రవక్త కూడా?

**అబ్దుల్లా:** ఆదిమానవుడైన ఆదాము మొదలు లక్షా ఇరవై నాలుగు వేల నుండి "దైవ ప్రవక్తలు" ఈ భూమి మీద పుట్టినట్టు ఇస్లాం ధర్మశాస్త్ర గ్రంథాల ఆధారంగా తెలుస్తుంది. ఆ అందరిలో చివరి వాడే మహమ్మద్.

**తేజ:** చివరి వాడైనా అంతటి ప్రాముఖ్యత ఎలా సంపాదించాడు? ఆ ప్రత్యేకత ఏమై వుంటుంది? అసలు మహమ్మద్ అంటే అర్థం ఏమిటన్నా?

**అబ్దుల్లా:** మహమ్మద్ అంటే "ప్రశంసనీయుడు" అని అర్థం.

**తేజ:** ఓహో! అయితే ఈ ప్రశంసనీయుడు ఎక్కడ పుట్టాడు? ఆ వివరాలు విశేషాలు చెప్పవా? ప్లీజ్!

**అబ్దుల్లా:** 'అరేబియా' దేశంలోని "మక్కా" అనే నగరంలో ఇస్లామిక్ క్యాలెండరు ప్రకారం రబీవుల్ నెలలో 12వ తేదీ సోమవారం రోజు పుట్టాడు, కానీ జీవితం మొత్తం అమ్మానాన్నల ప్రేమలేని అనాథ అయ్యాడు.

**తేజ:** అయ్యో! అదేలా?

**అబ్దుల్లా:** ఖురైష్ వంశంలో అబ్దుల్లా – ఆమినా దంపతులకు జన్మించాడు. తండ్రి అబ్దుల్లా వ్యాపార నిమిత్తం సిరియా దేశం నుంచి వస్తూ మార్గమధ్యలో మరణించారు. అప్పటికి అమినా గర్భవతి.

**తేజ:** అంటే మహమ్మద్ పుట్టకముందే తండ్రి

చనిపోయాడు... అయ్యో పాపం!!

అబ్దుల్లా: మహమ్మద్ పుట్టిన ఆరేళ్లకు జబ్బుతో తల్లి అమినా కూడా చనిపోయింది. అప్పుడు తాత ముత్తలిబ్ పెంపకంలో పెరిగి కొంతకాలం గొర్రెల కాపరిగా, మరికొంత కాలం వ్యాపారంలో మెళకువలు తెలుసుకుని తండ్రిలా వ్యాపారం చేసాడు.

తేజ: మహమ్మద్ చదువుకున్నాడా?

అబ్దుల్లా: తను ప్రవక్తల్లో చివరివాడే కాదు చదువుకోని ప్రవక్త కూడా అయినా ఆచరణాత్మకమైన నీతి నిజాయితీలతో బ్రతికాడు.

తేజ: గ్రేట్... మరి పెళ్లి చేసుకున్నాడా?!

అబ్దుల్లా: మహమ్మద్ చిన్నతనం నుంచి అందరి పట్ల ప్రేమాభిమానాలతో పరోపకారబుద్ధితో వుండి మక్కా నగరంలో మంచి పేరు సంపాదించాడు. అతని గురించి తెలిసిన అక్కడి పెద్ద వ్యాపారి హజ్రత్ తన కూతురు ఖదీజాను తనకు ఇచ్చి పెళ్లి చేయడానికి నిశ్చయించాడు.

తేజ: ఎవరికైనా నీతి నిజాయితీలు మంచే చేస్తాయి కదా బయ్యా!

అబ్దుల్లా: నీతి నిజాయితి మాత్రమే కాదు త్యాగజీవి కూడా పాతికేళ్ల మహమ్మద్ నలభై ఏళ్ల వితంతులైన ఖదీజాను పెళ్లి చేసుకుని ఆమెకు కొత్త జీవితం అందించిన ఆదర్శనీయుడయ్యాడు.

తేజ: సాధారణ కుటుంబంలో పుట్టి అనాధగా పెరిగి సత్ప్రవర్తనతో మెలిగి ప్రవక్తగా మారిపోయాడా? ఇంకా ఏమైనా గొప్ప పనులు చేసాడా?

అబ్దుల్లా: తన చుట్టూ జరుగుతున్న అరాచకాలను, అత్యాచారాలను ఖండిస్తూ వాటిని నిర్మూలించడం కోసం నిత్యం ఆలోచిస్తూ వుండేవాడు. ఆ ఆలోచనతోనే మక్కాకు మూడు మైళ్ల దూరంలోని “హిరా” అనే గుహలో దైవ చింతనతో గడిపేవాడు. అది రంజాన్ నెల. అకస్మాత్తుగా ఒక రోజు తను ధ్యానంలో ఉండగా ఒక దైవదూత ప్రత్యక్షమై “పఠించు” అన్నారు. “నాకు చదువు రాదు” అన్నాడు మహమ్మద్. దైవదూత అతడిని గుండెలకు హత్తుకుని మూడుసార్లు అదుముకుని వదిలాడు. అంతలోనే అతనిలో అదృశ్య శక్తి ఆవహించి దైవదూత పలికిన మాటలే అలవోకగా తన నోటి నుంచి వెలువడ్డాయి. ఈ సంఘటనే ఖర్ ఆగ్ అంకురార్పణకు నాంది పలికినట్టు మా పెద్దలు చెబుతారు.

తేజ: తరవాత ఏమి జరిగింది భయ్యా?

అబ్దుల్లా: అలా జరిగిన 23 సంII కాల వ్యవధిలో అరేబియా ద్వీపకల్పంలో ఖురాన్ బోధనలను అందరికి అందించి ఆచరించేందుకు తీవ్రమైన కృషి చేసి ఆనాటి అరబ్బు సమాజంలోని దోషాలను మార్చే ప్రయత్నం చేసి దాదాపు విజయం సాధించాడు. కాని ఈ సమయంలో అతను అనేక ఇబ్బందులు, ఆటంకాలు ఎదుర్కొని అనేక కష్టాలు పడ్డాడు.

తేజ: గొప్ప పనులు చేసే సమయంలో ఇబ్బందులు తప్పవుగా ఇంతకీ మహ్మద్ అరబ్ దేశంలో చేసిన మార్పులు ఏమిటి? మహాత్ముడుగా ఎందుకు కీర్తించబడుతున్నాడు?

అబ్దుల్లా: మహమ్మద్ నిరక్షరాస్యుడు అయినా అతని ఆచరణాత్మక బోధనలు యావత్ సమాజాన్ని ప్రభావితం చేసి మనుషుల్లోని అసమానతలను రూపుమాపి దుర్మార్గాలను, దౌర్జన్యాలను అదుపు చేసి, కష్టజీవుల శ్రమకు విలువను పెంచాయి. ద్వేషించిన వారిని ప్రేమించడం, శత్రువులను క్షమించే గుణం నేర్పడం వంటి పనులను దేవునికి చేరువ చేసే గుణాలుగా ప్రజలకు అర్థం చేసాడు.

తేజ: మహమ్మద్ బోధనను అందరూ పాటించారా? అన్నా?

అబ్దుల్లా: కొందరు ఛాందసవాదులు వారి బోధనలను వ్యతిరేకించి తిరుగుబాట్లు చేసారు. అన్నిటిని సమర్థవంతంగా ఎదుర్కొని నాటి అరబ్బు సమాజానికి శాంతిని ఉన్నతిని పెంచి 62 ఏళ్ల వయసులో మదీనాలో చనిపోయాడు. ఆయన చేసిన పరోపకారానికి కృతజ్ఞతాభావంతో వారి పుట్టిన రోజును పండుగగా జరుపుకుని ప్రత్యేక ప్రార్థనలు చేస్తూ వారి బోధనల సారాన్ని ప్రచారం చేయడమే ఈ “మిలాద్-ఉన్-నబీ” పండుగ పరమార్థం.

తేజ: అంటే ప్రవక్త పవిత్ర జీవితమే అందరికి స్ఫూర్తి అంటావ్.

అబ్దుల్లా: నిజం భయ్యా వారి బోధనలు కేవలం ముస్లింలకే కాదు మానవులందరికీ అవసరం.

తేజ: థాంక్యూ భయ్యా పండగ పుణ్యాన అనేక విలువైన విషయాలు చెప్పావు. బై...

– డా. అమ్మిన శ్రీనివాసరాజు
m : 7729883223

✧ చెట్టు - చేమ

# మునగ చెట్టు



హాయ్ బాలలూ! ఈ నెల బాల చెలిమి సంచికలో చెట్టు- చేమ శీర్షికన Drumstick tree (మునగ చెట్టు) గురించి తెలుసుకుందాం. దీని శాస్త్రీయ నామం Moringa olefera. ఈ చెట్టును "మిరాకిల్ ట్రీ" అని కూడా పిలుస్తారు. సాధారణంగా మునగ చెట్టు మన పరిసర ప్రాంతాలతో పాటు ప్రపంచమంతా విస్తరించి ఉంది. మన ఇండ్ల పెరట్లో గాని, వ్యవసాయ బావుల వద్ద గాని మునగ చెట్టును ఎక్కడ బడితే అక్కడ చూడవచ్చు. ఇటీవల కాలంలో బెంగళూరులో జరిగిన పరిశోధనలో మునగ చెట్టు చేస్తున్న ప్రయోజనాలను చూసి శాస్త్రవేత్తలు ఆశ్చర్యపోయారు. నేషనల్ సెంటర్ ఫర్ బయాలజికల్ సైన్సెస్(NCBS) వారు చేసిన పరిశోధనలో మునగ చెట్టు ఆరోగ్యానికి ఎంతో అవసరమని దీని అన్ని భాగాలు ఉపయోగపడతాయని తేలింది. మునగ చెట్టు చూడడానికి ఆకర్షణయంగా లేతగా ఉండి, గాలివానకు సులువుగా విరిగిపోతుంది. నాటిన ఆరు నెలలకే క్రాపు వస్తుంది. చెట్టును కట్ చేసినా మళ్లీ ఇగురించి కాయలు కాస్తుంది. ఒక్క ఎకరంలో 500 చెట్ల వరకు నాటవచ్చు. ఒక్కొక్క చెట్టు వందల కాయలు కాస్తుంది. ఒక్కో చెట్టుమీద రైతులు 600 రూపాయల వరకు లబ్ధి పొందవచ్చు. అన్ని వేళలా దొరికే మునగకాయలను కూరగా వండు కోవడమే కాకుండా, సాంబార్‌లో వేసి తింటారు. మునగ చెట్టు ఆకన్నా, కాయలన్నా ప్రతి ఒక్కరూ ఇష్టపడతారు. చాలా రుచిగా ఉంటాయి. ఆరోగ్యానికి ఎంతో మంచిది. మునగ చెట్టు మానవులకు కలిగించే ముఖ్యమైన ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయి.

**అవి :**

- మునగ ఆకులు కూరగా తినడం వల్ల గుండె జబ్బుల నివారణతో పాటు క్యాన్సర్ రాకుండా ఉంటుంది.
- మానవునిలోని డిఎన్ఏ కాపాడే విధంగా మునగ ఆకులు ఉపయోగపడుతాయి.
- విద్యార్థులు మునగ ఆకును కూరగా, ఆకులు ఎండపెట్టి పొడి అన్నంలో తింటే జ్ఞాపకశక్తి పెరుగుతుంది.
- మునగ ఆకును తరచుగా తినే వారికి షుగర్ వ్యాధి కూడా తగ్గుతుంది.
- మునగ చెట్టు ఆకులలో ఐరన్ సమృద్ధిగా ఉండి రక్తహీనత అరికట్టబడుతుంది.
- మునగ ఆకుల్లో,కాయలలో విటమిన్ ఏ, సి ఇ పుష్కలంగా ఉంటుంది. కంటి చూపును పెంచుతుంది.
- మునగ ఆకులు జ్యూస్‌గా చేసి తాగడం వల్ల ఊపిరితిత్తుల సమస్య రాదు. తలనొప్పి కూడా తగ్గుతుంది.
- మునగ చెట్టు వేర్ల చెక్క కషాయం చేసి తాగితే ఏ దశలో ఉన్న క్యాన్సర్ వ్యాధినైనా సులువుగా తగ్గిస్తుంది.
- మునగ చెట్టు ఆకులు, కాయలు, గింజలు మరియు పువ్వులు అన్ని తినదగినవే. అందుకే దీన్ని "అద్భుత చెట్టు" అంటారు.

ఇలా ఎన్నో ఔషధ గుణాలు కలిగి ఉన్న మునగ చెట్టు వల్ల విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉన్నాయి. ఈ చెట్టు ఆకులను ఉచితంగానే పొందవచ్చు. కాయలు కూడా మార్కెట్లో చౌకగా లభిస్తాయి. ఆహారంలో వీటిని బాగా వాడాలి. ఇన్ని ప్రయోజనాలు ఉన్న మునగ చెట్టును మనం కూడా పెంచుకుందాం. ఆరోగ్యాన్ని కాపాడుకుందాం.

– కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి
m : 9441561655

# పి.హెచ్.డి. కంటే ముందే నోబుల్ బహుమతి ఆవిష్కరణను సాధించిన కెరోల్ విడ్నీ గ్రైడర్

పి.హెచ్.డి. కూడా సాధించకుండానే 23 ఏళ్ల వయసులో కెరోల్ గ్రైడర్ (Carol Greider) చేసిన పరిశోధనకు నోబెల్ బహుమతి రావడం కచ్చితంగా విశేషమైన విషయం! తన టీచర్ ఎలిజబెత్ బ్లాక్ బర్న్ (Elizabeth Blackburn)తో కలిసి చేసిన ఈ ఆవిష్కరణ 2009లో వైద్యశాస్త్రంలో నోబెల్ బహుమతిని సాధించుకున్నది.

1961 ఏప్రిల్ 15న కాలిఫోర్నియాలోని శాండీయోగాలో కెరోల్ విడ్నీ గ్రైడర్ ఒక భౌతిక శాస్త్రవేత్త ఇంట జన్మించారు. ఆమె చిన్నతనం నుంచి పదాలను చదవడం, గుర్తుంచుకోవడం, సరిగ్గా పలకడం, రాయడం మొదలైనవి నేర్చుకోవడానికి ఎక్కువ సమయం తీసుకోవడమనే డిస్లెక్సియా (deslexia ) అనే ఆరోగ్య సమస్యతో బాగా ఇబ్బంది పడేది. ఈ సమస్య కారణంగా జి.ఆర్.ఇ స్కోరు బాగా తగ్గడంతో 13 కళాశాలలకు అప్లై చేస్తే కేవలం రెండింటిలో మాత్రమే ప్రవేశం లభించింది వాటిలో ఒకటి బెర్క్లీలోని కాలిఫోర్నియా యూనివర్సిటీలో ఆమె చేరారు. 1983లో డిగ్రీ పూర్తి చేసిన తర్వాత అదే విశ్వవిద్యాలయం నుంచి మాలిక్యులర్ బయాలజీలో 1987లో పీహెచ్డీ గడించారు. టీచర్ ఎలిజబెత్ బ్లాక్ బర్న్‌తో కలిసి పని చేస్తున్నప్పుడు 1984 క్రిస్మస్ రోజున గ్రైడర్ 'టెలామేరసే' (Telomerase)ను కనుగొన్నారు. ప్రతి క్రోమోజోము చివరన సంరక్షణ కోసం చిన్న తొడుగు ఉంటుంది. దీనినే 'టెలామేర్' అంటారు. ఇది 'టెలామెరస్' అనే ఎంజైమును విడుదల చేస్తుందని గ్రైడర్ గమనించారు. కణ విభజన జరిగినప్పుడు డి.ఎన్.ఏ. నష్టపోకుండా టెలామేరసే ఎంజైమ్ రక్షణ కల్పిస్తుంది. కెరోల్ విడ్నీ గ్రైడర్ ఆవిష్కరణ ఎందుకు కీలకమైంది? కణ విభజన జరిగిన ప్రతిసారీ ఈ టెలామేరసే కూడా తగ్గుతూ వస్తుంది. దీని తగ్గుదల అనేది ఆ కణం తద్వారా, ఆ జీవి వయసును నిర్ణయించడమే కాకుండా రోగాల నియంత్రణ మీద కూడా ప్రభావం చూపెడుతుంది. టెలామెరస్ ఎంజైమ్‌ను గుర్తించి దాని పాత్రను గమనించడం ద్వారా ధ్రువ పడిన మరో విషయం ఏమిటంటే ఈ ఎంజైమ్ ఏ కారణం వల్లనైనా సరిగా పని చేయకపోతే వార్ధక్యం, క్యాన్సర్, ఇతర వ్యాధులు ముంచుకు రావడం.



1984 డిసెంబర్ 25న గ్రైడర్ గమనించిన విషయాలను బ్లాక్ బర్న్‌తో కలసి మరింత శోధించి వీరిద్దరూ ఒక ఆరు నెలల పాటు ప్రత్యేక పరిశోధనలు చేసి 1995 డిసెంబర్‌లో 'సెల్'అనే జర్నల్‌లో తమ పరిశోధనా ఫలితాలను వెలువరించారు. తొలుత ఆ ఎంజాయ్ ను 'టెలుమేర్ టెర్మినల్ ట్రాన్స్ఫరేస్'అని పిలిచినా క్రమంగా అది 'టెలెమెరెస్'గా స్థిరపడింది. గ్రైండర్ తన పరిశోధనను ఆర్.ఎన్.ఏ.కు కూడా విస్తరింప జేసి మరింత సాధికారత పొందారు. 1987లో పిహెచ్డి పూర్తి చేసిన తర్వాత కోల్డ్ స్ప్రింగ్ హార్బర్ లేబరేటరీలో పరిశోధకురాలుగా చేరి మరింత కృషి చేశారు. పదేళ్ల తర్వాత జాన్స్ హాప్కిన్ యూనివర్సిటీలో ఆమె ప్రొఫెసర్‌గా చేరి, పిమ్మట మాలిక్యులర్ బయాలజీ & జెనెటిక్స్ విభాగానికి డైరెక్టర్ అయ్యారు.


2009 అక్టోబర్ ఐదున నోబెల్ బహుమతులు ఇచ్చే సంస్థ వీరిద్దరికీ తోపాటు జాక్ జోస్టాక్ (Jack Szostak) కలిపి వైద్యశాస్త్రంలో బహుమతిని ప్రకటించింది. ఈ పరిశోధన క్యాన్సర్ సమస్యకు, అలాగే వయసుతో పాటు వచ్చే జబ్బులను అర్థం చేసుకోవడానికీ; స్టెమ్ సెల్ థెరపీలోను ఉపయోగపడింది. ఏ విశ్వవిద్యాలయంలో అయితే ఆమె ఈ పరిశోధనను చేశారో అదే విశ్వవిద్యాలయంలో మాలిక్యులర్ బయాలజీ ప్రొఫెసర్‌గా ఇప్పుడు సేవలు అందిస్తున్నారు.

ఆరోగ్య సమస్యలు ఉన్నా పట్టు వదలకుండా శ్రమించి గొప్ప ఫలితాలు అందించిన కెరోల్ విడ్నీ గ్రైడర్ విజయ గాథ మనందరికీ స్ఫూర్తికరం!

– డా. నాగసూరి వేణుగోపాల్
ఆకాశవాణి విశ్రాంత సంచాలకులు,
ప్రముఖ సైన్స్ రచయిత,
m : 9440732 392

కథ

# సరైన తీర్పు






కరకుదురు ఓ చిన్ని గ్రామం. అక్కడంతా వ్యవసాయం, కూలి పనుల మీద ఆదారపడి జీవిస్తున్నారు. ఒక్క రంగయ్య దగ్గర మాత్రమే రెండు ఎడ్లు, బండి, ఒక నాగలి వున్నాయి. వాటిని అవసరాన్ని బట్టి ఇతరులకు ఇస్తూ వుంటాడు రంగయ్య. వాళ్ళు పని అయిపోయాకా రంగయ్యకు ఎంతో కొంత ముట్ట చెబుతూ వుంటారు. అది ఇంత అని లెక్క లేదు. సమయాన్ని బట్టి డబ్బులు తీసుకుంటాడు రంగయ్య. కొంత మంది దగ్గర ఎక్కువ డబ్బులు వసూలు చేయడమే కాకుండా, వారిని కసరడం, కోప్పడడం చేసేవాడు రంగయ్య. చాలా మంది అతని దగ్గరకు వెళ్ళడం కూడా మానుకున్నారు.

ఆ వూరిలో మరో చిన్న రైతు వెంకటేశం. ఒకరోజు రంగయ్య దగ్గరకు వచ్చి ఎడ్లు, నాగలి ఇస్తే తన పొలం దున్నుకుంటానన్నాడు. రంగయ్య ఏ మాత్రం అడ్డు చెప్పకుండా అతనికి ఎడ్లు, నాగలి ఇచ్చి పంపాడు. వెంకటేశం పొలం దున్నుతుంటే ఓ రంగు లీనుతున్న రాయి బయటకి వచ్చింది. దాన్ని తీసి నీటితో కడిగాడు వెంకటేశం. అది అతి విలువైన వజ్రం అని అన్నారంతా. విషయం తెలుసుకున్న రంగయ్య అక్కడకి చేరుకుని ఆ రాయి తనకే దక్కుతుందని అసలు నాగలి, ఎడ్లు ఇవ్వకపోతే రాయి గురించి తెలిసేదే కాదని కనుక ఆ వజ్రం తనకు ఇవ్వాలని రంగయ్య ను అడిగాడు. "నిజమే నీవు నాగలి పంపక పోతే రాయి గురించి తెలిసేది కాదు. కానీ ఈ వజ్రం అతి విలువైనది అంటున్నారు కనుక అది అమ్మి నీకు కొంత డబ్బు ఇస్తాను" అన్నాడు వెంకటేశం. "కుదరదు నేను నాగలి, ఎడ్లు ఇచ్చేటప్పుడు నీకు ఏవిధమైన రుసుము చెప్పలేదు. నీవు అడగలేదు. కనుక ఈ వజ్రం నాకే చెందుతుందని" అని గొడవపడ్డాడు. గొడవ కాస్తా.. పెద్దదై గ్రామాధికారి దాకా వెళ్ళింది. మరుసటి రోజు తీర్పు చెబుతా అన్నాడు గ్రామాధికారి.

సరే అని ఇంటికి వెళ్ళి పోయారు ఇద్దరు. "ఇచ్చింది తీసుకోక ఎందుకండి ఈ గొడవలు. నిజంగా న్యాయంగా తీర్పు చెబితే మీకు వచ్చేది ఏముండదు" అంది రంగయ్య భార్య. "నీకేం తెలీదు నువ్వు ఊరుకో" అని కసిరాడు రంగయ్య. మరుసటి రోజూ న్యాయదికారి దగ్గరకు ఇద్దరు చేరారు. వారితో బాటు ఊరి జనం తీర్పు ఎలా వుంటుందో అని అక్కడికి చేరుకున్నారు. అసలు ఈ వజ్రం విలువ ఎంతో తెలుప వలసిందిగా వూరిలో బంగారు ఆభరణాలు చేసే ఆచారిని పిలిపించి అడిగాడు న్యాయధికారి. "ఇది అసలు వజ్రమే కాదు, వుత్త రంగురాయి'' అని తేల్చాడు ఆచారి. ఇపుడేమంటారు అన్నాడు న్యాయధికారి. "నే ముందే అనుకున్నా అది వజ్రం కాదని నా నాగలి, ఎడ్లకు కలిపి 100 రూపాయలు బాడుగ ఇప్పించండి" అన్నాడు రంగయ్య. "వెంకటేశం నువ్వు రంగయ్యకి బాడుగ చెల్లించు. తరువాత ఈ వజ్రాన్ని పట్నంలో అమ్ముకో" అన్నాడు న్యాయధికారి. "అది రాయి అన్నారు.." అంటూ గొణికాడు రంగయ్య. "అవును నీ విషయంలో అది రాయే.. కారణం న్యాయంగా కొంత డబ్బు ఇస్తానని అంటే అంతా నీదే అన్నావు. అందుకే ఆచారితో అలా చెప్పించవలసి వచ్చింది'' అన్నాడు న్యాయధికారి. భార్య మాటలు గుర్తుకు వచ్చి బాధగా వెను తిరిగాడు రంగయ్య.

– కూచిమంచి నాగేంద్ర
m : 91821 27880


ఓ చింత చెట్టు కథ
రచన:
జుగాష్విలి
బొమ్మలు:
గోపి : తాతయ్యా! మా స్కూలు విద్యార్థులం సెప్టెంబర్ 28న ఉస్మానియా హాస్పిటల్‌లోని చింత చెట్టు దగ్గరకు ర్యాలీ చేస్తున్నాం.
తాతయ్య : అవునా! మంచిదే... నేనూ రెండు మూడుసార్లు ఫోరమ్ ఫర్ బెటర్ హైద్రాబాద్ కార్యక్రమాలకు వెళ్లాను.
గోపి: అలాగా! అయితే ఆ చింత చెట్టు గురించి చెప్పు తాతయ్యా.
తాతయ్య : 1908 సెప్టెంబర్ 28న మూసీనదికి వరదలు వచ్చాయి. 15 వేల మంది మరణించారు. 28 వేల ఇళ్లు ధ్వంసమయ్యాయి. 150 మంది ఆ రాత్రి అఫ్జల్‌గంజ్ పార్క్‌లోని ఈ చింత చెట్టు పైకి ఎక్కి తమ ప్రాణాలు కాపాడుకున్నారు.
గోపి : మురికి కాలువలా వుండే మూసీ యింత ప్రళయం సృష్టించిందా!
తాతయ్య : మురికి కాలువ కాదు. మూసీనది... వికారాబాద్ దగ్గర అనంతగిరి కొండల్లో పుట్టి ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని వాడపల్లి వద్ద కృష్ణానదిలో కలుస్తుంది. దీని బేసిన్ వైశాల్యం 4,329 చదరపు మైళ్లు.
గోపి : వరదల నివారణకు ఏ చర్యలూ తీసుకోలేదా.
తాతయ్య : చివరి నిజాం ఉస్మాన్ అలీఖాన్ సమస్యను గుర్తించి సిటీ ఇంప్రూవ్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేసారు.
గోపి : ఆ బోర్డు ఏం చేసింది తాతయ్య.
తాతయ్య : సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య, ఇంజనీర్ ఆలీ నవాజ్ జంగ్ మార్గదర్శకత్వంలో హైదరాబాద్‌కి ఎగువన నదీ ప్రవాహానికి అడ్డంగా 1920లో ఉస్మాన్‌సాగర్, 1927లో హిమాయత్ సాగర్ జంట జలాశయాల నిర్మాణం జరిగింది.


గోపి : అసలు ఈ వరదలకి కారణం ఏమిటి తాతయ్య.
తాతయ్య : నగర జనసాంద్రత ఒత్తిడి పెరిగింది. జన నివాసాల కోసం నీటి ప్రవాహక ప్రాంతాలు, చెరువులు అక్రమ నిర్మాణాలకు గురయ్యాయి. నీరు పోయే, నిలువ వుండే చోటు లేకుండా పోయింది.
గోపి : వీటిని అరికట్టలేమా?
తాతయ్య : అక్రమ కట్టడాలు నిలిపివేయాలి. గొలుసు కట్టు చెరువులు పునరుద్ధరించాలి. నాలాల ఆక్రమణలు తొలగించి మురికి నీరు, వర్షపు నీరు సాఫీగా వెళ్ళేలా చూడాలి.
గోపి : ఈ జన ఒత్తిడి తగ్గేదెలా తాతయ్య.
తాతయ్య : నగరానికి 100 కి.మీ. వెలువల కౌంటర్ మాగ్నెట్స్‌గా చిన్న పట్టణాల అభివృద్ధిని తీవ్రతరం చేయాలి. ఉపాధి విద్యావకాశాల కోసం సిటీకి వచ్చే వలసలు ఆగిపోతాయి.
గోపి : ఇంత పెద్ద నగరంలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఏం చేయాలి తాతయ్య.
తాతయ్య : ఏ నగరానికైనా సమగ్ర మాస్టర్ ప్లాన్ అత్యంత కీలకం. ప్రజా రవాణా వసతులు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీరు, కాలుష్య నివారణ వంటి ప్రజోపయోగ అభివృద్ధికి సరైన ప్రణాళిక రూపకల్పన జరగాలి.
గోపి : సరే తాతయ్య! ఈ ర్యాలీలు, సభల వల్ల ఉపయోగం ఏమిటి తాతయ్య.
తాతయ్య : మీ తరానికి ఆనాటి విషయాలు తెలియజేయడానికి, ఆ జ్ఞాపకాల స్ఫూర్తితో నగరాభివృద్ధికి అప్‌డేట్‌గా ఏమేమి కావాలో చర్చించి అధికారులకి నూతన ప్రతిపాదనలు అందించడానికి...
గోపి : చాలా విషయాలు తెలిసాయి. థాంక్యూ తాతయ్యా...
తాతయ్య : ఉపన్యాసాలు జాగ్రత్తగా విను వర్తమాన విషయాలు తెలుస్తాయి.





## హుస్సేన్‌సాగర్ సరస్సులో YAI టిస్కాన్ యూత్ ఓపెన్ రెగట్టాలో...

### తనూజ కామేశ్వర్ & శ్రవణ్ కట్రావత్ 420 మిక్స్‌డ్ టైటిల్ విజేతలు

YAI యూత్ రెగట్టాలో తనుజా కామేశ్వర్ మరియు శ్రవణ్ కట్రావత్ 420 మిక్స్‌డ్ టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. హుస్సేన్ సాగర్ సరస్సులో జరిగిన ఈ యూత్ ఓపెన్ రెగట్టాలో వారు బలమైన ప్రదర్శనతో విజేతలుగా నిలిచారు. సమృద్ధి బాథమ్ & పార్థ్ సింగ్ చౌహాన్, మరియు ఏక్లవ్య బాథమ్ & వంశిక సికర్వార్ వరుసగా రెండవ, మూడవ స్థానాలు సాధించారు. ఆప్టిమిస్ట్ మెయిన్ ఫ్లీట్‌లో బాలికల విభాగంలో తెలంగాణ సెయిలింగ్ అసోసియేషన్‌కు చెందిన స్కె. రమీజా భాను అగ్రస్థానంలో నిలిచారు, బాలురు విభాగంలో నావల్ యూత్ సెయిలింగ్ క్లబ్‌కు చెందిన మహ్మద్ రిజ్వాన్ విజేతగా నిలిచారు. తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, MCEME కమాండెంట్ లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ వర్ష్నీ, కమోడోర్ అర్జున్ ప్రదీపక్, YAI కార్యదర్శి కెప్టెన్ జితేంద్ర దీక్షిత్, సికింద్రాబాద్ క్లబ్ నేతలు మరియు టిస్కాన్ ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

ఫలితాల్లో ఆప్టిమిస్ట్ గ్రీన్ ఫ్లీట్‌లో బాలురు అడ్రిన్ ఆంటోనీ మొదటి స్థానంలో, యువరాజ్ మరియు వి. హనుమంతు తదుపరి స్థానాలు సాధించారు. బాలికల్లో సోనియా బరార్ మొదటి, J. శిరీషా రెండో, సృష్టి బరార్ మూడో స్థానాల్లో నిలిచారు. 29er విభాగంలో అజయ్ గజ్జి & సత్యం ఝా విజేతలు, శరణ్య జాదవ్ & శివన్ వాల్మీకి రెండో స్థానంలో, ఆకాష్ M. తంగల్ & కృష్ణ దివాకర్ మూడో స్థానంలో నిలిచారు. 420 మిక్స్‌డ్ విభాగంలో తనుజా కామేశ్వర్ & శ్రవణ్ కట్రావత్ విజేతలు, సమృద్ధి బాతం & పార్థ్ సింగ్ చౌహాన్, ఏక్లవ్య బాతం & వంశిక సికర్వార్ వరుసగా రెండో, మూడో స్థానాల్లో నిలిచారు. ఆప్టిమిస్ట్ మెయిన్ ఫ్లీట్ బాలురలో మహ్మద్ రిజ్వాన్, కృష్ణ వెంకిటాచలం రామకృష్ణ, ఆకాష్ కుమార్, బాలికల్లో స్కె. రమీజా భాను, శృంఘరి రాయ్, తత్తారి చంద్రలేఖ ఫస్ట్, సెకండ్, థర్డ్ స్థానాల్లో నిలిచారు. ILCA 4 విభాగంలో బాలురు రమాకాంత్, ప్రీత్ సివాచ్, అంకిత్ సింగ్ సిసోడియా; బాలికల్లో ఆస్తా పాండే, తులసి పాట్లే, కాత్యాయని కౌశిక్ విజయాలు సాధించారు.

## ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో టీనేజ్ భారత షూటర్ల ప్రతిభ

### 4 బంగారు పతకాలు, మొత్తం 26 పతకాలు

కజకిస్తాన్‌లోని షిమ్‌కెంట్‌లో జరుగుతున్న 16వ ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో టీనేజ్ భారత షూటర్లు అద్భుత విజయాలను సాధించారు. నాల్గో రోజు భారత్ నాలుగు బంగారు పతకాలను గెలుచుకుంది. అభినవ్ షా, మాన్సీ రఘువంశీ, హర్ మెహర్ లల్లీ, జ్యోతిరాదిత్య సిసోడియా వంటి యువ షూటర్లు మెరిశారు. దీంతో భారత్ ఇప్పటివరకు 14 బంగారు, 6 రజత, 6 కాంస్యాలతో కలిపి మొత్తం 26 పతకాలు సాధించింది. ఈ విజయంతో భారత పతకాల పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది.

జూనియర్ ఎయిర్ రైఫిల్ జట్టు విభాగంలో అభినవ్ షా, నరైయిన్ ప్రణవ్, హిమాన్షు కలిసి అద్భుతంగా రాణించి 1890.1 పాయింట్లతో స్వర్ణాన్ని గెలుచుకున్నారు. ఇది ఆసియా మరియు ప్రపంచ జూనియర్ రికార్డు కావడం గమనార్హం. వ్యక్తిగత ఫైనల్లో అభినవ్ ఐదవ స్థానంలో నిలిచాడు. షాట్‌గన్ విభాగంలోని జూనియర్ మహిళల స్కీట్ ఫైనల్లో మాన్సీ రఘువంశీ 60లో 53 టార్గెట్లను ఛేధించి బంగారు పతకాన్ని సాధించింది. యశస్వి రాథోడ్ 52 పాయింట్లతో రజతాన్ని గెలుచుకోగా, కజకిస్తాన్‌కు చెందిన లిడియా బషరోవా కాంస్యంతో సరిపెట్టుకుంది. మాన్సీ తన చివరి 10 టార్గెట్లు అపురూపంగా కొట్టి తన ప్రదర్శనను బలంగా ముగించింది.

జూనియర్ పురుషుల స్కీట్ విభాగంలో హర్ మెహర్ లల్లీ 52 పాయింట్లతో రజతాన్ని, జ్యోతిరాదిత్య సిసోడియా 43 పాయింట్లతో కాంస్యాన్ని గెలుచుకున్నారు. కజకిస్తాన్‌కు చెందిన ఆర్టియోమ్ సెడెల్నికోవ్ 53 హిట్స్‌తో స్వర్ణాన్ని గెలుచుకున్నాడు. హర్ మెహర్, జ్యోతిరాదిత్య మరియు అతుల్ సింగ్ రజావత్ కలిసి జూనియర్స్ స్కీట్ జట్టు విభాగంలో 338 పాయింట్లతో బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఆతిథ్య కజకిస్తాన్ జట్టును నాలుగు పాయింట్ల తేడాతో వెనక్కినెట్టిన భారత్ అగ్రస్థానంలో నిలిచింది.

పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ సీనియర్ ఈవెంట్‌లో భారత్ జట్టు స్వర్ణాన్ని గెలుచుకుంది. అయితే వ్యక్తిగత విభాగంలో రుద్రాంక్ష్ పాటిల్ 207.6 పాయింట్లతో నాల్గవ స్థానంలో, అర్జున్ బాబుటా 185.8 పాయింట్లతో ఐదో స్థానంలో నిలిచారు.

– బాలచెలిమి డెస్క్

కథ

# నక్కల కోట



అది ఒక దట్టమైన అడవి. అక్కడ ఎక్కువ సంఖ్యలో నక్కలే నివసిస్తుండేయి. అందుకే ఆ అడవిని నక్కలకోటని పిలుస్తుంటారు. అక్కడ ఉండే నక్కలు ఒక దానిని మించి మరొకటి కుట్రలు చేయడంలో ఆరితేరినవి. ఆ అడవికి రాజుగా విరాట్ అనే నక్క ఉండేది. ఇక మంత్రిగా సుల్తాన్ అనే నక్క చలామణి అయ్యేది. అడవిలో జరిగే ఏ విషయమైనా సుల్తాన్ మంత్రి ద్వారానే విరాట్ రాజు చెవికి చేరేది. సుల్తాన్ మంత్రి చాలా తెలివిగలిగిన నక్క. 'తిమ్మిని బొమ్మి చేయడం బొమ్మిని తిమ్మి చేయడం' ఆ నక్కకు వెన్నతో పెట్టిన విద్య. విరాట్ పేరుకే రాజు. అడవి మీద, ఇతర జంతువుల మీద పెత్తనమంతా సుల్తాన్ నక్కే చేసేది. సుల్తాన్ మంత్రిని చూసి ఇతర నక్కలే కాదు, ఇతర జంతువులన్నీ గజగజ వణికిపోయేవి. అడవిలోని జంతువులన్నీ ప్రతిరోజూ వచ్చి సుల్తాన్ మంత్రిని కలిసి సలాం చేయాలి. లేదంటే సుల్తాన్ మంత్రి కోపానికి గురికావల్సిందే. నక్కలతో పోలిస్తే మిగతా జంతువులు కొన్ని మాత్రమే ఉండేవి. అందువల్ల వాటికి పెద్దగా గుర్తింపు ఉండేది కాదు. అవి నక్కల కుట్రలను తప్పక భరిస్తూ మనుగడ సాగించేవి.

ఇదిలా ఉండగా ఒక రోజు పక్కనే ఉన్న అడవి నుండి దారి తప్పి చిట్టి కుందేలు ఒకటి నక్కల కోటకు చేరింది. ఎటు చూసినా నక్కలే ఉండడంతో కుందేలు బెదిరిపోయింది. తనలాంటి కుందేళ్లు కానరాక బిక్కుబిక్కుమంటూ తిరగసాగింది. సుల్తాన్ మంత్రి కుందేలును గమనించింది. "ఏయ్ ఎవరు నువ్వు? కొత్తగా కనిపిస్తున్నావు" అని ప్రశ్నించింది. కుందేలు భయపడుతూ నేను మీ పక్క అడవిలో ఉండేదాన్ని. దారి తప్పి ఇటువైపుగా వచ్చాను అన్నది. "మా అడవికి నేను వెళ్లాలి. దయచేసి మార్గం చూపండి" అని బ్రతిమిలాడింది. "ఒకసారి మా అడవిలో ఎవరైనా కాలు పెడితే మళ్లీ తిరిగి వాళ్ళ అడవికి వెళ్లే సాహసం ఎవరూ చేయరు. చేయకూడదు. ఇది మా రాజాజ్ఞ". అని గట్టిగా అదిలించింది. కుందేలు ఎంతగానో ప్రాధేయపడింది. ససేమిరా కాదన్నది సుల్తాన్ మంత్రి. ప్రతిరోజు మిగతా జంతువుల మాదిరిగా తనకు వచ్చి సలాం చేయాలని, అడవిలో తన అనుమతి లేకుండా ఏ పనులు చేయకూడదని ఆదేశించింది. తన అడవిలో స్వేచ్ఛగా తిరిగి కుందేలు ఒక్కసారిగా ఒంటరి అయిపోయింది. సుల్తాన్ మంత్రి చేతిలో ఉక్కిరిబిక్కిరయితూ ఎలాగైనా ఈ అడవి నుండి తన అడవికి చేరాలని మనసులో గట్టిగా నిర్ణయించుకుంది.

అడవి నుండి బయటపడడానికి కుందేలు ఎన్నో ప్రయత్నాలు చేసింది. కానీ సుల్తాన్ మంత్రి నియమించిన జంతువుల కంటి నుండి బయటపడలేకపోయింది. తనకు సాయం చేసే వారి కోసం ఎదురుచూడసాగింది. అంతలో అడవిలో చెరువు వద్ద నీళ్లు తాగడానికి వచ్చిన పావురం, కుందేలు బిక్క మొహం వేసుకుని కూర్చోవడాన్ని గమనించింది. ఏమైందని కుందేలును అడిగింది. తన అవస్థను కుందేలు పావురంతో చెప్పుకుంది. వీలైతే సహాయం చేయమని కోరింది.

అప్పుడు పావురం, సుల్తాన్ మంత్రికి నేను నీకు సహాయం చేసినట్టు తెలిస్తే నన్ను చంపేస్తుందన్నది. కుందేలు బాధ చూడలేక సరేలే ! ఏదో విధంగా నీకు సహాయం చేస్తాను అని హామీ ఇచ్చింది. ఏం చేయాలో చెప్పమని కుందేలును అడిగింది. అందుకు కుందేలు "నేను దారి తప్పి ఈ అడవిలోకి వచ్చి ఇబ్బందులు పడుతున్నాను. మా అడవిలోని గజరాజుకు సమాచారం అందిస్తే చాలు నన్ను ఏదో విధంగా ఇక్కడనుండి తీసుకు వెళ్తుంది" అని చెప్పింది. సరేనన్నది పావురం.


ఎగురుకుంటూ వెళ్లిన పావురం గజరాజుకు ఈ విషయం చెప్పింది. గజరాజుకు సుల్తాన్ మంత్రిపై కోపం ఆగలేదు. అదే సమయంలో చిట్టి కుందేలు బాధ మనసును కలచివేసింది. "అయ్యో!మా అడవిలోని చిట్టి కుందేలుకు ఎంత కష్టం వచ్చింది" అని చింతించింది. కానీ సుల్తాన్ మంత్రి నుండి చిట్టి కుందేలును కాపాడడం అంత సులభం కాదని గజరాజుకు తెలుసు. బాగా ఆలోచించింది. అడవి చట్టాలన్నింటిని ప్రింట్ తీసుకొని, నేరుగా సుల్తాన్ మంత్రి వద్దకు వెళ్ళింది. "మా చిట్టి కుందేలును విడిచిపెట్టు. లేదంటే అన్ని అడవుల్లోని జంతువులను మీ అడవి మీదికి తీసుకొచ్చి దాడి చేయిస్తాను. మీ విరాట్ రాజుకు తెలవకుండా నీవు చేస్తున్న అక్రమాలన్నింటినీ బట్టబయలు చేస్తాను. జాగ్రత్త ! అని బెదిరించింది". చట్టాలకు సంబంధించిన కాగితాలన్నీ సుల్తాన్ మంత్రి ముందు పెట్టింది. "ఈ కాగితాలకు నేను బెదరను. గజరాజా! కుందేలును పంపేదే లేదు. మర్యాదగా నువ్వు వెళ్ళిపో" అన్నది సుల్తాన్ మంత్రి.

ఇక గజరాజు గట్టిగా నిర్ణయించుకుంది. ఒక్క కుందేలును ఈ సుల్తాన్ మంత్రి చెర నుండి విడిపించడం కాదు. సుల్తాన్ మంత్రి అక్రమాలు విరాట్ రాజుకు తెలియపరిచి, సుల్తాన్ మంత్రి మీద తగిన చర్యలు తీసుకోవాలి. సుల్తాన్ ఆధిపత్యానికి అడ్డుకట్ట వేయాలి. అన్ని జంతువులను సమానంగా చూడాలి. వాటికి చట్టాలలో పేర్కొన్నట్లుగా స్వేచ్ఛనివ్వాలి. లేకపోతే మిగతా అడవుల్లోని సింహాలతో సహా జంతువులన్నింటితో విరాట్ రాజు అడవిపై దాడి చేయిస్తానని హెచ్చరించింది. అందుకు సంబంధించి తాను చేయదలచుకున్న పనులన్నింటినీ విరాట్ రాజుకు చూపించింది. విరాట్ రాజు భయపడిపోయాడు. 'గోటితో పోయేదాన్ని గొడ్డలి దాకా తెచ్చుకోవద్దని' నిర్ణయించు కున్నాడు. వెంటనే సుల్తాన్ మంత్రిని పిలిపించాడు.

సుల్తాన్ మంత్రి ఒక్క ఉదుటున విరాట్ రాజు ముందు ప్రత్యక్షమైంది. గజరాజును చూసింది. తన అక్రమాలన్నీ రాజుకు తెలిసిపోయాయని గ్రహించి, భయపడిపోయింది.

విరాట్ రాజు సుల్తాన్ మంత్రిని నిలదీసాడు. నాకు తెలియకుండా నువ్వు ఇన్ని దుర్మార్గాలు చేస్తావా? అని గర్జించాడు. మరో మార్గం లేక సుల్తాన్ మంత్రి తన తప్పులన్నింటినీ ఒప్పుకుంది. విరాట్ రాజును, గజరాజును క్షమించమని వేడుకుంది. ఇకపై ఎప్పుడూ ఏ జంతువులపై కూడా ఆధిపత్యం చేయనని తనను శిక్షించవద్దని బతిమిలాడింది. కానీ విరాట్ రాజు ఊరుకోలేదు. తనను మంత్రి పదవి నుండి తొలగించాడు. ఆరు నెలల పాటు కఠినమైన కారాగార శిక్ష విధించాడు. చిట్టికుందేలును అడవికి పంపించాడు. ఇకపై తాను స్వయంగా తన అడవిలో ఏం జరుగుతున్నదో తెలుసుకుంటానని, అన్ని జంతువులకు సమానమైన హక్కులు, బాధ్యతలు ఉండేటట్లుగా చూస్తానని గజరాజుకు హామీ ఇచ్చింది. తమ అడవి గురించి ఎక్కడా ఫిర్యాదు చేయకూడదని గజరాజును బ్రతిమిలాడాడు. సరేనన్నది గజరాజు. చిట్టి కుందేలు తమ గజరాజు తెలివిని, ధైర్యాన్ని చూసి గంతులు వేసింది. ఇక గజరాజు చిట్టి కుందేలును తన వీపు మీద కూర్చోబెట్టుకొని అడవి మార్గం పట్టింది.

– డా. ఉప్పల పద్మ
m : 9959126682



కథ

# మంచు బిందువులు

## స్పిరిడాన్ వెంగిలి



అనగనగా ఒక ఊరిలో 'గుగుడ్సె' అనే చిన్న పిల్లవాడు ఉండేవాడు. అతని జేబులో ఏడు రూపాయి బిళ్ళలున్నాయి. వాటిని లెక్కపెట్టాడు. ఎన్ని సార్లు లెక్కపెట్టినా ఏడు రూపాయలే వస్తున్నాయి. మూడు రోజుల తరువాత లెక్కపెట్టాడు. కానీ జేబులో డబ్బులు ఏమాత్రం పెరగలేదు.

వాళ్ళ ఊరిలో ఓ రోజు 'బహుమతుల పండుగ' వచ్చింది. ఆ రోజు ఒకరికి మరొకరు ప్రేమతో బహుమతులు ఇచ్చి పుచ్చుకుంటారు. వాళ్ళ అమ్మకి, గుగుడ్సె కారు బహుమతిగా ఇద్దామనుకున్నాడు.

దుకాణంలోని కారు చాలా చిన్నగా ఉంది. దాంట్లో గుగుడ్సెనే సరిపోడు, ఇక వాళ్ళమ్మ ఏం సరిపోతుంది. నాలుగు రూపాయలు ఇచ్చి 'అందమైన గుండీ' కొన్నాడు. ఆ గుండీ కోసం నీలం గౌను కొందా మనుకున్నాడు. కానీ దురదృష్టవశాత్తు ఆ దుకాణంలో నీలం గౌను లేదు.

ఇంకో దుకాణంలో మంచి చెప్పులు చూశాడు. వాటి ధర ఎంతో అడుగుదామనుకున్నాడు. కాని వాళ్ళ అమ్మ పాదం కొలత గుగుడ్సెకు తెలియదు. ఇంటికి వెళ్ళాడు. రాత్రి అయ్యేవరకు ఎదురు చూశాడు.

వాళ్ళ అమ్మకు అద్భుతమైన జానపద కథ చెప్పాడు. ఆమె నిద్రలోకి జారుకుంది. మెల్లగా ఓ దారంతో వాళ్ళ అమ్మ పాదాన్ని కొలిచాడు. ఆ దారాన్ని దిండు కింద దాచిపెట్టి నిద్రపోయాడు.

తర్వాతి రోజు దుకాణానికి వెళ్ళేడు, అక్కడ ఉన్న చెప్పులన్నింటిని దారంతో కొలిచాడు. వాటిలో మంచి చెప్పుల జతను ఎంచుకున్నాడు. దానిపై ధర చూశాడు. చాలా ఎక్కువగా ఉంది. కానీ జేబులో మూడు రూపాయలే ఉన్నాయి. ఇంటిదారి పట్టాడు. వెళ్ళే దారిలో ఉన్న కొండపైన కొన్ని మంచు బిందువులను ఏరుకున్నాడు. ఆ మంచు బిందువులను తీసుకుని దుకాణానికి వెళ్ళాడు. దుకాణంలో మూడు రూపాయలు, మంచు బిందువులు ఇచ్చాడు.

దుకాణంలో ఉన్న అమ్మాయి ఇది చూసి ఆశ్చర్య పోయింది. ఆ సంవత్సరంలో అవి తొలి మంచు బిందువులు. ప్రజలంతా గుగుడ్సేని పొగిడారు, కానీ గుగుడ్సే వాళ్ళ అమ్మకు బహుమతి కొనలేకపోయాడు. "ఫర్లేదు రేపు ఇంకొన్ని మంచు బిందువులను ఏరుకొస్తాను," అనుకున్నాడు పిల్లవాడు.

ఆ రోజు రాత్రి మంచు వర్షం కురిసింది. ఆ ప్రాంతమంతా మంచు బిందువులతో నిండిపోయింది. కిటికీని ఆనుకుని గాఢనిద్రలో ఉన్న పిల్లవాడిని వాళ్ళ అమ్మ నిద్రలేపింది. అతని చేతిలోని మూడు రూపాయల బిళ్ళలు, అందమైన గుండీ జారి కిందపడ్డాయి.

ఆ అందమైన గుండీ, వాళ్ళ అమ్మకు ఇదివరకే వున్న పెళ్ళిగౌనుకు చక్కగా సరిపోయింది.

స్వేచ్ఛానువాదం : అనిల్ బత్తుల

m : 81792 73971

ఇంగ్లీష్ : స్నో డ్రాప్స్

రచయిత : స్పిరిడాన్ వెంగిలి

ఇంగ్లీష్ అనువాదం : జేమ్స్ రియోర్డన్

# పులి తోలు కప్పుకున్న గాడిద



పూర్వం ఒక చాకలి ఉండేవాడు. వాడు గాడిద మీద ఉతకవలసిన బట్టలమూటలు వేసి నదికి తీసుకుని వెళ్ళేవాడు. కానీ పిసినారి కావడం చేత, దాన్ని సరిగా మేపేవాడు కాదు. పైగా ప్రతిరోజూ గాడిద మోయలేనంత బరువు దానిపై వేసేవాడు. పాపం ఆ గాడిద ఈసురోమంటూ ఆ బరువులను మోసేది. ఒకరోజు అతడు తన గాడిదతో అడవిలోకి పుల్లల కోసం బయలుదేరాడు. పెద్ద మోపు కట్టి ఆ గాడిద వీపు మీద వేశాడు. ఆ గాడిద పుల్లలను మొయ్యలేక అడవిలోనే కూలబడింది. వాడు దానిమీద బరువును తీసివేశాడు. పుల్లల్ని బాగా తగ్గించి మోపుకట్టి గాడిద మీద వేశాడు. ఈ బక్కచిక్కిన గాడిదతో బ్రతుకీడ్చేది ఎలా అని ఆలోచిస్తున్నాడు. అదే సమయంలో ఆ చాకలి వాడికి ఒక చచ్చిన పులి కనపడింది. ఆ పులి యొక్క కళేబరాన్ని చూడగానే పైసా ఖర్చు లేకుండా తన గాడిదను చక్కగా మేపేందుకు వాడికి ఒక ఉపాయం



తట్టింది. ఆ పులి చర్మాన్ని జాగ్రత్తగా ఒలిచి, దాన్ని తీసుకుని గాడిదతో పాటు ఇల్లు చేరాడు. ఆ రోజునుండి ప్రతిరాత్రీ ఆ చాకలివాడు తన గాడిదకు పులితోలు కప్పి పొలాల మీదకి తోలేవాడు. గాడిద రాత్రంతా హాయిగా చేలల్లో మేస్తూ ఉండేది. దాన్ని చూసి, పులి అనుకుని భయపడి, పొలాల్లో కాపలా ఉన్నవాళ్ళు పారిపోయేవాళ్ళు, కొద్ది రోజులలోనే ఆ గాడిద బాగా బలిసింది. చాకలివాడు వేసే బరువుల్ని సునాయాసంగా మోయసాగింది.

ఒకసారి ఆ గాడిద పొలాల్లో మేస్తుండగా మరొక గాడిద దూరం నుంచి ఓండ్ర పెట్టింది. అది విని పులిచర్మం కప్పుకుని మేస్తున్న గాడిద కూడా ఓండ్ర పెట్టడం మొదలు పెట్టింది. దాని అరుపులు విన్న కావలివాళ్ళకు అది పులి కాదనీ, గాడిద అనీ తెలిసిపోయింది. కోపంతో దానిని దుడ్డు కర్రలతో బాదారు. ఆ దెబ్బలకు గాడిద ప్రాణాలు విడిచింది.

నీతి : పైపై మెరుగులు నిజ స్వభావాన్ని ఎక్కువ కాలం దాచలేవు.

సేకరణ : అమరావతి

# చీమలు

గండు చీమలు రెండు
నల్ల చీమలు నాలుగు
ఎర్రచీమలు ఏడు
చలి చీమలు ఒక దండు
అవి ఎచ్చట కాపురముండు
పుల్ల చీమలు పుట్టకు పుట్టు
ఎర్ర చీమలు గట్లకు గట్టు
రెక్కల చీమలు రెండే రెండు
చలి చీమలు ఒక దండు
అవి ఎచటికో వెడలుచుండు
ఎన్నిసార్లు విడిపోయినా అవి మళ్ళీ కలుస్తవి
ఎన్నిసార్లు కిందపడినా అవి మళ్ళీ నిలుస్తవి
ఎన్నిసార్లు ఓడిపోయినా అవి మళ్ళీ గెలుస్తవి



– గంగదేవు యాదయ్య
ఉయ్యాలా జంపాలా
m : 90591 12105

కథ

# పర్యావరణ బతుకమ్మ



కొండల మధ్యలో నుండి ఇప్పుడే ఉదయిస్తున్న సూర్యుడు... పచ్చని చెట్ల మధ్యలో పక్షుల కిలకిల రావాలు... చుట్టూ కొండల మధ్య పచ్చని చెట్లతో నిండిన మారేడుమిల్లి అనే గ్రామంలో పొద్దున్నే అందరి వాకిళ్ళు ముందు అందమైన ముగ్గులతో నిండి ఉన్నాయి.

"ఒరేయ్ చిన్ను ఎంతసేపు పడుకుంటావు రా? నిద్రలే!" అంటూ చిన్ను వాళ్ళ అమ్మ సరిత అన్నది. "అమ్మా! ఇంకొక ఐదు నిమిషాలే" చిన్ను అన్నాడు.

"త్వరగా లేరా! లేచి బతుకమ్మ చేయడానికి కావలసిన పువ్వులు కోసుకొని రా!" అని వాళ్ళ అమ్మ అన్నది. అనగానే చిన్ను గబుక్కున నిద్రలేచి "అవును కదమ్మా... ఈరోజు బతుకమ్మ కదా!" అన్నాడు.

"అమ్మా! నేను వెళ్లి పువ్వు కోసుకొస్తా" అని మంచం నుండి దిగి పువ్వులు తేవడానికి వెళ్ళాడు. చిన్ను వాళ్ళ దోస్తుల ఇంటికి వెళ్లి వాళ్లతో కలిసి పువ్వులు తేవడానికి గుట్టకు వెళ్లారు. సరిత త్వరగా ఇంటి పని అంతా పూర్తి చేసుకొని చిన్ను కోసం ఎదురుచూస్తుంది. చిన్ను వాళ్ళ ఫ్రెండ్స్ గుట్టకి చేరుకున్నారు. గుట్టంతా తిరిగి తిరిగి చూశారు. అయినా ఎక్కడ పువ్వులు కనబడలేదు. చిన్ను వాళ్ళ ఫ్రెండ్స్ రాజు ఇలా అన్నాడు. "అరేయ్ చిన్ను మనం పొద్దున్నే వస్తే బాగుండు. ఎవరో వచ్చి పువ్వులను కోసుకెళ్ళినట్టుంది". అప్పుడు చిన్ను "అవున్రా... పొద్దుగాల వస్తే బాగుండు" అని అన్నాడు. చిన్ను వాళ్ళ ఫ్రెండ్స్ నిరాశతో ఇంటికి తిరిగి వచ్చారు. చిన్న ఇంటికి రాగానే వాళ్ళ అమ్మ సరిత "పువ్వులు తేవడానికి వెళ్లి ఉట్టి చేతులతో ఇంటికి వచ్చావా!" అని అడిగింది. అప్పుడు చిన్ను "అమ్మా! నేను పువ్వులు తేవడానికి వెళ్లాను. కానీ అక్కడ పువ్వులు నాకు కనబడలేదు. అందుకే ఇంటికి తీసుకురాలేదు".

"ఇప్పుడు ఎలా రా? బతుకమ్మ ఎలా చేసేది?" అని వాళ్ళ అమ్మ అన్నది. వాళ్ళ అమ్మకి ఒక ఆలోచన వచ్చింది "అరేయ్ చిన్ను త్వరగా బజారు కెళ్ళి ప్లాస్టిక్ పువ్వులు వీలైతే ప్లాస్టిక్ బతుకమ్మ తీసుకురా" అని చెప్పింది. అది విన్న చిన్ను "అమ్మా! ప్లాస్టిక్ బతుకమ్మ వద్దు. ప్లాస్టిక్ పువ్వులు కూడా వద్దు. ఎందుకంటే ప్లాస్టిక్ అంత మంచిది కాదు ప్లాస్టిక్ వాడడం వల్ల పర్యావరణానికి ఎంతో కీడు జరుగుతుంది. ముఖ్యంగా నీటికి, నీటిలో ఉన్న జీవులన్నిటికీ కూడా హాని కలుగుతుంది. ప్లాస్టిక్ వల్ల నీళ్లు కలుషితమవుతాయి. కాబట్టి ప్లాస్టిక్ బతుకమ్మ వద్దు." అని చిన్ను అన్నాడు. అప్పుడు వాళ్ళ అమ్మ "ఒక్క రోజుకు ఏమవుతుంది రా! పరవాలేదులే తీసుకురా పో" అని సరిత అన్నది. అమ్మా! మా టీచర్ కొన్ని మాటలు చెప్పింది. జాగ్రత్తగా విను. అసలు బతుకమ్మ పండుగ ఉద్దేశమే పర్యావరణాన్ని రక్షించడం. బతుకమ్మ కోసం ఉపయోగించే పూలు నీటిలో నిమజ్జనం చేయడం వల్ల చెరువు నీరులో కలుషితాలు తొలగిపోతాయి. ఆ పూలలోని ఔషధ గుణాల వల్ల చెరువులో నివసించే జీవులకు మేలు కలుగుతుంది. కానీ నువ్వు చెప్పినట్లు ప్లాస్టిక్ రంగులు ప్లాస్టిక్ పూల వల్ల లాభం జరగకపోగా నష్టం జరుగుతుంది. ఒకసారి

ఆలోచించమ్మా!” అన్నాడు చిన్ను.

“మరి ఇప్పుడు ఎలా రా బతుకమ్మ చేసేది?” అని అడిగింది. అప్పుడు చిన్ను “బతుకమ్మ చేయాలనుకుంటే పువ్వులతో మాత్రమే చెయ్యి. లేదంటే బతుకమ్మ వద్దు. ఎందుకంటే బతుకమ్మ అనే పేరులోనే బ్రతుకు అనే పదం ఉంది బతుకమ్మ అనుకుంటూ నీటిలో ఉన్న జీవులన్నీ చంపేయలేము కదా! అని చిన్ను అన్నాడు. “అమ్మా! నువ్వు కూడా నీకు తెలిసిన వారందరికీ చెప్పు ప్లాస్టిక్ పూలతో కృత్రిమ రంగులతో ఎవరు బతుకమ్మ చేయవద్దని. ఎందుకంటే మన గ్రామాన్ని, పర్యావరణాన్ని మనమే కాపాడుకోవాలి కదా అమ్మా!” అని చిన్ను చెప్పాడు.

“సరే రా నువ్వు త్వరగా బజారు కెళ్ళి పువ్వులను తీసుకొని వస్తే నేను బతుకమ్మ చేస్తాను” అని వాళ్ళ అమ్మ సరిత అన్నది. అప్పుడు చిన్ను బజారుకెళ్ళి పువ్వులను తీసుకొచ్చాడు. ఆ పువ్వులతో అందమైన బతుకమ్మను వాళ్ళ అమ్మ పేర్చింది. సాయంకాలం కాగానే ఆ ఊరి గ్రామస్తులంతా బతుకమ్మలను తీసుకొని చెరువు కట్ట దగ్గరికి తీసుకొచ్చి అక్కడ కొద్దిసేపు బతుకమ్మ ఆడి ఆనందంగా చెరువులో విడిచిపెట్టారు.

“ఎవరైనా బతుకమ్మను ప్లాస్టిక్‌తో కలుషితం చేయవద్దు. ప్లాస్టిక్ వాడటం వల్ల పర్యావరణానికి కూడా ఎంతో కీడు జరుగుతుంది. అందరు ప్లాస్టిక్ బతుకమ్మలు తోటి నింపేస్తే చివరికి ప్లాస్టిక్ చేతిలోనే మానవుని చావు కూడా ఉంటుంది అన్నది గుర్తుంచుకోవాలి. అందరం ఆనందంగా ఉంటూ మన పర్యావరణాన్ని కాపాడుకుందాం ఎందుకంటే పర్యావరణానికి మనం ఏమి ఇస్తే అదే మనకు తిరిగి వస్తుంది” అని చిన్న వాళ్ళ ఫ్రెండ్స్‌కు మరియు వాళ్ళ అమ్మకు చెప్పాడు. ఇది వినగానే వాళ్ళ అమ్మ మనసులో “నా కొడుకు ఎంత పెద్దవాడయ్యాడు మంచి చెడులను గుర్తించి చెప్పగలిగినవాడు నా కొడుకు బంగారం” అని మనసులో అనుకుంది.

– ఆకిటి ఆశ్రిత
10వ తరగతి, జిపఉపా, తాటికలల్, నల్గొండ జిల్లా.
m : 7989117415

# తపాలా డబ్బా




మీకు ఏదైనా ప్రత్యేక ఉత్తరం గురించి చెప్పాలని ఉందా? లేదా ఆ రోజులు గుర్తు తెచ్చే అనుభూతి ఉందా? అప్పట్లో తపాలా డబ్బా ముందు రోజు ఉత్తరం కోసం ఎదురుచూస్తూ కూర్చునే ఆ క్షణాలు ఎంత గొప్పగా అనిపించేవో! ప్రతి ఉత్తరం ఓ అనుభూతి, ఓ ఊపిరిని మోసుకొచ్చేది. ఆ రోజుల్లో ఉత్తరం అందుకోవడమే ఒక చిన్న వేడుక. ఆ నిరీక్షణలో కలిగే అనుభూతులు, ఆ ఉత్తరం మాటలలో దాగి ఉండే ప్రేమ, ఆప్యతు ఇవన్నీ నేటి వందల మెసేజిల వేగంతో మాయమైపోయాయి. ఇలాంటి జ్ఞాపకాలను పునరుద్ధరించడం, కొత్త తరాలకు అందించడం అనేది పాతకాలపు స్నేహ, ప్రేమ విలువలను కొనసాగించడమే.

గ్లోబల్ ప్రపంచంలో కాలంతో పాటు, అలాంటి చిన్న జ్ఞాపకాలు ఎక్కడో దూరమవుతున్నట్లు, నెమ్మదిగా కనుమరుగవుతున్నాయని అనిపిస్తోంది. తపాలా డబ్బాలో వేసిన ప్రతి ఉత్తరం – ఒక ఊపిరి, ఒక అనుభూతి... ఇప్పుడు అది ఓ జ్ఞాపకంగా మిగిలిపోయింది!




ఇండియా పోస్ట్ తన ప్రతిష్ఠాత్మక రిజిస్టర్డ్ పోస్ట్ సేవను నిలిపివేస్తున్నట్టు అధికారికంగా ప్రకటించింది. బ్రిటిష్ పాలన కాలంలో ప్రారంభమైన ఈ సేవకు ముగింపు పలుకుతూ చరిత్రలో ఒక యుగానికి తెరపడింది. 2025 సెప్టెంబర్ 1 నుంచి రిజిస్టర్డ్ పోస్ట్ సేవను స్పీడ్ పోస్ట్‌లో విలీనం చేయనున్నారు.



# రెండు వేల ఏండ్ల క్రిందటి వృత్తులు

వ్యవసాయానికి, వ్యాపార వాణిజ్యాలకు అవసరమైన వస్తు సామాగ్రినిఅందించడమే కాకుండా ప్రజల కనీస అవసరాలు, సౌకర్యాలు, విలాసాలకు కూడా అవసరమయ్యే వస్తు సామగ్రిని అందించేవారు వృత్తి పనివారు. ఇలాంటి వృత్తులు చేసేవారు శాతవాహనుల కాలంలో 18 రకాలుగా ఉండేవారు. వారు కోలికులు, తిలపిసకులు, దమ్మిహాలు, మూలాకారులు, మాలాకారులు, ఓదయంత్రికులు, కమ్మకారులు, తెసకారులు, కులరికులు, అవేసణులు, సువణ్ణకారులు, మణికారులు, వడకులు, సెలవడకులు, చమ్మకారులు, వధికులు, పూసకారులు. వీరికి ఒక్కొక్కరికి ఒక్కొక్క శ్రేణి (వృత్తి సంఘం) ఉండేది. శ్రేణిలో సభ్యులు, వారికొక అధ్యక్షుడు ఉండేవారు. శాతవాహన రాజు సిరి సంపదలతో తులతూగడానికి ఒక ప్రధాన కారణం కోలికుల శ్రేణి. కోలికులు అంటే బట్టలు నేసేవాళ్ళు లేదా పద్మశాలీలు. వాశిష్ఠీపుత్ర పులుమావి కాలంలో రక్కసి లోటయ్ అనేవాడు పత్తినుండి విత్తనాలను తీసి, దూదిని తయారు చేసే యంత్రాన్ని కనిపెట్టాడట (ఇతని వంశీయుల ప్రస్తావన గౌదవహ కావ్యంలో, రుద్రమదేవి త్రిపురాంతక శాసనంలో ఉంది). ఆ యంత్రం పేరు గిరక. దాన్ని కనిపెట్టిన తరువాత దూది నుండి దారాలు త్వర త్వరగా తీయడం సాధ్యం కావడం వల్ల తక్కువ కాలంలో ఎక్కువ బట్టలు నేయడం సాధ్యమైంది. ఆ కాలపు కోలికులు బట్టలను చాలా సన్నగా, ఆకర్షణీయంగా కూడా తయారు చేసేవారు. వాటిని కొనడానికి రోమన్ సామ్రాజ్యపు అంతఃపుర స్త్రీలు, ధనికులతో పాటు సామాన్య ప్రజలు కూడా ఎగబడేవారట. దాంతో రోమన్ సామ్రాజ్యపు ధనం శాతవాహన సామ్రాజ్యానికి చాలా వచ్చేదట. పైగా స్త్రీలు సన్నని బట్టలు ధరించడం వల్ల వారి అందాన్ని చూసి రోమన్ సామ్రాజ్యపు పురుషులు వారి పట్ల ఆకర్షితులు కావడం వల్ల సమాజంలో నైతిక విలువలు తగ్గిపోతున్నాయని ప్లినీ అనే చరిత్రకారుడు వాపోయాడు.

వధికులు అంటే వడ్రంగి పనివారు. వీరు తయారు చేసే కుర్చీలు, మంచాలు, సోఫాలు, ఇతర నగిషీ వస్తువులు, దంతపు అలంకారిక వస్తువులు ఇక్కడి ధనికులకు మాత్రమే కాకుండా రోమన్ సామ్రాజ్యానికి కూడా ఎగుమతి అయ్యేవి. అలంకారిక పూసలు తయారు చేసేవారిని పూసకారులనే వారు. కమ్మకారులు ఇనుప వస్తువులు తయారు చేసేవారు. ఆ రోజుల్లో పూజ్ అనే ఉక్కు శాతవాహన రాజ్యంలో తయారయ్యేది.

సంగారెడ్డి జిల్లాలోని కొండాపూర్లో కొలిమి తిత్తులు బయటపడ్డాయి. కోటిలింగాలలో స్వర్ణకారుల కొలిమి వెలుగు చూసింది. గోదావరి, కృష్ణా, భీమ నదులు లోయల్లోని బయలు భూముల్లో రత్నాలు, గురువిందలు, గోమేధికాలు, మణులు మొదలైన విలువైన రాళ్ళు దొరికేవి. రోమన్ చక్రవర్తి సీజర్కు ఇలాంటి మణులను ప్రీతితో సేకరించే అలవాటుండేదట. మరో రోమన్ చక్రవర్తి ఆగస్టస్కు ఒక దక్షిణ దేశపు రాజు బంగారు నగలు, మణులు, ఏనుగులు బహూకరించాడని చారిత్రకాధారముంది. ఆ దక్షిణ దేశపు రాజు శాతవాహన రాజేనని సాలెటోర్ అనే చరిత్రకారుడు చెప్పాడు. వృత్తి శ్రేణులు బ్యాంకులుగా కూడా పనిచేసేవి. వర్తకులు, రాజులు కూడా శ్రేణుల దగ్గర పెట్టుబడులు పెట్టి, వాటిపై వచ్చిన వడ్డీతో దానాలు చేసేవారు. క్రీ.శ. 119–120 ప్రాంతంలో రుషభదత్తుడు (ఉసవదత్త) గోవర్ధనం అనే నగరంలోని నేతగాళ్ళ శ్రేణి వద్ద సంవత్సరానికి 12 శాతం వడ్డీకి రెండువేల కార్షాపణలు పెట్టుబడులు పెట్టి, వాటి మీద వచ్చే వడ్డీ డబ్బులను బౌద్ధమత ప్రచారకుల (పరివ్రాజకులు) జీవిత అవసరాలకై ఖర్చు చేయుమని ఒప్పందం చేసుకున్నట్లు తెలిపే శాసనమొకటుంది. అట్లే విష్ణుదత్త అనే స్త్రీ ఒక నేతల శ్రేణితో క్రీ.శ. 258లో అలాంటి ఒప్పందం చేసుకున్నట్లు మరో ఆధారముంది.

–డా. ద్యావనపల్లి సత్యనారాయణ
m : 9490957078

# కోరుకున్న 3 అంకెల సంఖ్య



1. ఏదైనా 3 అంకెల సంఖ్యను కోరుకోని
2. దానిని రెండు సార్లు వేసుకోమనాలి.
3. దానిని 13తో భాగించమనాలి.
4. వచ్చిన జవాబును 11తో భాగించమనాలి.
5. ఇప్పుడు వచ్చిన సంఖ్య (భాగఫలం)ను చెప్పమనాలి.
6. అది విని వెంటనే వారి 3 అంకెల సంఖ్యను చెప్పవచ్చు.

ఉదా 1 :

735 ➜ 735735 ÷ 13 = 56595

59595 ÷ 11 = 5145

5145 అని చెప్పగానే 735 అని చెప్పాలి.

ఉదా 2 : 901901 ÷ 13 = 69377

69377 ÷ 11 = 6307

6307అని చెప్పగానే 901 అని చెప్పాలి.

**రహస్యం :** చివరి సంఖ్యను 7తో భాగించాలి.

5145 ÷ 7 = 735

6307 ÷ 7 = 901

## BEAUTY NUMBER

**13680347 x nines multiplies**

**13680347 x 9 = 123123123**

**13680347 x 18 = 246246246**

**13680347 x 27 = 369369369**

**13680347 x 36 = 492492492**

**13680347 x 45 = 615615615**

**13680347 x 54 = 738738738**

**13680347 x 63 = 861861861**

**13680347 x 72 = 984984984**

**13680347 x 81 = 1108108107**

– అంకెల మామయ్య చంద్రయ్య
m: 9440926937

విజ్ఞాన ఆవిష్కరణ కథలు

# గోడ గడియారం పెండ్యాల ఊగే సూత్రం




అది ఇటలీ దేశంలోని పీసా పట్టణం. అది 1583 సంవత్సరం. చర్చిలోకి వెళ్ళిన వారిలో ఒక యువకుడి దృష్టిని ఒక దీపం ఆకర్షించింది.

ఆ దీపం చర్చి పై కప్పుకి వేలాడ గట్టి ఉంది. ఆ సమయంలో అటూ ఇటూ ఊగుతున్నది. ఆ యువకుడి మనసులో ఒక ఆలోచన తళుక్కున మెరిసింది.

అటూ ఇటూ ఊగటానికి ఎంత కాలం పడుతుందో తెలుసుకోవాలి అన్నదే ఆ ఆలోచన. అప్పటికి గడియారాలు లేవు. తన నాడి కొట్టు కోవటాన్ని గమనించాడు. ఆ దీపం ఊగటాన్ని పరిశీలించాడు. దీపం ఊగటం క్రమంగా తగ్గుతూ వచ్చింది. అయినా ఊగటానికి ఎంత కాలం పట్టిందో వేగం తగ్గిన తరవాత కూడా ఊగటానికి అంతే కాలం పట్టింది.

చర్చి నుండి వెంటనే అతడు ఇంటికి వెళ్ళాడు. ఒక లోహపు గుండు, గట్టి దారం తీసుకున్నాడు. ఆ గుండును దారానికి కట్టాడు. ఆ రెండింటితో చాలా ప్రయోగాలు చేశాడు. దానికి 'లోలకాల సమకాలికత్వం' అనే పేరు పెట్టాడు. తరువాత అతడు రోగుల నాడి కొట్టుకొనే వేగాన్ని తెలుసుకొనే 'పల్సోజియం' అనే సాధనాన్ని తయారు చేశాడు.



ఇంతకీ ఆ యువకుడి పేరేమిటో తెలుసా? గెలీలియో గెలీలి.

అతడు ఇటలీ దేశస్థుడు. చిన్నప్పుడే ఇంత ప్రతిభ చూపిన ఆయన విశ్వ విఖ్యాత ఖగోళ శాస్త్రజ్ఞుడు అయ్యాడు.


గెలీలియో టెలిస్కోపు మొదలైన అమూల్య వస్తువుల్ని కనిపెట్టాడు. పళ్ళ చక్రాలతో తిరిగే గడియారాన్ని తయారు చేశాడు. ఇలాగే నలభై ఏళ్లు గడిచి పోయాయి.

ఆ గడియారం పై ఒక విజ్ఞాని దృష్టి పడింది. ఆయన పేరు క్రిష్టియన్ హ్యూగిన్స్. హేగ్ నగర వాసి, గడియారం లోని లోలకం, దారం వంటి వాటిని తన ప్రతిభతో చక్కగా సరి దిద్దాడు. గెలీలియో కనిపెట్టిన లోలకాన్ని సక్రమ పద్ధతిలో పళ్ల చక్రాల ద్వారా ఊగేలా చేశాడు.

మనం నేడు చూస్తున్న గోడ గడియారాలలో ఈ విధానమే నేటికీ అమలులో ఉంది.

– 'బాల కథా సౌరభం' నుండి...

# బొమ్మలేద్దామా...



డి. సౌమ్య, 7వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గుండ్రాంపల్లి, చిట్యాల మండలం, నల్లగొండ జిల్లా




✧ బాలచెలిమి క్లబ్

## చెలిమి క్లబ్

చెలిమిక్లబ్‌లో సభ్యత్వం తీసుకోండి
లాభాలు పొందండి.

1. చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించే పుస్తకాలపై ప్రత్యేక తగ్గింపు.
2. మీ ప్రతి పుట్టిన రోజుకు అభినందనలతో అందమైన గ్రీటింగ్ కార్డు.
3. మీలో ఉన్న టాలెంట్‌ను అభివృద్ధి చేసుకోవడానికి క్లబ్ నిర్మాణాత్మక సహకారం అందిస్తుంది.
4. మీ స్కూల్లో, ఊర్లో పిల్లల కార్యక్రమాల వార్తలను చెలిమి సమాచారపత్రికకు పంపడానికి మీరు విలేఖరిగా ఉండవచ్చు.
5. అందమైన మెంబర్‌షిప్ బ్యాడ్జి.
6. మిమ్మల్ని ఆశ్చర్యపరచే బహుమతులు.

**చెలిమి క్లబ్**

పేరు : ------------------

తండ్రి పేరు : ------------------

పుట్టినతేదీ : ------------------

చిరునామా : ------------------

------------------

------------------

పిన్ : ------------------

హాబీలు : ------------------

మొబైల్ : ------------------


ఇ-మెయిల్ : ------------------

ఈ వివరాలతో మెయిల్ చేయండి.

బాల చెలిమి ఇ-మెయిల్ :
desk.chelimi@gmail.com










# భారతదేశంలో
## అత్యాధునిక తరగతి గది సాంకేతికతలు

### 1. ముఖ గుర్తింపు ఆధారిత AI (Artificial Intelligence) హాజరు

- ఇండోర్‌లోని దేవి అహిల్య ఇంజినీరింగ్ & టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్ ఒక AI-ఆధారిత ముఖ గుర్తింపు హాజరు వ్యవస్థకు పేటెంట్ పొందింది. ఇది తరగతి గది చిత్రాలను ఆటోమేటిక్‌గా పట్టి, విద్యార్థులను గుర్తించి, తక్షణ హాజరు నివేదికలను రూపొందిస్తుంది – మాన్యువల్ రోల్ కాల్ లేదా బయోమెట్రిక్ అవసరం లేకుండా. ఇది 10 సంవత్సరాలపాటు ఖచ్చితంగా పని చేస్తుంది.

### 2. AR/VR తరగతులు

- కోయంబత్తూరు ప్రాంతంలో ఆరు పాఠశాలలో AR/VR ప్రయోగశాలలను 4.8 కోట్ల ఖర్చుతో నిర్మిస్తోంది.

### 3. AI ఆధారిత స్మార్ట్ బోర్డులు & రోబోటిక్స్

- ఢిల్లీ ప్రభుత్వ పాఠశాలల్లో స్మార్ట్ బోర్డులు, రోబోటిక్స్ ల్యాబ్స్, డ్రోన్లు, 3D ప్రింటర్లు ఏర్పాటు చేయాలన్న ప్రణాళిక ఉంది.
  ఇది గుజరాత్‌లో 1,10,000 పైగా స్మార్ట్ తరగతుల విజయాన్ని అనుసరిస్తోంది.

### 4. మున్సిపల్ పాఠశాలల్లో కొత్త డిజిటల్ తరగతులు

- నాగపూర్‌లో “మిషన్ నవచేతన” కింద 114 డిజిటల్ తరగతులు ప్రారంభించబడ్డాయి.
  ఇవి ఇంటరాక్టివ్ స్మార్ట్ బోర్డులు, కంప్యూటర్ ల్యాబ్‌లతో కూడినవి. 200 పైగా ఉపాధ్యాయులు హార్డ్వేర్, సాఫ్ట్వేర్ మరియు బహుభాషా కంటెంట్‌లో శిక్షణ పొందారు.

### 5. మాతృభాష + సాంకేతికత

- పిల్లలకు మాతృభాషలో బోధన టెక్నాలజీతో కలిపి అందించడంపై తాజా దృష్టి ఉంది. స్థానిక భాషా డిజిటల్ కంటెంట్ కొరత మరియు ఉపాధ్యాయుల శిక్షణ లోపం సవాలుగా నిలిచింది.

### 6. ఉపాధ్యాయ శిక్షణ & డిజిటల్ విద్యా మద్దతు

- ఉత్తరప్రదేశ్‌లో IIT కాన్పూర్ మరియు MNNIT నిపుణులు విస్తృత స్థాయిలో ఉపాధ్యాయులు మరియు విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నారు. IIT-K యొక్క ఆన్‌లైన్ రూరల్ ఎడ్యుకేషన్ ఇనిషియేటివ్ (OREI) ద్వారా వేలాది పాఠశాలలను డిజిటల్‌గా చేరుస్తున్నారు.

### 7. డిజిటల్ ప్లాట్‌ఫార్మ్‌లు: DIKSHA

- DIKSHA — భారతదేశ జాతీయ డిజిటల్ విద్యా వేదిక. ఇది బహుభాషా కంటెంట్, ఉపాధ్యాయ కోర్సులు, విశ్లేషణలు, మరియు QR కోడ్‌ల ద్వారా పాఠ్యపుస్తకాలతో అనుసంధానం వంటి సేవలు అందిస్తుంది.

### 8. సంపర్క్ స్మార్ట్ (గ్రామీణ దృష్టి)

- సంపర్క్ ఫౌండేషన్ - స్మార్ట్, సంపర్క్ TV వంటి కార్యక్రమాల ద్వారా ఇంటర్నెట్ అవసరం లేకుండా పనిచేసే డిజిటల్ కిట్స్, కంటెంట్ మరియు ఉపాధ్యాయ శిక్షణను గ్రామీణ పాఠశాలలకు అందిస్తోంది.
- నోయిడాలో CSR మరియు స్థానిక ప్రభుత్వ సహకారంతో సంపర్క్ TVలను 0-5 తరగతులకు పరిచయం చేశారు.

### 10. రాష్ట్ర స్థాయి కార్యక్రమాలు (కేరళ, రాజస్థాన్ మొదలైనవి)

- కేరళ : KITE (IT@School) వర్చువల్ తరగతులు (KITE VICTERS), ఉపాధ్యాయ శిక్షణ, యానిమేషన్ ప్రోగ్రాములు, భాషా ప్రయోగశాలలు, మరియు దివ్యాంగుల కోసం సాఫ్ట్‌వేర్ టూల్స్ అందిస్తోంది. "సంపూర్ణ" అనే పాఠశాల నిర్వహణ వ్యవస్థను కూడా నడుపుతోంది.
- రాజస్థాన్ - Ampersand Group సహకారంతో, 4,010 పాఠశాలల్లో 8,000 పైగా ఇంటరాక్టివ్ స్మార్ట్ క్లాస్ రూమ్‌లను యుపిఎస్ బ్యాక్‌అప్‌లతో ఏర్పాటు చేశారు.

## ఈ సాంకేతిక పరికరాలు ఎలా అమలవుతున్నాయి

### ఎ. మౌలిక వసతులు & పరికరాలు

- స్మార్ట్ TVలు, IFPDs, AR/VR ల్యాబ్స్, రోబోటిక్స్ ల్యాబ్స్, 3D ప్రింటర్లు, UPS బ్యాకప్ వంటి వసతులు అందించబడుతున్నాయి.

### బి. ఉపాధ్యాయ శిక్షణ

- నాగపూర్ (200+ ఉపాధ్యాయులు), సంపర్క్ స్మార్ట్ శాల, రాజస్థాన్ స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు, తెలంగాణ, కేరళ – ఉపాధ్యాయ శిక్షణపై ఎక్కువ దృష్టి పెడుతున్నాయి.

### సి. స్థానిక, చేర్పు కంటెంట్

- DIKSHA, సంపర్క్ ద్వారా బహుభాషా కంటెంట్ అందుబాటులో ఉంది. కేరళ దృష్టి లోపం ఉన్న విద్యార్థులకు ORCA వంటి ఉచిత సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగిస్తోంది. మాతృభాషలో బోధనపై కూడా దృష్టి ఉంది.

### డి. పర్యవేక్షణ & నిర్వహణ

- స్థానిక పాఠశాల నిర్వహణ కమిటీలు మౌలిక వసతుల సంరక్షణలో భాగస్వామ్యం అవుతున్నాయి. సరైన మద్దతు లేకపోతే, స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు రెండు సంవత్సరాలలో పనికి రాకుండా మారతాయి.

### ఇ. పాలసీ & నిధుల మద్దతు

- NEP 2020, సమగ్ర శిక్షా అభియాన్, CSR ఫండింగ్ ప్రధాన సహాయకాలు.

బాలచెలిమి డెస్క్

సైన్సు

# వత్తిలోకి చమురు ఎలా వెలుతుంది?




చేతులు కడుక్కుని బట్టతో తుడుచుకున్నప్పుడు మన చేతి తడి బట్టలోకి ఎల్లా వెళుతుంది? నేలలో ఎక్కడో ఉన్న నీరు చెట్టు చిటారి కొమ్మలకి ఎలా చేరుకుంటుంది? బుడ్డిలోని చమురు వత్తిద్వారా పైకి ఎలా ఎక్కి వెళుతుందీ?

ఈ ప్రశ్నలన్నిటికీ ఒక్కటే సమాధానం.

"తల తన్యత". ఈ తమాషాలన్నీ ఇదే చేస్తూ ఉంటుంది. దీనిని ప్రత్యక్షంగా చూపించే గమత్తు ఒకటి చెబుతా.

సబ్బుతో కడిగి శుభ్రం చేసిన రెండు గాజు పలకలను దగ్గరగా చేర్చి పట్టుకుని, ఒక వైపున "సెలోఫేన్‌టేపు"తో అతికించు. సరిగ్గా రెండోవైపున రెండు మూడు మడతలు పెట్టిన కాగితం ముక్కని రెండు పలకల మధ్య పెట్టి, అటువైపున కూడా టేపుతో అతికించు.

వెడల్పైన పళ్లెంలో ఈ పలకల జంటను నిట్ట నిలువుగా నిలబెట్టు. ఆ పలకలు అడుగు అంచు మునిగే వరకూ పళ్లెంలో నీళ్ళు పొయ్యి. వెంటనే పళ్ళెంలోని నీళ్ళు రెండు గాజు పలకల మధ్యనున్న సన్నని ఖాళీలోకి పైకి ఎక్కుతాయి. (నీళ్ళలో కొద్దిగా సిరా కలిపితే పైకి ఎక్కిన నీళ్లు స్పష్టంగా కనిపిస్తాయి.)

నీళ్లు అన్ని చోట్లా ఒకే ఎత్తుకి ఎక్కకపోవడం గమనించవచ్చు. గాజు పలకల మధ్య దూరం ఎంత తక్కువ అయితే నీళ్లు అంత ఎక్కువగా పైకి ఎక్కుతాయి. మన పలకల మధ్య దూరం అంతటా సమానంగా లేదు కదా? ఎడమవైపున రెండు మూడు మడతలు పెట్టిన కాగితం ఉండడం వల్ల అక్కడ పలకల మధ్య దూరం ఎక్కువ ఉండి, కుడివైపుకి వెళ్లిన కొద్దీ నీటి ఎత్తు తగ్గిపోతుంది.

పళ్లెంలో పోసిన నీళ్లు పలకల మధ్య నున్న ఖాళీలోకి ఎక్కడానికి కారణం ద్రవం తాలూకు తలతన్యత. ఈ బిగింపు వివిధ ద్రవాలకు వేరు వేరుగా ఉంటుంది. నీటిమట్టం మీద ఉండే ఈ బిగింపు వల్లనే నీళ్లు పలకల మధ్య ఖాళీలోకి ఎక్కగలిగాయి. ఎంత ఎత్తు ఎక్కుతాయి? "జలస్తంభపు" బరువు ఈ తలతన్యతకి సమానం అయే వరకూనూ. అందుకనే గొట్టం (లేక పలకల మధ్య ఎడం) ఎంత సన్నంగా ఉంటే అంత ఎక్కువ ఎత్తు ఎక్కుతాయి.

చెట్లు వేళ్లల్లో మిల్లీ మీటరులో సుమారు పదవ వంతు వ్యాసం కలిగిన రంధ్రాలు గల గొట్టాలు ఉంటాయి. వీటిని "కేశనాళికలు" అంటారు. ఈ సన్నని కేశనాళికలు గుండా భూమిలోని నీళ్లు చెట్టుపైకి ఎక్కగలుగుతాయి. దీనినే "కేశికాక్రియ" అంటారు.

దీపపు వత్తి దారపు పోగులతో చేస్తారు. ఈ దీపపు పోగుల మధ్య బహు సూక్ష్మమైన నాళికలు ఉండడం వల్ల బుడ్డిలోని చమురు కేశికాక్రియ వల్ల పైకి ఎక్కుతుంది.

చేతిని ఉన్న తడి బట్టకి తగలగానే ఈ కేశికాక్రియ వల్లనే ఆ నీటిని బట్ట పోగులు పీల్చుకుంటాయి.

పిడకలు కాల్చగా వచ్చిన 'కచిక' నీళ్లను పీల్చుకో గలగడానికి కూడా సరిగ్గా ఇదే కారణం.

– డాక్టర్ మహీధర నళినీ మోహన్

'ప్రతి ఇంటా ప్రయోగశాల' నుండి



# కలంచెలిమి



**ఎ. వైష్ణవి**
10వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాలాజీపల్లి, పెద్ద మందాడి మండలం, వనపర్తి.



**ఆర్. సంపూర్ణ**
9వ తరగతి, కెజిబివి, దుబ్బాక.

**ఎన్. నాగూర్ బీ**
7వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కులాస్‌పూర్, ముగ్పాల్, నిజామాబాద్.



**డి. కావ్య**
10వ తరగతి, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, బన్సీలాల్‌పేట్, సికింద్రాబాద్.






**పి రిషిక**
9వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, లింగన్నపేట, మం: గంభీరావుపేట, జిల్లా: రాజన్న సిరిసిల్ల



**వి. కృష్ణ శ్రీకర్**
8వ తరగతి, అరవింద హై స్కూల్, కుంచనపల్లి.




# భారత రాజ్యాంగంలోని ముఖ్యమైన సవరణల జాబితా

1950 జనవరి 26న ఆమోదించబడిన భారత రాజ్యాంగం మారుతున్న సామాజిక, రాజకీయ మరియు ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా, రాజ్యాంగ సవరణలు కాలానుగుణంగా ప్రవేశపెట్టబడ్డాయి. ఈ సవరణలు భారత ప్రజాస్వామ్య వృద్ధిని ప్రతిబింబిస్తాయి. 42వ (మినీ రాజ్యాంగం) మరియు 44వ సవరణల వంటివి రాజ్యాంగ స్ఫూర్తిని మరియు చట్టాన్ని ప్రాథమికంగా పునర్నిర్మించాయి. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 368 ప్రాథమిక నిర్మాణాన్ని కాపాడుతూ రాజ్యాంగాన్ని సవరించే అధికారాన్ని పార్లమెంటుకు అధికారం ఇచ్చింది.

### భారత రాజ్యాంగంలో ముఖ్యమైన సవరణలు

| రాజ్యాంగ సవరణ | మార్పులు ప్రవేశపెట్టబడ్డాయి |
|---|---|
| 1వ సవరణ చట్టం, 1951 | • చట్టాలను కాపాడటానికి, ఎస్టేట్‌లను సంపాదించడానికి మొదలైన వాటికి వీలు కల్పించడం. • భూ సంస్కరణలు మరియు దానిలో చేర్చబడిన ఇతర చట్టాలను న్యాయ సమీక్ష నుండి రక్షించడానికి తొమ్మిదవ షెడ్యూల్‌ను చేర్చడం. • సామాజికంగా మరియు ఆర్థికంగా వెనుకబడిన తరగతుల అభివృద్ధికి ప్రత్యేక నిబంధనలు చేయడానికి రాష్ట్రానికి అధికారం ఇవ్వడం. • వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటనా స్వేచ్ఛ, ప్రజా క్రమం, విదేశీ దేశాలతో స్నేహపూర్వక సంబంధాలు మరియు నేరానికి ప్రేరేపించడం వంటి పరిమితులకు మరో మూడు కారణాలను జోడించింది. అలాగే, ఇది ఆంక్షలను "సహేతుకమైనది"గా మరియు అందువల్ల న్యాయబద్ధమైనదిగా చేసింది. • రాష్ట్ర వ్యాపారం మరియు రాష్ట్రం ద్వారా ఏదైనా వాణిజ్యం లేదా వ్యాపారాన్ని జాతీయం చేయడం వాణిజ్యం లేదా వ్యాపార హక్కును ఉల్లంఘించడం వంటి కారణాల వల్ల చెల్లదని కూడా ఈ చట్టం పేర్కొంది. • 31A మరియు 31B లను చేర్చడం. |
| 2వ సవరణ చట్టం, 1952 | • లోక్‌సభలో ఒక సభ్యుడు 7,50,000 కంటే ఎక్కువ మందికి ప్రాతినిధ్యం వహించేలా ఏర్పాటు చేయడం ద్వారా ప్రాతినిధ్య స్థాయిని తిరిగి సర్దుబాటు చేయడం. |
| 7వ సవరణ చట్టం, 1956 | • రాష్ట్రాలను నాలుగు వర్గాలుగా, అంటే పార్ట్ ఎ, పార్ట్ బి, పార్ట్ సి, మరియు పార్ట్ డి రాష్ట్రాలుగా విభజించడాన్ని రద్దు చేసి, వాటిని 14 రాష్ట్రాలు మరియు 6 కేంద్రపాలిత ప్రాంతాలుగా పునర్వ్యవస్థీకరించారు. |
| | • హైకోర్టుల అధికార పరిధిని కేంద్రపాలిత ప్రాంతాలకు విస్తరించడం మరియు రెండు లేదా అంతకంటే ఎక్కువ రాష్ట్రాలకు ఉమ్మడి హైకోర్టు ఏర్పాటు. • హైకోర్టు అదనపు మరియు తాత్కాలిక న్యాయమూర్తుల నియామకానికి వీలు కల్పించబడింది. • రెండవ షెడ్యూల్ సవరణ. • రాజ్యాంగంలోని ఏడవ షెడ్యూల్‌లోని ఆస్తి సముపార్జన మరియు స్వాధీనానికి సంబంధించిన జాబితాలకు మార్పులు. |

| | |
|---|---|
| 10వ సవరణ చట్టం, 1961 | • దాద్రా మరియు నాగర్ హవేలీలను భారత యూనియన్‌లో విలీనం చేయడం ద్వారా రాష్ట్రపతి ఆ భూభాగంలో శాంతి, పురోగతి మరియు మంచి ప్రభుత్వం కోసం నిబంధనలు రూపొందించడానికి వీలు కల్పిస్తారు. |
| 15వ సవరణ చట్టం, 1963 | • హైకోర్టులు తమ ప్రాదేశిక పరిధిలోకి వచ్చే కారణం తలెత్తితే, తమ ప్రాదేశిక అధికార పరిధికి వెలుపల కూడా ఏ వ్యక్తికైనా లేదా అధికార సంస్థకైనా రిట్లు జారీ చేసే అధికారం కల్పించారు. హైకోర్టు న్యాయమూర్తుల పదవీ విరమణ వయస్సును 60 నుండి 62 సంవత్సరాలకు పెంచారు. • ఆర్టికల్ 297, 311, మరియు 316లలో సవరణ. • హైకోర్టుల పదవీ విరమణ చేసిన న్యాయమూర్తులను అదే కోర్టులో తాత్కాలిక న్యాయమూర్తులుగా నియమించడానికి నిబంధన. • ఒక హైకోర్టు నుండి మరొక హైకోర్టుకు బదిలీ అయిన న్యాయమూర్తులకు పరిహార భత్యం అందించబడింది. • హైకోర్టు పదవీ విరమణ చేసిన న్యాయమూర్తి సుప్రీంకోర్టులో తాత్కాలిక న్యాయమూర్తిగా వ్యవహరించడానికి వీలు కల్పించడం. |
| 24వ సవరణ చట్టం, 1971 | • ప్రాథమిక హక్కులతో సహా రాజ్యాంగంలోని ఏ భాగాన్ని అయినా సవరించడానికి పార్లమెంటుకు ఉన్న అధికారాన్ని ధృవీకరించడం. • రాజ్యాంగ సవరణ బిల్లుకు రాష్ట్రపతి తన ఆమోదం తెలియజేయడం తప్పనిసరి చేయబడింది. • ఈ చట్టం రాజ్యాంగంలోని ఆర్టికల్ 13ని సవరించి, ఆర్టికల్ 368 కింద రాజ్యాంగంలోని ఏ సవరణకూ వర్తించకుండా చేస్తుంది. |
| 25వ సవరణ చట్టం, 1971 | • కొత్త ఆర్టికల్ 31C పరిచయం. • రాష్ట్ర విధాన నిర్దేశక సూత్రాలను అమలు చేయడంలో ఉన్న అడ్డంకులను అధిగమించడం ఈ సవరణ చట్టం లక్ష్యం. • ఈ చట్టం ప్రాథమిక హక్కును ఆస్తికి పరిమితం చేసింది. |
| 26వ సవరణ చట్టం, 1971 | • ఆర్టికల్ 291 మరియు 362లను తొలగించడం మరియు భారత రాష్ట్రాల పాలకులకు మంజూరు చేయబడిన గుర్తింపును నిలిపివేయడానికి మరియు ప్రైవేట్ పర్సులను రద్దు చేయడానికి కొత్త ఆర్టికల్ 363A ను చేర్చడం. |
| 34వ సవరణ చట్టం, 1974 | • ఈ సవరణ చట్టం రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్‌ను సవరించి సవరించిన పరిమితి చట్టాలను చేర్చాలని ప్రతిపాదించింది. • ఈ చట్టం తొమ్మిదవ షెడ్యూల్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన ఇరవై భూస్వామ్య మరియు భూ సంస్కరణల చట్టాలను కూడా చేర్చింది. |
| 38వ సవరణ చట్టం, 1975 | • రాజ్యాంగంలోని 38వ సవరణ చట్టం రాజ్యాంగంలోని 123, 213, 239B, 352, 356, 359, మరియు 360 అధికరణలను సవరించడానికి ప్రయత్నిస్తుంది. • భారత రాష్ట్రపతి అత్యవసర పరిస్థితిని న్యాయవిరుద్ధమని ప్రకటించారు. • రాష్ట్రపతి, గవర్నర్లు మరియు కేంద్రపాలిత ప్రాంతాల నిర్వాహకులు ఆర్డినెన్స్‌లను జారీ చేయడం న్యాయవిరుద్ధం. • ఒకేసారి వేర్వేరు కారణాలపై వివిధ జాతీయ అత్యవసర పరిస్థితిని ప్రకటించడానికి అధ్యక్షుడికి అధికారం. |
| 42వ సవరణ చట్టం, 1976 (మినీ రాజ్యాంగం) | • 42వ సవరణ చట్టంలో మూడు కొత్త పదాలు చేర్చబడ్డాయి, అంటే, సోషలిస్ట్, లౌకిక మరియు సమగ్రత, వీటిని ప్రవేశికలో చేర్చారు. • పౌరులు ప్రాథమిక విధులను చేర్చారు (కొత్త భాగం IV A). • ఆర్టికల్ 74 కింద తన విధులను నిర్వర్తించడంలో రాష్ట్రపతి మంత్రి మండలి సలహా మేరకు వ్యవహరించాలి. • ఇతర విషయాలకు పరిపాలనా ట్రిబ్యునళ్లు మరియు ట్రిబ్యునళ్లకు నిబంధనలు అందించబడ్డాయి (భాగం XIV A జోడించబడింది). • 1971 జనాభా లెక్కల ఆధారంగా 2001 వరకు లోక్‌సభ మరియు రాష్ట్ర శాసనసభలలో సీట్ల నిర్వహణ. • న్యాయ పరిశీలనకు మించి రాజ్యాంగ సవరణలు చేయబడ్డాయి. • లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల పదవీకాలం 5 సంవత్సరాల నుండి 6 సంవత్సరాలకు పెంచబడింది. • కొన్ని ప్రాథమిక హక్కులను ఉల్లంఘించనంత వరకు, ఆదేశిక సూత్రాలను అమలు చేయడానికి రూపొందించిన చట్టాలను కోర్టులు చెల్లనివిగా పరిగణించలేవు. • రాష్ట్ర విధానంలో మూడు కొత్త ఆదేశిక సూత్రాలు జోడించబడ్డాయి, అవి, సమాన న్యాయం మరియు ఉచిత న్యాయ సహాయం, పరిశ్రమల నిర్వహణలో కార్మికుల భాగస్వామ్యం మరియు పర్యావరణం, అడవులు మరియు వన్యప్రాణుల రక్షణ. • భారతదేశ భూభాగంలోని ఒక ప్రాంతంలో జాతీయ అత్యవసర పరిస్థితిని ప్రకటించడానికి వీలు కల్పించడం. • ఒక రాష్ట్రంలో ఒకేసారి అమలులో ఉండే రాష్ట్రపతి పాలనను 6 నెలల నుండి ఒక సంవత్సరానికి పొడిగించడం. • విద్య, అడవులు, అడవి జంతువులు మరియు పక్షుల రక్షణ, తూనికలు మరియు కొలతలు మరియు న్యాయ పరిపాలన, రాజ్యాంగం మరియు సుప్రీంకోర్టు మరియు హైకోర్టులు తప్ప అన్ని కోర్టుల సంస్థ వంటి ఐదు అంశాలను రాష్ట్ర జాబితా నుండి ఉమ్మడి జాబితాకు తరలించారు. • అఖిల భారత న్యాయ సేవ స్థాపన. |
| 44వ సవరణ చట్టం, 1978 | 44వ సవరణ చట్టంలో, సుప్రీంకోర్టు మరియు హైకోర్టుల అధికారాలలో కొన్నింటిని పునరుద్ధరించారు. • జాతీయ అత్యవసర పరిస్థితికి సంబంధించి "అంతర్గత కల్లోలం" అనే పదాన్ని "సాయుధ తిరుగుబాటు"తో భర్తీ చేయడం. • కేబినెట్ లిఖితపూర్వక సిఫార్సుపై మాత్రమే రాష్ట్రపతి జాతీయ అత్యవసర పరిస్థితిని ప్రకటించేలా చేసింది. • ఆస్తి హక్కును ప్రాథమిక హక్కుల జాబితా నుండి తొలగించడం, దానిని చట్టబద్ధమైన హక్కుగా చేయడం. • జాతీయ అత్యవసర పరిస్థితిలో ఆర్టికల్ 20 మరియు 21 ద్వారా హామీ ఇవ్వబడిన ప్రాథమిక హక్కులను నిలిపివేయలేము. (సశేషం...) |



































# బాలల పుస్తకాల వెల్లువ

తెలుగులో పిల్లల పుస్తకాలను రెండు దశాబ్దాలుగా మంచి పుస్తకం సంస్థ ప్రచురిస్తోంది. తానా సంస్థ భాగస్వామ్యంతో 2017 నుంచి పలు మూల రచనలను (నవలలు, బొమ్మల కథలు) వెలువరించింది. ఈ రెండు సంస్థలు కలిసి 2025 ఆగస్టు 9న ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ ఆడిటోరియంలో పన్నెండు పుస్తకాలను ఆవిష్కరించాయి.

ఈ ఆవిష్కరణ సభకి కథాసాహితి సంపాదకులు వాసిరెడ్డి నవీన్ అధ్యక్షత వహించారు. తానా – మంచి పుస్తకం భాగస్వామ్యంలో ఇప్పటివరకు 26 నవలలు, 33 బొమ్మల కథలు ప్రచురితం కావటం సంతోషంగా ఉందని ఆయన చెప్పారు. పదేళ్ల లోపు పిల్లల కోసం 2025లో ఎంపికైన అయిదు బొమ్మల కథలను జె.ఎన్.యు. ఆర్కిటెక్చర్ & ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య టి. గంగాధర్ ఆవిష్కరించి, పుస్తక రచయితలను, చిత్రకారులను అభినందించారు. బాల సాహిత్యంలో 'వినోదం, విజ్ఞానం, విలువలు' తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. 'బాల చెలిమి' పత్రికతో, బాల సాహిత్యంతో తన అనుబంధాన్ని పంచుకున్నారు.

పదేళ్లు పైబడిన పిల్లల కోసం ఎంపికైన అయిదు నవలలను తానా ట్రస్ట్ సభ్యులు రవి పొట్లూరి ఆవిష్కరించారు. పిల్లల్లో పుస్తకాల పట్ల ఇష్టాన్ని పెంచటానికి తానా సంస్థ పాత్ర ఉండటం తనకు సంతోషాన్ని ఇస్తోందని, మంచి పుస్తకంతో భాగస్వామ్యం భవిష్యత్తులో కూడా ఇలా కొనసాగుతుందని చెప్పారు. బొమ్మల కథలను ది బుక్ షెల్ఫ్ గ్రంథాలయ వ్యవస్థాపకురాలు హరిప్రియ బత్తుల, నవలలను ఆకాశవాణి విజయవాడ విశ్రాంత డైరెక్టర్ ముంజులూరి కృష్ణకుమారి పరిచయం చేశారు.

రేడియో రామం రాసిన చింటు – బిజ్జు నవలికను ఆకాశవాణి విశ్రాంత అసిస్టెంట్ డైరెక్టర్ సి. ఎస్. రాంబాబు ఆవిష్కరించి, పరిచయం చేశారు. లయబద్ధమైన పాటలతో ఉన్న ఈ నవలిక ఆడియో రూపకంగా రక్తి కట్టిస్తుందని చెప్పారు.

మనస్విని పాల్వాయి రాసి, బొమ్మలు వేసిన 'అమ్మ అమ్మమ్మ బతుకమ్మ' బొమ్మల కథ పుస్తకాన్ని బాల చెలిమి సంపాదకులు యం. వేదకుమార్ ఆవిష్కరించి పరిచయం చేశారు. తెలంగాణ సంస్కృతిని పరిచయం చేస్తూ, ఆకట్టుకునే రంగులతో బొమ్మలు వేసిన మనస్వినిని అభినందించి, ఆశీర్వదించారు.


సభకి వచ్చిన రచయితలు, చిత్రకారుల తమ స్పందనలు, కథ వెనక నేపథ్యాన్ని పంచుకున్నారు. ఇందులో చాలా మంది ఇది తమ మొదటి పుస్తకం కావటం సంతోషంగా ఉందని చెప్పారు. తల్లిదండ్రులతో వచ్చిన పిల్లల సందడితో పుస్తకావిష్కరణ సభకు శోభని ఇచ్చింది. మంచి పుస్తకం తరఫున వి. ఎస్. పవిత్ర వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

– బాల చెలిమి డెస్క్

# మోవా

## ఎగరలేని ప్రాచీన పక్షి

న్యూజిలాండ్‌లో ఎన్నో వేల ఏళ్లుగా జీవించిన ఒక విశేషమైన పక్షి మోవా. ఇవి చాలా పెద్దవి, ఎగరలేని పక్షులు. మొవా శాకాహారి.. అంటే మొక్కలు, ఆకులు తిని బ్రతికేది. ఇవి భూమిపై తిరుగుతూ జీవించేవి. కొన్ని మోవాలు టర్కీ పరిమాణంలో ఉండగా, కొన్ని రెండు మీటర్ల కంటే ఎక్కువ ఎత్తుతో ఉండేవి. డైనోర్నిస్ నోవాజీలాండియే అనే నార్త్ ఐలాండ్ జెయింట్ మోవా రెండవ అతిపెద్ద జాతిగా ఉంది.



ఈ మోవాలకు రెక్కలు ఉండేవి కానీ ఎగరలేవు. ఎందుకంటే, వీటి శరీర నిర్మాణంలో ఎగరడానికి అవసరమైన ఎముకలు, కండరాలు ఉండవు. ముఖ్యంగా మోవాకు 'కీల్' అనే ఎముక భాగం ఉండదు. ఇది ఇతర పక్షుల స్టెర్నమ్ (రొమ్ము ఎముక)లో ఉంటుంది. మోవా పొడవైన మెడ, కాళ్లు బలంగా ఉంటాయి. పుర్రె పరిమాణం చిన్నది. పుర్రె కొద్దిగా వంగిన ముక్కుతో ఉంటుంది. మోవా శిలాజాలను శాస్త్రీయంగా మొదటిసారి 1839లో ఇంగ్లీష్ శాస్త్రవేత్త సర్ రిచర్డ్ ఓవెన్ వివరించారు. అతను శిలాజాల్లో భాగంగా ఉన్న తొడ ఎముక నిర్మాణాన్ని పరిశీలించి, ఇది ఏదైనా పెద్ద పక్షికి చెందిందని గుర్తించాడు. ఇది అప్పుడు ఉన్న ఇతర పక్షులతో పోలిస్తే చాలా పెద్దదిగా ఉండటం ఓవెన్‌కు ఆశ్చర్యం కలిగించింది. అప్పటి నుంచి మోవా శిలాజాలు, వాటి శరీర నిర్మాణం మరియు జన్యు విశ్లేషణ ఆధారంగా మొత్తం తొమ్మిది జాతుల మోవాలు గుర్తించబడ్డాయి. ఈ పక్షులు మిలియన్ల సంవత్సరాలుగా అటవీ, పొదలు, తీరప్రాంతాలలో జీవించాయి.

1895లో కెప్టెన్ FW హట్టన్ నుండి ఈ అస్థిపంజర నమూనాను £30కి కొనుగోలు చేశారు. ఈ అస్థిపంజరాన్ని కలప మౌంట్‌పై ఉంచి, తారాగణం పుర్రె మరియు వేరుగా ఉన్న బొటనవేలు ఎముకలను ప్రత్యేక పెట్టెలో నిల్వ చేశారు. ఈ నమూనా నిర్మాణానికి వివిధ ప్రదేశాల నుండి శిలాజ ఎముకలను తీసుకొని సమీకరించారు. అసలు రికార్డులో దీనిని డైనోర్నిస్ మాగ్జిమస్ అని పిలిచినప్పటికీ, అదే ఇప్పుడు డైనోర్నిస్ నోవాజీలాండియే అనే పేరుతో గుర్తించబడింది.

1250-1300 మధ్య న్యూజిలాండ్‌కు మానవుల ప్రవేశంతో మోవా పక్షులు వేటకు గురైనాయి. మానవ వేటతో పాటు జీవావరణ మార్పులు వాటి నిర్మూలనకు దారితీసాయి. మోవా ఎముకలు, ఆహారపు అవశేషాలు మరియు పాతకాలపు వస్తువుల రూపంలో న్యూజిలాండ్‌లోని తవ్వకాలలో లభించాయి. మోవా పూర్తిగా అంతరించి పోవడానికి దాదాపు ఒక శతాబ్దమే పట్టింది. తరువాత వచ్చిన యూరోపియన్ వలస దారులు, వారు తీసుకు వచ్చిన కుక్కలు, పిల్లులు, ఎలుకలు వంటి జంతువులు ఇతర దేశీయ జాతులపైన కూడా ప్రభావం చూపాయి.

1300 – మానవుల రాక, వేట మొదలు

1400 – మోవా అంతరించిపోవడం

1800 – శిలాజాలపై అధ్యయనాలు ప్రారంభం

డైనోర్నిస్ నోవాజీలాండియే యొక్క అస్థిపంజర నమూనా 1895లో నేషనల్ మ్యూజియం ఆఫ్ ఐర్లాండ్ కొనుగోలు చేసింది. NMINH:F8784 స్పెసిమెన్ వంటి నమూనాలు నేషనల్ మ్యూజియం ఆఫ్ ఐర్లాండ్ – నేచురల్ హిస్టరీ శాస్త్రీయ సేకరణలో భాగంగా ఉంది. కానీ ప్రస్తుతానికి ప్రజలకు అందుబాటులో లేదు. బాల్కనీలో ఈ పక్షుల ఇతర నమూనాలు ఉన్నాయి.

– సచిన్ కోత్వాల్

## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, లక్ష్మీపూర్, ఆదిలాబాద్ జిల్లా

# ఆదర్శం - లక్ష్మీపూర్ బడి గ్రంథాలయం

లక్ష్మీపూర్ ఉన్నత పాఠశాలలో ఉన్న గ్రంథాలయం విద్యార్థుల పఠన అభిరుచిని పెంపొందించడంలో ప్రధాన పాత్ర పోషిస్తోంది. ఈ గ్రంథాలయాన్ని సక్రమంగా వినియోగించుకున్న విద్యార్థులు అనేక పోటీల్లో బహుమతులు సాధిస్తున్నారు. NRIVA - పుస్తక మిత్ర సంస్థ రూ. 40000 విలువ చేసే 700 పుస్తకాలని లక్ష్మీపూర్ ఉన్నత పాఠశాల గ్రంథాలయానికి అందించడం జరిగింది. బాలచెలిమి, మొలక లాంటి పిల్లల పత్రికలు కూడా ప్రతి నెల వస్తున్నాయి. ప్రతిరోజు దినపత్రిక కూడా అందుబాటులో ఉంటుంది. ప్రతి బుధవారం నాడు అన్ని తరగతులకు చెందిన విద్యార్థులు ఒక్కొక్క పీరియడ్ గ్రంథాలయానికి వస్తుంటారు. ఆ పీరియడ్లో పుస్తకాలు చదవడంతో పాటు ఇంటివద్ద చదవడానికి ఒక పుస్తకాన్ని తీసుకెళుతుంటారు. మళ్ళీ బుధవారం నాడు ఆ పుస్తకాన్ని తిరిగి ఇచ్చి మరొక పుస్తకాన్ని తీసుకెళ్తుంటారు. ఇలా గ్రంథాలయ పుస్తకాలని విద్యార్థులకు ఇంటి వద్ద చదవడానికి అవకాశం కల్పించడం జరుగుతున్నది. ప్రతిరోజు మధ్యాహ్నం 'లంచ్ లైబ్రరీ' అందుబాటులో ఉండటం వలన భోజన విరామ సమయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటున్నారు. విద్యార్థులు వేసవికాలం సెలవులను సద్వినియోగం చేసుకోవడానికి పాఠశాలలో 'వేసవి బడి' గ్రంథాలయాన్ని ప్రతి శనివారం వేసవి సెలవుల కాలంలో విద్యార్థులకు పాఠశాలలో పుస్తకాలు ఇవ్వడం జరుగుతున్నది. ఇదంతా విద్యార్థులచే ఏర్పాటుచేసిన ఒక లైబ్రరీ కమిటీ నిర్వహిస్తున్నది. పాఠశాల గ్రంథాలయానికి హిందీ ఉపాధ్యాయులు సీతర్ల మహేష్ ఇంచార్జిగా వ్యవహరించడం జరుగుతున్నది. ఇలా విద్యార్థులలో గ్రంథాలయ వినియోగం ద్వారా పుస్తక పఠనం పట్ల ఆసక్తిని పెంచడం వల్ల విద్యార్థులు రాసిన కథలు బాలచెలిమి, గడుగ్గాయి, చెకుముకి, వివిధ దినపత్రికలలో ప్రచురితం అయ్యాయి. విద్యార్థులు రాసిన కథలకు తెలంగాణ సారస్వత పరిషత్, మాచిరాజు బాల సాహిత్య పీఠం, గడుగ్గాయి లాంటి ఎన్నో సంస్థల నుండి బహుమతులు అందుకోవడం జరిగింది. ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలోని ఆరు అంశాల ఆధారంగా విద్యార్థులు రాసిన "ఆరోగ్య పాఠశాల - లక్ష్మీపూర్ బడి పిల్లల కథలు" పుస్తకాన్ని జిల్లా కలెక్టర్ శ్రీ రాజర్షి షా గారు ఆవిష్కరించారు. బాలచెలిమి ఆగస్టు, 2025 సంచికలో పాఠశాలకు చెందిన విద్యార్థిని తల్లెల కీర్తి (9వ తరగతి) రాసిన 'టీచర్ - పిల్లలు' కథ ప్రచురితం అయింది. విద్యార్థి కథను ప్రచురించిన బాలచెలిమి పత్రిక సంపాదక మండలికి ధన్యవాదములు. ప్రతి నెలా బాలచెలిమి పత్రికను ఉచితంగా అందిస్తూ విద్యార్థుల పఠనాభిరుచిని పెంపొందించడంలో ఎనలేని సహకారం అందిస్తున్నందుకు శ్రీ మణికొండ వేద కుమార్ గారికి పాఠశాల కుటుంబం తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాం. బాలచెలిమి ద్వారా పాఠశాల గ్రంథాలయానికి మరిన్ని పిల్లల పుస్తకాలు అందించడం ద్వారా విద్యార్థుల పురోభివృద్ధికి తోడ్పాటు అందిస్తారని ఆశిస్తున్నాం.








- పోరెడ్డి అశోక్
ప్రధానోపాధ్యాయులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
ZPHS, లక్ష్మీ పూర్, ఆదిలాబాద్ జిల్లా.
m : 9441473049.


## 'పిల్లలకో బహుమతి' కథల సంపుటి ఆవిష్కరణ





మచిలీపట్నం, 09 ఆగస్టు 2025: స్థానిక మహతి లలిత కళా వేదికలో శనివారం సాయంత్రం ప్రసిద్ధ రచయిత శ్రీ ఏడుకొండలు కళ్ళేపల్లి రచించిన బాలల కథల సంపుటి "పిల్లలకో బహుమతి" ఘనంగా ఆవిష్కరించ బడింది. సభాధ్యక్షుడు భవిష్య మాట్లాడుతూ, "ఇప్పటి రోజులలో బాల సాహిత్యం రాయడం గణనీయంగా తగ్గిపోతోందని, ఇలాంటి పిల్లల కథలు పుస్తక రూపంలో వెలువడటం ఎంతో అవసరం" అని అభిప్రాయపడ్డారు. ముఖ్య అతిథి, పుస్తక ఆవిష్కర్త లంకిశెట్టి బాలాజీ, "ఈ కాలంలో పిల్లలు నీతి కథల పుస్తకాలను చదవడం మానేసి యూట్యూబ్ రీల్స్ చూడడంలో ఎక్కువ సమయం గడుపుతున్నారు. అందువల్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలను నీతి కథలు చదవడానికి ప్రోత్సహించాల్సిన అవసరం చాలా ఉంది" అని అన్నారు.

రచయిత ఏడుకొండలు కళ్ళేపల్లి మాట్లాడుతూ, బాల సాహిత్యంలో ఇప్పటివరకు 103 కథలు వివిధ పత్రికల్లో ప్రచురితమయ్యాయని, 100 కథల మైలురాయిని దాటినందుకు సంతోషంగా ఉన్నానని, 31 కథలతో తొలి కథల సంపుటి 'పిల్లలకో బహుమతి'ని విడుదల చేయటం నాకు ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టి. పెద్దిరాజు, అప్పినేడు పోతురాజు, రచయిత కళ్ళేపల్లి తిరుమల రావు, తదితరులు పాల్గొన్నారు.

## జడ్పిహెచ్ఎస్ ఇంద్రవెల్లి పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల సాహిత్య ప్రతిభ ప్రదర్శన




జడ్పిహెచ్ఎస్ ఇంద్రవెల్లి పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులు నాగచైతన్య మరియు వందన ఇద్దరూ తలా ఒక ఆంగ్ల కథల పుస్తకాన్ని రచించారు. "వందన స్టోరీస్" మరియు "నాగచైతన్య స్టోరీస్" పేర్లతో వచ్చిన ఈ రెండు పుస్తకాల రూపకల్పనలో పాఠశాల సాంఘిక శాస్త్ర బోధకురాలు అరుణ బట్టువార్ గారు ముఖ్య పాత్ర పోషించారు.




విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీయడం, భవిష్యత్తులో బాల రచయితలుగా ఎదగడానికి కావాల్సిన చిట్కాలు, మార్గదర్శకతలు అందించడంలో ఆమె కృషి ప్రశంసనీయం.

ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా గారు 'ఆరోగ్య పాఠశాల' కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో ఈ రెండు పుస్తకాలను ఆవిష్కరించారు. విద్యార్థుల సృజనాత్మకతను చూసి కలెక్టర్ గారు వారిని అభినందించారు. భవిష్యత్తులో వారు ఉన్నత స్థాయి బాలకవులు, రచయితలుగా ఎదగాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కథా పుస్తకాలలో – పాఠశాల అనుభవాలు, మార్కులు మరియు గ్రేడింగ్లు, చెడు స్నేహాల ప్రభావం, ఆడపిల్లల విద్య ప్రాముఖ్యత, నైతిక విలువలు, ఆరోగ్య సూత్రాలు వంటి అనేక సామాజిక మరియు విద్యా సంబంధిత అంశాలు చోటు చేసుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామ్మోహన్ గారు, అజయ్ రవీంద్రాచారి, జలంధర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, సంతోష్ బట్టువార్, విద్యాసాగర్, జ్యోత్స్న మరియు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## పిల్లలే ఆవిష్కర్తలుగా... పిల్లలే వక్తలుగా...



నల్లగొండ జిల్లా నకిరేకల్లు మండలంలోని తాటికల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 27 జూలై 2025 శనివారం ఆదర్శవంతమైన బాలసభ నిర్వహణ జరిగింది. సృజనాత్మకతకు పర్యాయపదాలుగా నిలిచే ఈ బాలసభల్లో పిల్లలే ఆవిష్కర్తలు, వక్తలుగా నిలిచారు. తాజాగా, ప్రముఖ బాలసాహితీవేత్త కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి గారి రచన "ఊగుతున్న ఉయ్యాల" పుస్తక ఆవిష్కరణ తాటికల్లు పాఠశాల విద్యార్థుల చేతులు ద్వారా జరిగింది. ఈ కార్యక్రమంలో వేదికపైకి

ఆహ్వానించే సమన్వయకర్త, ఆవిష్కర్త, అతిథులు వందనం సమర్పణ వరకు పిల్లలే స్వయంగా నిర్వహించారు. పుస్తక ఆవిష్కరణ సభ ఎనిమిదో తరగతి విద్యార్థి ఏరకొండ ఉదయశ్రీ వక్తలను, అతిథులను వేదికపైకి పిలవడం ద్వారా ప్రారంభమైంది. పుస్తక ఆవిష్కర్తగా పదవ తరగతి విద్యార్థిని మేడ హిమవర్షిని, సభాధ్యక్షురాలుగా తొమ్మిదో తరగతి విద్యార్థిని చనగాని సాత్విక సక్రమంగా వ్యవహరించారు.

అనంతరం 20 మంది పిల్లలు "ఊగుతున్న ఉయ్యాల" పుస్తకంలోని గేయాలను విశ్లేషిస్తూ, పిల్లలకు నేర్పే విలువలను చర్చించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి మేక నాగయ్య మాట్లాడుతూ, ఇలాంటి బాలసభలు పిల్లలలో ఆత్మవిశ్వాసం, నాయకత్వ నైపుణ్యాలను పెంపొందిస్తాయి" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వెంకన్న, తిరుమలయ్య, హరీష్ చంద్ర, మార్త రాములు, డా. సాగర్ల సత్తయ్య, నర్రా వెంకటరెడ్డి, లొట్లపల్లి కోటయ్య, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలు

తెలంగాణ భాషాసంస్కృతులను భావితరాలను అందించాల్సిన బాధ్యత మనది. ఎందరో కవులు, రచయితలు పద్య, గద్య ప్రక్రియల ద్వారా మన సంస్కృతి సంప్రదాయాలతో పాటు, మానవత్వాన్ని పెంపొందించే విలువలతో కూడిన సాహితీ సౌరభాలను వెదజల్లినారు. ఈ విద్యార్థుల మనోఫలకంపై మన కవుల, రచయితల ముద్రలను చిరస్మరణీయంగా ఉంచాలను తలంపే తెలంగాణ సాహితీ దిగ్గజాలు (బమ్మెర పోతన, దాశరథి కృష్ణమాచార్య, కాళోజీ నారాయణ రావు, వట్టికోట ఆళ్వారు స్వామి, వానమామలై వరదాచార్యులు, సురవరం ప్రతాపరెడ్డి, సి. నారాయణరెడ్డి, సామల సదాశివ, పాకాల యశోదారెడ్డి....) కవితా వైభవంపై పోటీల నిర్వహణ.

పోటీల నమోదుకు చివరి తేది : 18.09.2025,

తదుపరి వివరాల కొరకు :

**రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ, తెలంగాణ**

**8008791827, 9440236467**

## భావితరాలకు బహుమానంగా బాల సాహిత్యం

### అనంత సాగర్‌లో రెండు బాలల పుస్తకాల ఆవిష్కరణ

తేదీ: 21.08.2025, గురువారం సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలంలోని అనంత సాగర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు రచించిన "అనంత సాగర్ అక్షర కెరటాలు" అనే బాలల కథల పుస్తకాన్ని బాల చెలిమి మరియు




దక్కన్ ల్యాండ్ సంపాదకులు మణికొండ వేదకుమార్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామానికి ఒక చరిత్ర ఉంటుందని, ఆ చరిత్రను రచించి పుస్తక రూపంలో భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ లక్ష్యంతోనే బాలలు సాహిత్యాభిరుచి పెంచుకుని రచనలపై దృష్టి పెట్టాలన్నారు. బాలల రచనలు ప్రచురించేందుకు చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ నుంచి సహాయం లభిస్తుందన్నారు. ఉపాధ్యాయులు బాల సాహిత్యాన్ని ప్రోత్సహించాలని, రేపటి సమాజానికి ఉత్తమ పౌరులు అందించేది సాహిత్యమేనని, విద్యార్థులు పుస్తకాలను చదవాలని, గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు విభాగ ఆచార్యులు డా. రఘు ఏడవ తరగతి విద్యార్థి బి. విశ్వతేజ రచించిన "విశ్వతేజం" కథల పుస్తకాన్ని ఆవిష్కరించారు. చిన్న వయసులోనే విద్యార్థులు కథలు వ్రాయడం అద్భుతమని, ఇది వారి సమగ్ర అభివృద్ధికి ఉపయోగపడుతుందని, కథలు మన జీవన వికాసానికి సోపానాలుగా నిలుస్తాయని వ్యాఖ్యానించారు.


ప్రధానోపాధ్యాయురాలు కోట జ్యోతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో భైతి దుర్గయ్య సంపాదకత్వంలో రూపొందించిన పుస్తకాల ఆవిష్కరణ అనంతరం పాఠశాలలో బాల చెలిమి గ్రంథాలయం ప్రారంభించారు. పాఠశాల గ్రంథాలయానికి 100కి పైగా పుస్తకాలు బహూకరించారు.

ఈ కార్యక్రమంలో బాల సాహితీ వేత్తలు గరిపెల్లి అశోక్, కథల తాతయ్య రాజమౌళి, తోట మధుసూదన్, గ్రామస్తులు ధర్మయ్య, కిష్టారెడ్డి, బాబయ్య, ఉపాధ్యాయులు శ్రీదేవి, సమ్మయ్య, నరేష్, దుర్గయ్య, పర్శరాములు, బాల చెలిమి ప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు, యువకులు, సాహిత్య ప్రేమికులు పాల్గొన్నారు.

*– బాలచెలిమి డెస్క్*

# ఆర్. విద్యాసాగర్ రావు

ఆర్. విద్యాసాగర్ రావు గారు 1939 నవంబర్ 14న సూర్యాపేటలో జన్మించారు. బాల్యంనుండే చదువుపై ఆసక్తితో, విద్యార్జనలో ఉత్తమ ప్రతిభను కనబరిచారు. ఓస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఇంజినీరింగ్ పూర్తి చేసి, నీటిపారుదల రంగంలో ప్రవేశించారు. ప్రభుత్వ సేవల్లో జూనియర్ ఇంజనీర్‌గా పని ప్రారంభించి, కేంద్రీయ జల సంఘంలో అనేక కీలక స్థానాల్లో సేవలందించి, చివరికి చీఫ్ ఇంజనీర్‌గా పదవీ విరమణ పొందారు. అనంతరం అంతర్జాతీయ స్థాయిలో, UNEP వంటి సంస్థల్లో జల వనరుల అభివృద్ధికి కన్సల్టెంట్‌గా పని చేశారు.



నదుల నీటి వినియోగంపై, రాష్ట్రాల మధ్య వాటాలపై ఆయనకు లోతైన అవగాహన ఉండేది. ప్రజల్లో జలవనరులపై చైతన్యం కలిగించేందుకు అనేక వ్యాసాలు రాసారు. “నీళ్లు - నిజాలు” అనే గ్రంథం ద్వారా నదుల హక్కులపై సమగ్రమైన దృక్పథాన్ని ప్రజల్లో నాటారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆయన ప్రావీణ్యం మరింత వెలుగులోకి వచ్చింది. నీటి హక్కులపై ఆయన వివరణలు, సాంకేతిక అర్థవంతతతో పాటు రాజకీయ స్పష్టతను కలిగి ఉండేవి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ప్రభుత్వం ఆయనను నీటిపారుదల సలహాదారుగా నియమించి, పలు ప్రాజెక్టుల రూపకల్పనలో ఆయన సూచనలను అమలు చేసింది. కాలేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు ఆయన ఆలోచనల ఫలితంగా ముందుకు వచ్చాయి.

ఇంజినీరింగ్ రంగంతోపాటు, సాహిత్యం, నాటకం, సినీ రంగాలపై కూడా ఆయనకు మక్కువ ఉండేది. రేడియో నాటకాలు, టెలివిజన్ స్క్రిప్టులు రచించడం, కొన్ని సినిమాలలో నటించడం ద్వారా తన మల్టీ-టాలెంటెడ్ వ్యక్తిత్వాన్ని చాటారు. “జై బోలో తెలంగాణ” వంటి సినిమాల్లో కనిపించిన ఆయన పాత్రలు ప్రజల హక్కుల పట్ల ఉన్న తన నిబద్ధతను ప్రతిబింబించాయి. జలవనరులపై గల తన అధ్యయనంతో తెలుగునాటలో ఆయన ఒక ప్రాముఖ్యత గల జ్ఞానవేత్తగా నిలిచారు.

ఆయన సేవలకు గుర్తుగా అనేక పురస్కారాలు లభించాయి. 2014లో ఇండియన్ ఇంజనీర్స్ అసోసియేషన్ ఆయనను “లీడింగ్ ఇంజినీరింగ్ పర్సనాలిటీ”గా గుర్తించింది. ఆయన జన్మదినం నవంబర్ 14ను తెలంగాణ ప్రభుత్వం “నీటిపారుదల దినోత్సవం”గా జరుపుతోంది. 2017 ఏప్రిల్ 29న హైదరాబాదులో ఆయన మరణించారు. ఆయన స్మృతిలో దిండి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు ఆయన పేరు పెట్టారు. విద్యాసాగర్ రావు గారు ప్రజల కోసం తన జీవితాన్ని అంకితంగా అర్పించిన జలయోధుడు. ఆయన మార్గదర్శనాలు భవిష్యత్ తరాలకు ప్రేరణగా నిలిచి పోతాయి.

- సువేగా

# CENTRAL BOOK SHOP

**ABIDS**

5-9-186,Behind SBH(H.O)
Gunfoundry,Hyd-1.
Ph: 66468646,23203108

**AMEERPET**

Lane Opp.Green Park Hotel,
Hyderabad.
Ph: 2340 0789

CBS Global Service

CENTRAL BOOK SHOP
ABIDS / AMEERPET

- **SCHOOL BOOKS**
- **GENERAL BOOKS**
- **STATIONARY & GIFTS**





Printed at : Deccan Press, Azamabad, Hyderabad-20, Ph : 90599 50055

**BALA CHELIMI,** Telugu Children's Monthly Magazine
Date of Publication: 23rd Every Month
Postal Dates: 24th & 26th Every Month
Posting at BPC IV, Patrika Channel, Nampally, Hyderabad-500001.

RNI Regn. No. 52828/1992 TC No. TELTEL01232
Postal Regn.No.HCD-5022/2024-2026


# చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ

హైదరాబాద్ (Regd. 720/1982)

బాల చెలిమి
పిల్లల వికాస పత్రిక

## తెలంగాణ బడి పిల్లల కథలు



10 పుస్తకాల సెట్ ధర రూ.330 • తగ్గింపు ధర రూ. 300

పిల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆట బొమ్మలు, కథల పుస్తకాలే. పాఠ్యపుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి. చరిత్ర, సంస్కృతి, కళలు, సైన్స్, మానవ స్వభావాలు, జంతు స్వభావాలు, ఆరోగ్య సంబంధిత అంశాలు - ఒకటేమిటి ప్రాథమిక విజ్ఞానఖని బాలసాహిత్యం, పిల్లలో నైతికతను, ఆధ్యాత్మికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను బాలసాహిత్యమే నెరవేర్చగలదు.

ఇవి అచ్చంగా మన పిల్లలు రాసిన కథలు, స్వచ్ఛమైన కథలు. 'చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ' తెలంగాణలోని ఉమ్మడి 10 జిల్లాల **"బడి పిల్లల కథలు"** సంకలనాలుగా అందమైన బొమ్మలతో గతంలో వెలువరించింది. అవి రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ విశేష ఆదరణ పొందాయి.

అలాగే ఇప్పుడు పిల్లలకోసం తెలంగాణలోని ఉమ్మడి పది జిల్లాల బాల సాహిత్య రచయితలు రాసిన **"పెద్దలు రాసిన పిల్లల కథలు"** పది సంకలనాలను అందమైన బొమ్మలతో వెలువరించింది. చిన్నారులు, పెద్దలు, సాహితీ వేత్తలు ఎప్పటివలె ఈ పుస్తకాలను ఆదరిస్తారని ఆశిస్తున్నాం.

-మణికొండ వేదకుమార్
చైర్మన్, చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ

## పెద్దలు రాసిన పిల్లల కథలు (ఉమ్మడి పది జిల్లాలు)



10 పుస్తకాల సెట్ ధర రూ.350 • తగ్గింపు ధర రూ. 300





ప్రతులకు

అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు. మరియు
'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్ నెం.12,
హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029
ఫోన్ : 9030 6262 88
*email: edit.chelimi@gmail.com* *website : www.balachelimi.com*

## చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన ఇతర పుస్తకాలు




Printed at : Deccan Press, Azamabad, Hyderabad-20, Ph : 90599 50055

Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, H.No.1-9-1126/B, Azamabad, Musheerabad, Hyderabad-500020, Telangana State.
Published at "CHANDRAM", # 3-6-712/2, 12th Street, Himayatnagar, Hyderabad-500029, Telangana.
Editor: Manikonda Vedakumar. RNI Reg No. 52828/92, Tc No: TEL Tel01232.
Cell : 9030626288, Mail ID : edit.chelimi@gmail.com